ఆంధ్ర ప్రదేశ్

మార్చి-
ఏప్రిల్
1973

50 పై



ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్రి జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.

* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బొరైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బొరైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 17

మార్చి-ఏప్రిల్, 1973
ఫాల్గుణం 1893-వైశాఖ 1894 శా. శ.

సంచికలు : 5, 6

ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు :
ఊరంకి వెంకట సుబ్బారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

ముఖచిత్రం : అలంపూర్ దేవాలయ దృశ్యం

మూడవ అట్ట : కొండల నుండి మైదానాల్లోకి

చివరి అట్ట : హైదరాబాదులో జరిగిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో సమాచారశాఖ స్టాలు

సాలు చందా : ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టరు నెం : 133

సంచికలో

పేజీ

3. ప్రజాసారథి ప్రకాశం
6. స్వాతంత్ర్య సమరయోధుడు : రాజాజీ
8. దేశంలో కల్లా ఉత్తమ పంచాయతీ: గుడ్లవల్లేరు
12. స్వాతంత్ర్యోద్యమంలో హరిజనోద్ధరణ ఘట్టం
14. మన సమాజము - వర్ణాంతర వివాహాలు
17. కోడి పోరు
21. జల్లి సమిష్టి క్షేత్రం
23. కీ॥ శే॥ మునిమాణిక్యం
25. ఇద్దరు చాలు
26. తెలుగు సాహిత్యం మీద బంగ్లాదేశ్ ప్రభావం
29. శ్రీకాకుళం జిల్లాలో ఆకర్షణలు
34. మహాభారతము (సీరియల్)
41. రాజా వెంకటరెడ్డి
43. జీడికల్లు క్షేత్రము
46. రైతుబిడ్డ (కథానిక)
52. ఓరుగల్లు పునరాక్రమణ (సీరియల్)
56. విదేశీ యాత్రికులు - హోటలు పరిశ్రమ
58. గ్రంథ సమీక్ష
61. జిల్లా వార్తలు

ప్రజల్లో మళ్లీ కొత్త విశ్వాసం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపతి పాలన క్రిందకు వచ్చిన కొద్దికాలంలోనే రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడం, పరిపాలనా యంత్రాంగం యొక్క ప్రధాన కర్తవ్యంగా రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయిదేశాయ్, ఆయన సలహాదారు శ్రీ హెచ్.సి. శరీన్ భావించారు. రాష్ట్రంలో ఆవేశపూరిత వాతావరణం నెలకొని వుండి, శాంతి భద్రతల పరిరక్షణ చాలా క్లిష్టంగా వున్నప్పటికీ, శాంతియుత వాతావరణాన్ని చాలా అద్భుతంగా త్వరిత గతిని పునరుద్ధరించడం జరిగింది. అపూర్వమైన రీతిగా దీర్ఘకాలం పాటు సమ్మెచేసిన అనంతరం ప్రభుత్వోద్యోగులు తిరిగి పనులకు హాజరు కావడం విద్యార్థులు తరగతులకు హాజరుకావడం చెప్పుకోదగ్గ విజయాలు. ఈ సమస్యా పరిష్కారంలో ఎంతో నేర్పు ఎంతో విజ్ఞత అవసరమైనవి.

శాంతి భద్రతల్ని పునరుద్ధరించే బృహత్తర కృషి కొనసాగిస్తూనే, ఒకవంక రోడ్డు, రైలు, రవాణా సౌకర్యాల్ని పునరుద్ధరించడం; యింకోవంక విద్యుచ్ఛక్తి కొరతను, నీటి ఎద్దడిని ఎదుర్కోవడం జరిగింది. ప్రాతిపదిక సౌకర్యాల్ని ప్రజలకు కల్పించడంలో ప్రతి స్థాయిలోనూ శాయశక్తులా వీలయినంత ఎక్కువగా సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్న రాష్ట్రపతి పాలనా నిర్వహణ, ముఖ్యంగా శ్రీ శరీన్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధాసక్తులు ప్రజల మన్ననలు పొందాయి. కిరసనాయిలు, ఆహారధాన్యాలు తదితర నిత్యావసర వస్తువుల పంపిణీకి ఎక్కువ ప్రాధాన్యం యివ్వబడింది. విద్యా సంవత్సరం వృధా కాకుండా కాపాడడంలోనూ, శాంతియుతంగా పరీక్షలను నిర్వహించడంతో సహా విద్యకు సంబంధించిన విషయాలలో శ్రీ శరీన్ చూపించిన ఆదురా, ఆసక్తివల్ల విద్యార్థుల కృతజ్ఞతాపూర్వకమైన అభిమానాన్ని ఆయన చూరగొనగలిగారు.

సాధించిన ఈ విజయాలవల్ల పరిపాలనా యంత్రాంగపు ప్రతిష్ఠ పెరగడమేగాక ప్రజల సంక్షేమానికీ, ప్రభుత్వోద్యోగుల సంక్షేమానికీ అనేక చర్యలు కూడా తీసుకోవడం జరిగింది. అధ్యాపకులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక పరిపాలనా సిబ్బందితో సహా ప్రభుత్వోద్యోగులకు కరువు భత్యాన్ని పెంచాలనీ, ఉద్యోగ విరమణ తేదీకి ముందు పన్నెండు నెలల సగటు జీతం ఆధారంగా పింఛను నిర్ణయించాలనీ, ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల్లో పూర్తిగా ప్రభుత్వ సహాయం పొందే ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల టీచింగ్ గ్రాంట్లకు సంబంధించిన పాత బకాయీలను చెల్లించడానికి వీలుగా నిధులను విడుదల చేయాలనీ, ఉపాధికల్పన, సాంఘిక సంక్షేమం అనే ఒక ప్రత్యేకశాఖను ఏర్పాటుచేయాలనీ, గెజెటెడ్, నాన్ గెజెటెడ్ ఉద్యోగుల ప్రమోషన్ కమిటీలను ఏర్పాటుచేయాలనీ తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వంచేసిన అనేక మంచిపనులలో కొన్ని మాత్రమే ఈ చర్యలన్నిటికీ సర్వత్రా హర్షామోదాలు లభించాయి. వీటికితోడు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరీక్ష, తెలంగాణాలోని గిరిజన విద్యార్థుల ప్రాథమిక విద్యాభివృద్ధివంటి సంక్షేమ పథకాలు, సత్వరం చేపట్టవలసిన కరువు సహాయక కార్యక్రమాలు, తక్కావీ ఋణాల పంపిణీవంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. 1972 డిసెంబరు వరకు విడుదల చేసిన రూ. 28 కోట్లుకాక 1973 జనవరి 1 వతేదీ నుంచి రూ. 9.5 కోట్లను కరువు సహాయక కార్యక్రమాలకై విడుదల చేయడం జరిగింది, రాష్ట్రంలోని వివిధప్రాంతాలకు 60 రిగ్గులకుపైగా పంపి ఈ ఏడాది మొదటి కొద్ది వారాల్లోనే 500 గొట్టపు బావులు త్రవ్వడం జరిగింది. శ్రీ శరీన్ యీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఇదే విధంగా, కడప పోలీసు కాల్పులపై న్యాయ విచారణ, విద్యార్థులపై కేసుల ఉపసంహరణ, డిటెన్యూల విడుదలతో సహా అనేక విషయాలపై సకాలంలో తీసుకున్న చర్యలు ప్రజల్లో మరింత విశ్వాసాన్ని కల్పించాయి.

తక్షణ సమస్యల పరిష్కారానికి యీ విధమైన చర్యల్ని తీసుకోవడమేకాక రాష్ట్ర అభివృద్ధికి కొత్త కొత్త పథకాల్ని వేయడానికీ, ప్రస్తుతం పరిశీలనలోవున్న పథకాల్ని త్వరత్వరగా అమలుపరచడానికీ ప్రభుత్వం మరింతగా అంకితమై పనిచేస్తున్నది భారత దేశంలో ప్రప్రథమంగా ఉష్ణమండలాలలోని పర్రభూములకు సంబంధించిన పంటల అంతర్జాతీయ స్థాయి పరిశోధనా సంస్థనొకదానిని మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో ఏర్పాటు చేయడం, హైదరాబాదులో మరో మూడేళ్ళలో టెలివిజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, కాకినాడలో ఒక ఎరువుల కర్మాగారాన్ని నెలకొల్పడం మొదలగువాటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ప్రకటించింది. విశాఖ ఉక్కు కర్మాగారం ఉత్పత్తి శక్తిని 20 లక్షల టన్నుల నుంచి 30 లక్షల టన్నులకు పెంచే విషయం పరిశీలనలో వుంది. విశాఖ పట్నంలో రూ. 23 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న జింకుశుద్ధి కర్మాగారం 1975 నాటికి పని ప్రారంభిస్తుంది. రూ. 10 కోట్ల ఖర్చుతో సీసంశుద్ధి కర్మాగారాన్ని కూడా నెలకొల్పే అవకాశం వున్నది.

—పి. వి. ఆర్.

'నవ్యాంధ్ర జనకుడు'



ప్రజాసారథి ప్రకాశం

పణతుల నరసింహయ్య

ఆంధ్రకేసరి ఆంధ్రకేసరి అన్నాడుట ఓసారి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్‌గా ఉండిన సర్. సి. ఆర్. రెడ్డి. అది సత్యదూరం కాదన్న సంగతి అందరికీ తెలిసిందే.

ఆంధ్రులు ఆరంభశూరులు మాత్రమే అన్న అపప్రథను పోగొట్టి, వారు కార్యశూరులన్న విషయాన్ని పలు తావుల్లో, పలు రీతుల్లో నిరూపించినవాడు మన ప్రకాశం. ప్రజలే ప్రకాశం – ప్రకాశమే ప్రజ అని అనిపించాడు. ప్రజలకు అతని వలె చాల సన్నిహితుడైన నాయకుడు మరొకడేడీ ? అంతటి ధైర్య సాహసాలు గల సారథి మరొకడున్నాడా ?

ప్రకాశం కేవలం ఆంధ్రకేసరి మాత్రమేకాదు. ఆయన జాతీయ కేసరి అన్నాడీ మధ్య నొక సుప్రసిద్ధ విద్యావేత్త.

ప్రకాశం దారిద్ర్యం చవిచూచినవాడు. పదవులెక్కినవాడు. లక్షలార్జించినవాడు. పల్లకీలు మోయించుకొన్నవాడు. పేరు ప్రతిష్ఠలు బాగా సంపాదించిన వాడు. చివరికి దరిద్రుడైనవాడు. తానెంత దరిద్రుడైనా ఆయన ప్రజలే ఆయన్ని ఆదరించారు. ఆయనకు ఎదురు చెప్పగల ధైర్యం ఎవ్వరికీ ఉండేదికాదు. ఎంతటి శత్రువునైనా ప్రేమించగలహృదయమాయనది. అచంచల విశ్వాసం, నిరుపమాన ధైర్యసహాసాలు , మాట నిలుపుకొనెడి గుణం, సత్యానికి విలువనిచ్చి పోరాడటం ఆయన సొమ్ములు.

బ్రిటిషువారే ఆయన ధైర్యసాహసాలకు లొంగిపోయారంటే ఇక ఇతరులను గురించి చెప్పాలా ? ఆయనకు గల ఆత్మాభిమానం అన్యత్రా చూడలేము. ఓ సారి ప్రకాశం నిర్బంధింపబడి జైల్లో ఉన్నాట్ట. ఆ జైలు ప్రధానాధికారి కాస్త అధికార దర్పంగలవాడట. ప్రకాశం ఉన్నగదిలోకి వచ్చి చాలాసార్లు తిరుగుతూఉండేవాట్ట. ఆ గదిలోని ఖైదీలంతా అధికారి వచ్చినప్పుడల్లా లేచి నిలబడేవారట. కానీ మన ప్రకాశం మాత్రం లేవడంలేదట. అది ఆ పాశ్చాత్యుని గౌరవానికి లోటుగా కనిపించింది. వెంటనే "నే నీ జైలు కంతటికీ అధికారినన్న సంగతి నీకు తెలీదా ? నేను వచ్చినప్పుడు లేచి నిలబడి మర్యాదగా ప్రవర్తించాలన్న బుద్ధి నీకు లేదా?" అని ప్రశ్నించాట్ట. వెంటనే "నీ వెన్నోసార్లు వస్తుంటావు. నే నెన్నిసార్లులేవాలి" అంటూకూర్చునే జవాబు చెప్పాడు ప్రకాశం.

తన తప్పును ఎదుటి వారు చెబితే దాన్ని సహృదయతతో స్వీకరించడం మంచి వారి లక్షణం. వాడు చెప్పేదేమిటి ? మనం వినడమేమిటి? అన్నది ఈయన ధోరణి కాదు. తనకది అంగీకార యోగ్యమని తోస్తే తప్పక దాన్ని స్వీకరించే సహృదయుడు ప్రకాశం.

జైలు జీవితం చాలా దుర్భరమైనది. ముఖ్యంగా ఒంటరితనం సహింపరానిది. ఈ ఒంటరితనాన్ని అనుభవిస్తూ ముక్కు మూసుక్కూర్చోవడం మహాపురుషులు సహించరు. గ్రంథరచనమో, గ్రంథ పఠనమో చేస్తూఉంటారు. అలాగే ప్రకాశం ప్రపంచ పర్యటనానుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాపంచిక ఆర్థిక విధానాన్ని (Monetary System of the world) భారతీయ ఆర్థిక విధానాన్ని (Indian Monetary System) రచించాడు. తోటివారితో కలిసి సంస్కృతాంధ్ర భారత భాగవతాలు దగ్గరుంచుకొని చదివేవాడు.

కొద్దికాలంలో గొప్ప పనులు

ప్రకాశం 1946 లో మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాడు. కానీ ఆ మంత్రిమండలి చాలా రోజులు నిలువలేదు. ప్రకాశం మంత్రివర్గం ఉన్నది కొద్దిరోజులే అయినప్పటికీ అది చేసిన పనులుమాత్రం గొప్పవని అందరికీ తెలిసిందే. ఎన్నో గ్రామాభివృద్ధి పథకాలు తయారుచేసి అమలు జరిపాడు. నల్లబజారు నరికట్టాడు. మరకదుళ్లు వద్దన్నాడు. చేతికదుళ్ళతోనే పని సాగించాలన్నాడు. Producers cum consumers Societies స్థాపించాడు. క్రొత్త మిల్లులుస్థాపించ డానికి నిరాకరించాడు. అన్ని దేవాలయాలలోకి అందరూ ప్రవేశించడానికి అనుమతినిచ్చే చట్టాన్ని ఆమోదింపజేశాడు. ఏ పనిగాని ఇది చేయవచ్చునని తోచినప్పుడు నిర్భయంగా చేశాడు.

1937 లో ప్రకాశం ముఖ్యమంత్రి కావడానికి అవకాశమున్నా తానే రాజాజీని నాయకునిగా ప్రతిపాదించి రాష్ట్ర ఐక్యతను కాపాడినాడు. 1947 లో ప్రకాశంను పదవినుండి దింపడానికి స్వార్థపరులైన ఆంధ్రులే కొందరు తమిళుల పంచజేరి ఆంధ్రత్వానికే కళంకమాపాదించారు.

ఇలా ఉండగా బెజవాడ పౌరులు ప్రకాశం కార్యదక్షతను గుర్తించి ఆయన కాంస్య విగ్రహాన్ని స్థాపించడానికి నిర్ణయించారు. ఈ సంతోష వార్తను ప్రచురిస్తూ ఆ నాటి ప్రసిద్ధ తెలుగు పత్రికగు 'త్రిలిజ్ఞ' ఇలా వ్యాఖ్యానించింది.

"అసలు ప్రకాశమే కంచు విగ్రహం. ఆయనకు కంచు విగ్రహమేల ? పునరుక్తిగదా ? ప్రకాశం తిమ్మరుసు, శివదేవయ్యల వంటి పూర్వమంత్రులతో సరితూగగలవాడు. ఆంధ్రులకాయనను తలచుకుంటూనే పులకాంకురములు మొలవకపోవు. ఆంధ్రులలో అనైక్యతను బోగొట్ట ప్రయత్నించిన ధీరశాలి ప్రకాశం. ఆయనను పదవినుండి దింపించుటకు కారకులగువారు పొందిన సన్మానావమానాలను ఆంధ్రలోకం మరచిపోదు. ఆయనకు ఆంధ్రులే కొందరు ఆయన ఉప్పు తిన్నవారు, శిష్యులు వెన్నుపోటు పొడిచారు." అని. "పదవిలో ఉన్నా లేకున్నా ప్రకాశం ప్రజాసేవకుడే ప్రజానాయకుడే" అంటూ వాఖ్యానించాడు ప్రసిద నాయకుడు ఆచార్య కృపలానీ.

He is the firstrate champion in the cricket field of political leaders of South India. ఆయన ఆంధ్రదేశానికేకాదు, దక్షిణాదికే ఏకైక రాజకీయ నాయకుడుగా పేరుపొందాడు. ఎచటికివెళ్ళినా మంత్రిగా ఉన్నపుడుకూడా III Class లోనే ప్రయాణంచేసేవాడు. ఎంతటి శత్రువునయినా దయార్ద్ర హృదయంతో చూచేవాడు.

"శరణంబని వచ్చిన యీ
కర శత్రువునయినఁ బ్రీతిగావగ వలయున్
గరుణా పరుల తెఱంగిది

ఇరవుగ సరిగావు దీనికే ధర్మంబుల్" అన్న భారతసూక్తిని జీర్ణించుకొన్నవాడు ప్రకాశం. ప్రజలెలాంటి కష్టపరిస్థితుల్లో ఉన్నా తాను అచటికి వెళ్లి స్వయంగా పరామర్శించేవాడు. ఓసారి కలరా విపరీతమై ఆరోగ్యశాఖాధికారులుగూడ ఆ ప్రాంతానికి వెళ్ళి చూడటానికి భయపడుతూ ఉంటే ప్రకాశంవెళ్ళి ఆ ప్రాంతంలోని గుడిసెలన్నీ తిరిగి వారిని పరామర్శించాట్ట. హిందూ ముస్లిం గలాటాలు తీవ్రంగా ఉన్నచోటికి వెళ్ళి తగువులు తీర్చాట్ట.

85 సంవత్సరాల వయస్సులో కాళ్ళు వంకరలు తిరుగుతున్న చలిలో సైనికాధికారులు వద్దంటున్నా వినక జంకక గొంకక మన వీర జవానులను చూడటానికి హిమాలయాలకు వెళ్ళాడు.

స్వయంకృషి, భోగం, త్యాగం, రాగం, విరాగం, నయ వినయాలు, సేవాసక్తి, ప్రభుత్వ సంపత్తి, దర్ప గాంభీర్యాలు, నిదాన నిర్ణయాలు, ధైర్య సాహసాలు ఇలా పరస్పరం విభేదించే గుణగణాలు ఒక్కనిలో మూర్తిభవించడం అన్యత్రా చూడలేము.

తన 75వ జన్మ దినోత్సవంనాడు గూడా బాగా ప్రొద్దుపోయే వరకు విశ్రాంతి లేకుండా బడ్జెటు చర్చలు ముగించాడు. అప్పుడు ప్రతి పక్షంలోనివారు ప్రకాశానికి జన్మ దిన శుభాకాంక్షలు అందజేశారు. ఆయన కార్య దీక్షను, దక్షతను ప్రశంసించారు. దానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రకాశం—

" నా 75వ జన్మ దినోత్సవ సమయాన అభినందనలర్పించినందుకు కృతజ్ఞుణ్ణి. చిరకాలంగా నేనీ జన్మ దినోత్సవపు గొడవలు పట్టించుకోవడం లేదు. ఒక మనిషి జీవితంలో షష్ఠి పూర్తి పెద్ద ఘట్టమంటారు. అది గడచిపోయిన తర్వాత ఎప్పుడా సంవత్సరం వచ్చిందో ఎప్పుడు పోయిందో అనేది తెలీకుండానే పదిహేను సంవత్సరాలు గడిపాను. ఈ జీవుడు బొందెలో నుండి లేచిపోయేదాకా ఈ దేశానికి సేవ చేయగలుగుతానని ఆశిస్తున్నాను" అన్నాడు.

చివరి దశలో ప్రకాశం ఆర్థిక పరిస్థితి మరీ జారి పోయింది. ఆయన ఎప్పుడూ శాలువ కప్పుకొనేవారు. అది ఆయనకు అల వాటు. అంతేగాక దీనికి ఏదైనా కారణముంటుందన్న ఉద్దేశ ముతో ఆయన ఆత్మీయుడొకడు ఇలా ఎంత సేపు శాలువ కప్పు కొంటారేమిటన్నాట్ట ? అందుకు ప్రకాశం శాలువ తీసేసి తన వీపు చూపించాట్ట. వీపు మీద చొక్కా అంతా చినిగి పోయిందట. అలా ప్రశ్నించిన వ్యక్తి పొందిన ఆవేదన ఇంతా అంతా అని చెప్పలేము గదా !

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై 1913 నుండి ఆంధ్రులు చేస్తున్న కృషి పొట్టి శ్రీరాములు గారి మరణంతో తీవ్ర రూపం దాల్చింది. చివరికి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని యివ్వడానికి అనుమతి నిచ్చింది. అపుడు నెహ్రూ ప్రత్యే కంగా ప్రకాశాన్ని పిలిపించి రాష్ట్రం ఏర్పాటుకు తగినవన్నీ సిద్ధం చేశారు. ఇందు ముఖ్య పాత్ర వహించిన ప్రకాశం ఆంధ్రరాష్ట్ర నికి ముఖ్య పట్టణంగా కర్నూలు ఉండాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ బెజవాడ పౌరులు కొందరు రాజధాని బెజవాడలో ఏర్పాటు చేయాలని, లేకుంటే మీ కాంస్య విగ్రహాన్ని బద్దలు కొడు తున్నామని ట్రంక్‌కాల్స్, టెలిగ్రామ్స్ చేశారు. ఈ వార్త విన్న ప్రకాశం— "ఆ కంచు విగ్రహాన్ని పెట్టవలసిందని నేనెవరినైనా అడిగానా ? దాన్ని పెట్టిన ప్రజలకు దాన్ని బద్దలు కొట్టే హక్కు తప్పకుండా ఉంటుంది కదా !" అన్నాడు.

తాను మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్న రోజుల్లో రోజుకు 1000 రూపాయలు ఫీజుగా తీసుకొనేవాడు. ఒక కేసు నడిపించి అది విజయవంతమైన తర్వాత దానికి వారు తృప్తిగా యిచ్చిన 70 వేల రూపాయలు ఫీజుగా పుచ్చుకున్నాట్ట. ఒక కేసుకు 70 వేల రూపాయ లంటే మాటలా మరి ? ప్రకాశం త్యాగబుద్ధిని ప్రశంసిస్తూ డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య ఒకచోట—

"నేను భోగరాజునేకాని. త్యాగరాజునుకాను. నేను యివ్వాళ రేపటిని గురించేకాక ఎల్లుండిని గురించి కూడా ఆలోచిస్తాను. కానీ ప్రకాశం ఎప్పుడూ యివ్వాళను గురించే కాని రేపటిని గురించికూడా ఆలోచించడు. రేపన్నది ఆయన నిఘంటువులోనే లేదు." అన్నాడు.

నిజంగా ఆయన రేపటిని గురించే ఆలోచన చేసి ఉంటే ఎన్ని కోట్లు ఆర్జించి ఉండేవాడో ? ఎలా బ్రతికి ఉండేవాడో ?

తన చరమ దశను గూర్చి ప్రకాశం తన జీవిత చరిత్రలో "నావిషయంలో నాకే బెంగా లేదు-నేను పుట్టింది ఒక బీదల ఇంటిలో. పెరిగిందీ బీదవారి కొంపలలోనే. ప్లీడరు గానూ, బారిష్టరుగానూ మాత్రం లక్షలు సంపాదించాను. దీర్ఘకాలంగా నడిచిన ఒక పెద్ద దేశం యొక్క స్వాతంత్ర్యం కోసం జరిగిన శాంతి యుత సమరంలో ప్రజల వద్ద నుంచి సంపాదించిన లక్షలు ఆప్రజల స్వాతంత్ర్యం కోసం ఆనందంగా ఖర్చు పెట్టగలిగాననే భావన నామట్టుకునాకు ఆనంద దాయకంగానే ఉంది'' అంటూ వ్రాశాడు.

ఆయన సైమను కమిషన్‌ను ఎదిరించిన తీరు వివరించడం పునరుక్తి అవుతుంది. ఆ విజయాన్ని తమ విజయంగా భావిస్తూ ఆంధ్రప్రజలు ఆయనకు

"వీరాంధ్ర కేసరీ విజయాంధ్రకేసరీ

విచ్చేయు మావిశాలాంధ్ర వీధులలోకి

అరుణ కిరణమ్మవై ఆశాప్రకాశమ్మవై'' అంటూ

ఆప్యాయతతో ఆహ్వానించేవారు.

"గుండె దెబ్బకు జంకిపోడన్నా

చొక్కాను దీసి

గుండె దానికి పందెమిడెనన్నా'' అంటూ ఆంధ్రులచే ప్రశం సింపబడ్డ వీరుడాయన.

ప్రకాశం కేంద్రప్రభుత్వ అనుమతికోసంకూడా చూడ కుండగనే ధైర్యం చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించాడు. బెజవాడ వద్ద కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి నిర్మాణాన్ని సాగించాడు. ఖైదీలుగా ఉన్న వేలాది మందిని ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవసందర్భాన విడిచి పెట్టి ఏ ప్రధానీ చూపని ధైర్య సాహసాలు ప్రదర్శించాడు.

ఇలాంటి అనుపమాన గుణగణాలు గల మహామనీషి దేశ మాత దాస్యశృంఖలాలను ఛేదించి ఆమెను సంపూర్ణ స్వాతంత్ర్య వాయువులలో ఉయ్యాలలూగించాలనే తలంపుతో తన సర్వస్వాన్ని ఖర్చుపెట్టి స్వాతంత్ర్యం సంపాదించానన్న తృప్తితోనే కన్ను మూశాడు.

భారత జాతీయోద్యమనాయకులలో అగ్రేసరుడై తెలుగు జాతికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన ఆ మహనీయుని శతజయంతి సందర్భంగా పూజించడం మనధర్మం. కాన పూలు సంపాదించ దానికై లేవండి.

"కులం పవిత్రం

జననీ కృతార్థా

వసుంధరా పుణ్యవతీ చతేన''

స్వాతంత్ర్య సమరయోధుడు రాజాజీ

కామర్సు సీతామహాలక్ష్మి

స్వాతంత్ర్య సమర యోధుడైన రాజాజీ 1878 డిశెంబరు 8వ తేదీన జన్మించారు. హేమంతంలో హిమవంతుడు తన వెంట తీసుక వచ్చినదోయన్నంతగా వారి హృదయం చల్లనిది, పసితనం నుండి పదునైన బుద్ధి గలవారు రాజాజీ. దానికి నిదర్శనం 17 సం॥ల వయస్సుకే పట్టభద్రులగుట, బ్రహ్మచర్యాశ్రమాన్ని వదలి 1899 లో అనగా తన 21వ సంవత్సరమున గృహస్థాశ్రమం స్వీకరించారు. కవికుల గురువగు కాళిదాసు రఘువంశంలో చెప్పినట్లు—

శైశవంలో విద్యాభ్యాసంచేసి యౌవనంలో గృహస్థ ధర్మాన్ని స్వీకరించి వార్థక్యంలో ముని వృత్తి నవలంబించి అంత మందు యోగస్థితిలో తనువును త్యజించారు. ఇదే పూర్ణ పురుషుల యొక్క ధర్మం.

శ్రీ రాజాజీ 22 సంవత్సరాలకే న్యాయవాద వృత్తిని చేపట్టి 19 ఏండ్లు యెదురులేని మేటి ప్రజ్ఞాశాలిగ ఖ్యాతి నార్జించారు. 1919లో దేశ చరిత్రతోబాటు రాజాజీ జీవితం కూడ కొత్త మలుపులు తిరిగింది. గాంధీగారి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని పాశ్చాత్యుల పాలనను పడగొట్టడాని పట్టుపట్టిన ధైర్యశాలి. అప్పటినుండి అనేక రంగాలలో అడుగుపెట్టి అనుభవం గడించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రాజాజీ ఒకసారి గాంధీజీ మద్రాసులో తన యింటిలో మకాం చేసినప్పుడు "సత్యాగ్రహ" మనే ఆయుధానికి పదును పెట్టబడింది. అంతే. రాజాజీ నిర్లిప్తంగా న్యాయవాద వృత్తికి స్వస్తి వాచకం పలికారు. 1921—22లో భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగాను, 22 నుండి 42 వరకు కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడుగాను పనిచేసి తన కర్తవ్యాన్ని నిరూపించారు.

"పాంచబార్ నమాజ్" అన్నట్లు రాజాజీ కృష్ణ జన్మస్థానాన్ని 5 సార్లు పావనం చేసారు. 1937 లో రాజాజీ మద్రాసు ముఖ్యమంత్రిగా పదవిని స్వీకరించి 39లో త్యజించారు.

మార్పు ప్రకృతి సహజ ధర్మం. అట్టే మానవుల స్వభావంలో కూడ మార్పు అసహజం కాదు కదా? కొన్ని అభిప్రాయ భేదాల వల్ల రాజాజీ కాంగ్రెసు పార్టీకి రాజీనామా యిచ్చారు. అల్లా అని గాంధీజీని వదలలేదు. 1944లో గాంధీ, జిన్నాల మధ్య జరిగిన చర్చల్లో గాంధీకి తోడ్పడి తన నిజాయితీని నిలబెట్టుకున్నారు.

తిరిగి 1946లో రాజకీయ రంగంలో ప్రవేశించి 46_47లో గవర్నర్ జనరల్ కార్య నిర్వాహక మండలిలో ఆర్థిక విద్యా వ్యవహారాల సభ్యునిగా పని చేసారు. సంఘంలో మార్పు తీసుకురానిదే సామాన్య ప్రజలకు దారి తెన్ను లేదని సతత కృషి సల్పిన సత్యాన్వేషి, దళిత వర్గాలను ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్న కరుణామూర్తి. ఆవేశాలకు లోనుగాక ఆదేశాలకు ప్రాధాన్య మిచ్చిన మార్గదర్శకుడు. 1947లో పశ్చిమ బెంగాల్ గవర్నరుగా నియమింపబడిన గుణనిధి.

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అసమాన శక్తిని ప్రదర్శించిన కురువృద్ధ పితామహుడు. సి. ఆర్. అరివీర భయంకరుడు. పవిత్ర భారతావని దాస్య శృంఖలాలను పగులగొట్టుటకై

పాంచజన్యమును పూరించిన పార్థుని రథసారథిలా ఆంగ్లేయుల కౌరవ హృదయాలలో గగ్గోలు కలిగించిన కర్మయోగి. స్వాతంత్ర్య సమరంలో సమసిపోతామేమో ననే భయంతో చల్లపడబోవు భారతీయులకు శస్త్రచ్యుతుడైన కిరీటికి కర్మ, జ్ఞాన, యోగముల బోధించిన గోపాలునివలె మన గోపాలాచారి గీతాబోధనలోవలె ప్రజలను కర్మ నిష్ఠుల చేసిన తత్వవేత్త.

మహాత్ముని మనోధైర్యానికి మద్దత్తు నిచ్చిన మహానాయకులు నెహ్రూజీ, రాజాజీ, పటేల్, ప్రకాశం, బాలగంగాధర తిలక్, గోఖలే, తదితరుల అవిరళ కృషి ఫలితంగా 1948 ఆగస్టులో భారతాంబ బంధనాలు పటాపంచలైనాయి. స్వతంత్ర భారత దేశంలో 1948లో రాజాజీ మొదటి గవర్నరల్ జనరల్‌గా నియమింపబడ్డారు. అది మొదలు 1950 జనవరి 26వ తేదీ సార్వభౌమత్వ రాజ్యం అవతరించే వరకు ఈ పదవిలో ఉండి కార్య దిక్షతలో ఘనులని పించుకున్నారు. 1952 లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రియై అయి దేళ్ళపాటు అవిరామంగా కృషి చేసిన అద్వితీయులు. 1954లో "భారత రత్న" అని బిరుదు బొందిన బుద్ధిశాలి. స్వతంత్ర భారతావనిలో మరో స్వతంత్ర పార్టీని స్థాపించగల్గిన ధైర్యవంతులు. స్వేచ్ఛాయుతమైన సరళిలో ఒక కొత్త పద్ధతిని రాజాజీ రూపొందించినారు. ప్రజాస్వామ్యంపట్ల అచంచల విశ్వాసం గల వ్యక్తి. రాజాజీ చెపుతూ ఉండేవారు. వ్యక్తి స్వాతంత్ర్యం లేనిదే ప్రజాస్వామ్యం మనజాలదని. అర్ధ శతాబ్దంపైగా దేశ భవితవ్యాన్ని తీర్చి దిద్దిన సర్వోత్కృష్ణ ప్రేమ మూర్తి. మహావ్యక్తిగా పేరుపొందిన మహా మనీషి. ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ, సాంఘికాది రంగాలలోను అడుగిడిన ప్రజ్ఞానిధి.

మోక్ష సాధనములైన ధర్మార్థకామ మోక్షచతుర్విథ పురుషార్థములను విస్మరించని విద్యావేత్త: సంసారంలో సంతానాన్ని కంటూనే సరోవరంలోని సరోజంపై సలిలంలా చల్లని జీవితాన్ని సాగించిన నిర్లిప్తుడు. మానవ పతానానికి హేతువులైన మారణ యంత్ర ప్రయత్నాన్ని గుఱించి ఆరాటపడి అంటూ ఉండేవారు. మానవుడు తోటి మానవలోక శాంతి సౌఖ్యాల గురించి వీసమంతైనా ఆలోచించడం లేదు. ఇది తగనిపని. అధికారంతో అన్నింటిని జయించాలనే దురహంకారంతో తన అధికార బలాన్ని దుర్వినియోగం చేస్తున్నాడు. మానవచరిత్ర పవిత్రం చేయడానికి అణ్వాస్త్ర పరిశోధనకాదు. పరమ పవిత్రమైనది పఠింపదగినది వేద తత్వం.

శ్రీరాజాజీ ప్రాచీన భారతీయ సంస్కృతికి దర్పణమేగాక విశ్వవ్యాప్తంగా ఖ్యాతి పొందిన ఋషితుల్యుడు. తిరుచెంగేడులో ఒక ఆశ్రమాన్ని స్థాపించి నిర్మలమైన జీవితాన్ని నిరూపించిన స్థిరచిత్తుడు. నేటికిని ఈ ఆశ్రమంలో ఉత్తమమైన శిక్షణ ఇవ్వబడుతున్నది. "నాన్ ఋషిః కురుతే కావ్యం". ఋషితుల్యుడు కనుకనే రామాయణ భారతాదులను రచించగల్గిన సాహిత్యవేత్త, మహామేధావి. రాజాజీ జీవితకాల పర్యంతం ఒక ప్రక్క రాజకీయపు పదునయిన కటారిమీద ఎక్కి మరో ప్రక్క అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి జ్ఞానదానానికై సత్యాన్వేషణ చేసిన పూర్ణ పురుషుడు.

భారతీయ జాతీయ జీవన రంగంలో అనేక ఉన్నత పదవులను గౌరవప్రదంగా నిర్వహించిన దేశభక్తుడు. వారి జీవితం మానవజాతికొక గుణపాఠం.

రాజాజీసాహిత్యకృషి అమోఘమైనది. వారి సాహిత్యచందనం గుబాళిస్తున్నది. నాటికి నేటికి యేనాటికీ ఆ సాహిత్య. సౌరభానికి తరుగు మరుగు లేవు.

స్వేచ్ఛా జీవి—

రాజాజీ యెప్పుడును స్వేచ్ఛాజీవి. వారు రచయితలకు చెప్తుతూ ఉండేవారు. ఒకసారి ఉపన్యసిస్తూ కవికి, రచయితలకు ఒక పరిధి ఉండకూడదు. ఆకాశ విహంగంవలె వారు భావాకాశంలో పయనించవచ్చు. అల్లా అని వాస్తవానికి దూరం కాకూడదు అన్నారాయన. ఒకరు చెప్పింది వినకూడదనికాదు కాని విన్నది యెంతవరకు ఆచరణీయమైనదని యోచనాశక్తి గల్గినవారు. వారు 20వ శతాబ్దపు సోక్రటీసు అనికూడా అన్నారు. బుద్ధిలో బృహస్పతి కర్మనిష్ఠలో జనకమహర్షి. కనుకనే వీరు "రాజర్షి" అని బిరుదు పొందేరు. పట్టుదలలో భగీరథుడు. అనుకున్నది, ఆచరణీయమైనది ఆఖుమూడయిన మూడు ఆరైన అది నెరవేర్చేవరకు ఊరుకొనేవారుకాదు. అవసరమైతే గాంధీగార్నికూడా యెదిరించడానికి వెనకాడేవారుకాదు. గాంధీజీ కలలను కరిగిపోకుండా వాటికొక రూపకల్పన చేసిన కళాకారులు. రాజకీయరంగంలో చాకచక్యంతో రాజ్యాన్ని సంపాదించి చంద్రగుప్తుని కప్పగించి తపోనిష్ఠ పొందిన చాణుక్యునివలె స్వతంత్ర భారతదేశ బాధ్యతలు పౌరులపై పెట్టి తాను స్థిత ప్రజ్ఞుడై నిలబడ్డారు. పొగడ్తలకు పొంగిపోక పదవులకు మోహపడక తన ధర్మాన్ని తాను నెఱవేర్చిన పారదక్షుడు. ఏ భాషలో మాట్లాడినా యే విషయాన్ని గురించి ఉపన్యసించినా యెదురులేని మేటి దిట్ట. అన్నిరంగాలలో అవిరామంగా కృషిసల్పినా అలసట తెలియని అదృష్టవంతుడు. తారతమ్యభేదంలేకుండా పెద్ద-చిన్న హెచ్చు-తగ్గు ధనిక-పేద కులం మతం, అనే విషమ ద్వేషాలకు లోనుగాగ సర్వమానవ సౌభ్రాతృత్వమే సమస్త విశ్వకళ్యాణానికి హేతువని కటిక సత్యాన్ని గ్రహించిన జ్ఞాననిధి. వీరు సంస్కృత, ఆంగ్లభాషలో అద్వితీయ పండితులు. రాజకీయ రంగంలోనేగాక ఆధ్యాత్మిక చింతనలోకూడ అందెవేసినచేయి. కలలు కంటున్న కామాంధులకు కాంతిపుంజం. వెతలుచెందుతున్న వారికి వెలుగుబాటి. అట్టి పుణ్యమూర్తి అందరిని వదలి అదృశ్యులయినారు. ఇది ప్రపంచానికి తీరనిలోటు.

పకృతి బలీయమైనది. జ్ఞానాజ్ఞానాలతో పనికాక ఏలాంటి వారైనా కాలానికి కీలుబొమ్మలు మానవులు, మృత్యువునకు తల ఒగ్గక తప్పదు. అయినప్పటికి రాజాజీ సర్వ ధర్మ సమన్వయం పటిష్టంచేస్తూ 1972 డిశెంబరు 25 క్రిసమసు రోజున పరమపదమొంది మతబేధం లేదని తమ మృత్యువుతో కూడా నిరూపించిన శతవృద్ధులు. వారొకసారన్నారు, నూరేండ్లు జీవిస్తేచాలునని. వారి వాక్కు సఫలం అయింది. అట్టి శతవృద్ధ చక్రవర్తికివే జోహార్లు.


దేశంలోకల్లా ఉత్తమ పంచాయతీ గుడ్లవల్లేరు

పి. రామకృష్ణారావు

కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ భారతదేశస్థాయిలో అత్యుత్తమ పంచాయతీగా ఎన్నికయై ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించింది. ప్రగతి పథంలో ఆ గ్రామ వైశిష్ట్యమును ప్రత్యక్షంగా గమనించి, భారత స్థాయిలో ప్రథమ స్థానమును చూరగొనే ఘన విజయాలను పరిశీలించగా కొన్ని అద్భుతాలు కూడా నాకు గోచరమైనవి.

ఈ గ్రామంలోని భూమి తనఖా బ్యాంకు 1925 సంవత్సరములో స్థాపించబడి, ఎపెక్సు బ్యాంకులేని స్థితిలో రుణ పూర్వక మూలధనం కొరకు రుణ పత్రాలను జారీ చేసి, తద్వారా తమ సభ్యులకు సేవ చేసి సహకార రంగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం ఆక్రమించి, దేశంలోనే ప్రాథమిక భూమి తనఖా బ్యాంకులలో విజయవంతమైన మొట్టమొదటి బ్యాంకుగా ప్రసిద్ధి చెందినది.

మరొక విచిత్ర మేమంటే - ప్రముఖ పశుపోషకుడైన శ్రీ వల్లభనేని రంగయ్య 1964 లో తెచ్చిన ఒకటిన్నర సంవత్సరాల




సంకరజాతి ఆవు

వయసుగల సంకరజాతి ఆవొకటి 1965 ఫిబ్రవరిలో ఒక్కసారి ఈతకు వచ్చి అప్పటి నుండి మరల ఎదకు రాకుండ రోజుకు కనీసం అయిదు ఆరు లీటర్ల పాలు ఇచ్చుచున్నది.

పదిహేనుమంది రైతులు పేడ నుండి గ్యాస్ తయారుచేసి ఇంధనంగా వినియోగించుచూ తరువాత అదే పేడను పొలాలకు ఎరువుగా ఉపయోగిస్తున్నారు.

మంచిరోడ్లు, పంపుల నుండి నీరు, విద్యుద్దీపాలు మొదలైన వసతులు గ్రామంలోని హరిజనులకు కూడ సమాన స్థాయిలో అందజేస్తూ, నిమ్నజాతుల సంక్షేమమునకు మార్గదర్శకమైనది.



పంచాయతీ కార్యాలయం

సర్పంచ్ శ్రీ అడుసుమిల్లి అశ్వర్థనారాయణమూర్తిని ఈ విజయాలకు కీలకమేమని ప్రశ్నించగా – గ్రామంలో ఎట్టి ముఠా తగాదాలుగాని, పార్టీలుగాని లేవని, పంచాయితీ వారు న్యాయమైన పన్నులను విధించి, వాటిని నూటికి నూరుపాళ్ళు వసూలు చేస్తున్నారని ఆ నిధులను, గ్రామావసరాలను దృష్టిలో వుంచుకొని సక్రమంగా వినియోగించుచున్నారని – ఇవియే తమ విజయానికి ముఖ్య సూత్రాలని చెప్పారు. రోడ్డు, రైలు, కాలువ మార్గాలతో కలుపబడి, కూడలి గ్రామం కావడం యీ గ్రామ ప్రాముఖ్యతకు మరొక కారణమన్నారు.

పంచాయతీ చరిత్ర

గుడ్లవల్లేరు గ్రామం, కృష్ణాజిల్లా ముఖ్యకేంద్రమైన బందరుకు 25 కిలోమీటర్ల దూరములో, బందరు–గుడివాడ రోడ్డులో వున్నది. 3.35 చదరపుమైళ్ళ విస్తీర్ణం కలిగి, 1971 జనాభా లెక్కల ప్రకారం 8000 జనాభా కల్గివున్నది. ఇందు మూడవ వంతు హరిజనులు, నిమ్నజాతుల ప్రజలున్నారు.

ఈ పంచాయతీ ప్రప్రథమంగా 1929 లో అవతరించినది. 1951–52 లో రూ. 14,000/ మాత్రమే ఆదాయమైన ఈ పంచాయతీ 1971–72 నాటికి తన ఆదాయాన్ని ఇంటిపన్నుల మార్పు ద్వారానూ, చేపల అమ్మకం ద్వారాను రు. 26,775/–రూ.లకు పెంచుకొన గల్గుట ఆ గ్రామ ప్రజలకు గ్రామాభివృద్ధికిగల గాఢమైన పట్టుదలకు తార్కాణం.

ఇందు 30 శాతం సిబ్బందికి, 41.5 శాతం రోడ్ల అభివృద్ధికి, సైడు కాలువల నిర్మాణానికి, పార్కులకు, 9.35 శాతం విద్యుద్దీపాలకు, 5 శాతం రక్షిత నీటి సరఫరాకు. మరియు 14.15 శాతం తదితర కార్యక్రమాలపై ఖర్చుచేయ బడుతున్నది.

సుమారు 10 మైళ్ళపొడవు సిమెంటు, తారు, కంకరురోడ్లు వేసివున్నారు. 244 సాధారణ బల్బులు, 61 ట్యూబ్‌లైట్లు, ఏర్పాటుచేశారు. రూ. 1,20 లక్షల ఖర్చుతో 1964 సంవత్సరం 5000 గ్యాలనుల నిల్వశక్తిగల రక్షిత నీటి పథకాలను అమలు జరిపి 41 వీధి పంపులు, 315 గృహ పంపులను పెట్టియున్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు మించి నీటి ఎద్దడి పెరుగుటవల్ల, అత్యవసరముగా ఈ పథకాన్ని విస్తరించవలసి వుండుటచే ప్రభుత్వ నిధులతో, జీవిత భీమా సంస్థల నిధులతో ఈ పథకాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ చెప్పినారు. 3250 అడుగుల పొడవుగల 13 పక్కా సైడు కాల్వలను, హరిజనవాడలో రెండింటితోసహా ఆరు పాయఖానాలను నిర్మించి గ్రామ పారిశుద్ధ్యమునకు తోడ్పడ్డారు. రు.33,000/ ఖర్చుతో పంచాయతీకి 1960 సంవత్సరంలో కార్యాలయ భవనమును నిర్మించివున్నారు. సమాజ కేంద్రం, పఠన మందిరం గూడా నడుపుతున్నారు. మూడు కమ్యూనిటీ రేడియోలు, ఇందునూ ఒకటి హరిజనవాడలో ఏర్పాటు చేసివున్నారు.

గుడ్లవల్లేరు గ్రామం వ్యవసాయంలోనూ అంతకంటె ప్రముఖంగా పశుగణాభివృద్ధి రంగంలోను విప్లవాత్మకమైన ప్రగతిని సాధించినదనుట గమనార్హం.

వ్యవసాయ రంగం

గ్రామంలో గల 1330 ఎకరాల పంట భూమిలోను, 400 ఎకరాలలో రత్న, జయ, ఐ. ఇ. టి. 1991 మొదలగు అధిక దిగుబడి వరి వంగడాలను పండించివున్నారు. ఆధునిక శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులలో ఈ గ్రామస్థులు మంచి ప్రవీణులు. 20 ట్రాక్టర్లను, తదితర పరికరాలను, వ్యవసాయాభివృద్ధికి వినియోగించుచున్నారు. 400 ఎకరాలలో పెసర, 600 ఎకరాలలో మినుము, 192 ఎకరాలలో ప్రత్తి, 20 ఎకరాలలో కూరగాయలను పండించారు. ఏడు అతి పెద్దతరహా ఉప్పుడు బియ్యపు మిల్లులతో సహా పదహారు బియ్యపు మిల్లులు పనిచేస్తున్నవి.

పశుగణాభివృద్ధి

పాడి పరిశ్రమకు మారుపేరు గుడ్లవల్లేరు. పాడి పరిశ్రమలో బహుశా ఈ గ్రామాన్ని అధిగమించగల గ్రామం ఈ రాష్ట్రం లోనే లేదు. అఖిలభారత పశుగణ పోటీలలో, పాల దిగుబడి పోటీలలో కూడా అనేక బహుమతులను చూరగొని, అత్యుత్తమ పాల ఉత్పత్తి దారుగా బంగారు పతకం సాధించి ప్రఖ్యాతి



శ్రీ వల్లభనేని రంగయ్యగారి పశువులు

వహించిన శ్రీ వల్లభనేని రంగయ్య ఇట్టి అభివృద్ధి కారణాలను ముచ్చటిస్తూ అయిదు దశాబ్దాల క్రితమే ఈ గ్రామస్థులు, పశువుల జాతి పెంపును గూర్చి శ్రద్ధ వహించిరనీ, అప్పటి నుండి యీ కృత్రిమ పశుగణాభివృద్ధి పద్ధతులద్వారా మేలు సంకరజాతి పశువులను అభివృద్ధి చేయుటలో అవిరళ కృషిచేస్తూన్నారనీ తెల్పారు.

ఇక్కడ ఒంగోలు, ముర్రా, హర్యానా, జర్సీ, హోల్ స్టైయిన్, హీపర్ మొదలగు అనేక రకాల మేలుజాతి పశువులు చూడగలం. ఇంకొక ముఖ్య విషయమేమంటే పశువులకు ఈగల, గోమార్ల బాధ లేకుండా చేయుటకు అత్యాధునికమైన పశువుల శాలలను నిర్మించి, అందు విద్యుత్ పంకాలు బిగించివున్నారు. ఇచ్చటి పశువులు ఒక్కొక్కటి రోజూ 19 కిలో గ్రాముల వరకు పాలు ఇస్తున్నవి.

ఇచ్చట పనిచేస్తున్న పాల శీతల కేంద్రానికి గ్రామస్థులు రోజుకు 1000 లీటర్ల పాలు సరఫరా చేయుచున్నారు, పశువుల మలమును గ్యాసుగా తయారుచేయుచున్నారు. తదుపరి ఎరువుగా వినియోగించుకుంటున్నారు. మూత్రం సరాసరి పొలములోనికి పారించి నత్రజని ఎరువుగా వినియోగిస్తున్నారు.

ఇచ్చట ఒక పెద్ద తరహా పశువుల ఆసుపత్రి ప్రాంతీయ పశుగణాభివృద్ధి కేంద్రం పనిచేస్తున్నవి. జర్సీ, హోల్‌స్టైయిన్ జాతుల వీర్యంతో కృతిమ గర్భోత్పత్తిద్వారా మేలుజాతి పశువులను అభివృద్ధిచేసి పాల దిగుబడి పెంచుటకు చాలా కృషిచేస్తున్నారు. రూ. 9.30 లక్షల వ్యయంతో ఒక పశు ఆహార ఉత్పత్తి కర్మాగారం 1968 నుండి పనిచేస్తున్నది.

కోళ్ళ పెంపక కేంద్రాలు

ఇచ్చట కోళ్ళ ఉత్పత్తిని గమనించిన యెడల గుడ్లవల్లేరు సార్థకనామ మనిపించుతుంది. 32.000 కోళ్ళుగల 35 కోళ్ళ పెంపక కేంద్రాలు, ఆధునిక శాస్త్రీయ పద్ధతులలో నిర్మించిన షెడ్డులలో రాత్రులందు విద్యుద్దీపాలతో చూపరులకు వేడుక గలిగించుతాయి. రోజూ 10,000 గ్రుడ్లను కలకత్తా, మద్రాసులకు ప్రత్యేక బుట్టలలో ఎగుమతి చేస్తున్నారు.

2,000 కోళ్ళతో ఒక ఫారం నడుపుచున్న శ్రీ పోలవరపు రాజేశ్వరరావు 1,000 కోళ్ళవల్ల వచ్చు ఎరువు కనీసం పది ఎకరాలలో పార్వ, దాళ్వ పైర్లకు సరిపోతుందనీ, మిక్కిలి నత్రజని



కోళ్ళ పెంపక క్షేత్రం

గల ఎరువుగా దీని వినియోగం చాలా అమూల్యమైనదని అంటారు. ఇంకొక ఆసక్తిదాయకమైన విషయమేమంటే, కోళ్ళకు నీటి వసతికిగాను, ఆయన త్రవ్వించిన 25 సెంట్ల విస్తీర్ణంగల చెరువులో చేపలను పెంచి అమ్మగా రూ. 100 – ఆదాయం లభించిందట.

నెహ్రూ పశువుల మార్కెట్టు

గ్రామస్థులచే 1949 లో స్థాపించబడిన ఈ పశువుల మార్కెట్టు గ్రామాభివృద్ధి కార్యక్రమాల కన్నిటికి అవసరమగు నిధులను సేకరించుటలో బహుళ ప్రాధాన్యంగల ఆర్థిక వనరుగా రూపొందినది. ప్రతి శుక్రవారం ఈ మార్కెట్టు విశాల మైదానములో 1000 నుండి 3600 వరకు ఆవులు, గేదెలు, అమ్మకపు సంత నిర్వహింపబడుతుంది. పశువునకు 50 పైసలు వంతున రుసుం వసూలు చేస్తాయి. ఈ కమిటీవారు అదే ఆవరణలో




నెహ్రూ పశువుల మార్కెట్

65,000 - ఖర్చుతో, ఒక ప్రాంతీయ పశుగణాభివృద్ధి కేంద్రాన్ని, ఒక పశు వైద్యశాలను, అనువగు భవనాలను నిర్మించి ఉచితముగా యిచ్చారు. స్థానికంగా నిర్మింప నుద్దేశించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు రు. 20,000 విరాళం సమితికి చెల్లించి వున్నారు. వేరొక దాత మూడు ఎకరాల భూమికూడా ఇచ్చివున్నారు. ఈ ఆరోగ్య కేంద్ర స్థాపనకు ప్రయత్నాలు జరుగుచున్నవి.

ఎన్. ఇ. ఆర్. యం.

ఎన్. ఇ. ఆర్. యం. జూనియర్ కాలేజి శ్రీ కొసరాజు వెంకట రత్నం ఇచ్చిన రూ. 20,000/-భూరి విరాళంతోను, నిరంతర వనరులకు పెన్నిధియైన పశువుల మార్కెట్ వల్లనూ ఆదర్శమైన విద్యాసంస్థగా రూపొందిన ఎన్. ఇ. ఆర్. ఎం. జూనియర్ కళాశాల ఆ గ్రామ విద్యార్తృష్ణకు ఒక ప్రబల నిదర్శనం.



ఎన్. ఇ. ఎం. ఆర్. జూనియర్ కళాశాల

రూ. 2,60,000/-ఖర్చుతో నిర్మించి, ఈ గ్రామ కమిటీచే నిర్వహించబడుతున్న ఈ కళాశాల ఆధునిక విశాల భవనాలతోను, లేబొరేటరీతోను, దృక్, శ్రవణ, విద్యుత్ పరికరాలతో అమర్చబడిన అడిటోరియం, హాస్టలు మొదలగు వసతులతోనూ నిత్యనూతనంగా విలసిల్లు తున్నది.

గ్రామీణ పరిశ్రమలు

ఇచ్చట 17 పెద్ద రైసు మిల్లులు చాలా కాలంగా పని చేస్తున్నవి. ఇవిగాక వడ్రంగం, కమ్మరం, బుట్టల అల్లికం, త్రాళ్లు పేనుట మొదలగు కుటీర పరిశ్రమలు, పశువుల, కోళ్ళ పెంపకం కేంద్రాలకు అనుబంధంగా ప్రోత్సాహకరంగా పనిచేస్తున్నవి. స్థానిక స్టేట్ బ్యాంక్ వారు పదిహేడు మిల్లులకు రు. 23,18,000 39 చిన్న తరహా పరిశ్రమలకు రూ. 1,31,000/-పదిహేను పశు, కోళ్ళ ఫారాలకు రూ. 96,300/-ఋణాలను మంజూరు చేసినారు.

సహకారం

1916 నాటికే స్థాపింపబడిన సకలార్థ సాధక సహకార పరపతి సంఘం ద్వారా వ్యవసాయ దారులకు అవసరమగు ఆర్థిక సహాయమును అందజేస్తున్నారు. 1971-72 సంవత్సరంలో ఈ సంస్థ ద్వారా 207 మంది రైతులకు రూ. 80,000/-ఋణం ఇచ్చినారు.

132 మంది హరిజనులకు, తదితర నిమ్న జాతులవారికి యిళ్ళ స్థలాలను మంజూరు చేసినారు.

ఇన్ని రంగాలలో అభివృద్ధి సాధించిన యీ గ్రామం భారత స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నిక కావడంలో ఆశ్చర్యంలేదు.

రచయితలకు విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ పత్రిక గ్రామాల్లో సామాన్య ప్రజల దగ్గరకు వెళ్ళే
పత్రిక. అందువల్ల రచనల్లో సాధ్యమైనంతవరకు
సరళమైన వ్యావహారిక భాష వాడితే
అనుకూలంగా వుంటుంది.

(ప్ర. సం.)

స్వాతంత్ర్యోద్యమంలో హరిజనోద్ధరణ ఘట్టం

జి. వెంకటరామారావు

అంటరానితనం ఇప్పుడిప్పుడే పుట్టుకవచ్చిన నూతన వ్యవస్థ ఏమీ కాకపోయినా దీనివల్ల ఒక దేశనాగరిక జాతి చరిత్రలో అనేక ప్రమాదకరమైన, బృహత్తరమైన సాంఘిక సమస్యలెన్నో తలెత్తాయి.

ఇతర మతాలతో పోల్చిచూచినప్పుడు హిందూమతం కొంత విశాల దృక్పథం కలదిగాను, అభ్యుదయ భావాలు గలదిగాను అగుపిస్తుంది. కానీ కులవ్యవస్థ దాని ఔన్నత్యాన్ని కనబడనీయకుండా చేసివేస్తున్నది. వైష్ణవులు, బ్రాహ్మణ మతస్థులు, ఆర్య సమాజికులు 'అంటరానితనం' రూపుమాపటానికి పెక్కు సంస్కరణోద్యమాలను నడిపారు. అవి కొంత ఫలించినా చెప్పుకోదగ్గ విజయాలను సాధించలేకపోయినై. నిత్యదారిద్ర్యంలో మునిగి తేలే హరిజనకులాల ప్రజకు సంస్కరణవాదుల విశాలదృక్పథమైతే అవగతమైంది కానీ మౌలికమైన వారి ఆర్థిక సమస్య పరిష్కారం అలాగే ఉండిపోయింది.

మహాత్ముని ప్రవేశం

మహాత్ముడు కొనసాగించిన స్వాతంత్ర్య ఉద్యమాలన్నిటిలో సాంఘిక సంస్కరణోద్యమాలు అంతర్లీనంగా ప్రవహించినవి. దక్షిణాఫ్రికాలో వర్ణభేదంవల్ల పెక్కుసార్లు అవమానాల పాలైన మహాత్ముడు తన దేశంలోనే ఒక భారతీయుడు మరో భారతీయుని యెడల చూపే భేదభావాన్ని ఎలా సహించి ఊరుకోగలడు?

అంటరానితనం నిర్మూలన-ప్రధాన అధ్యాయం

భారతదేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో హరిజనోద్ధరణ ఒక ప్రముఖ అధ్యాయంగా భావించబడింది గానీ ఒక అనుబంధ పట్టికగా మారిపోలేదు.

'హరిజనోద్ధరణను అప్రధానమైన కార్యక్రమంలో చేర్చడానికి వీలులేదు. అంటరానితనాన్ని నిర్మూలించలేకపోయినట్లైతే స్వరాజ్యమే అర్థంలేనిదవుతుంది. నా దృష్టిలో హరిజనోద్ధరణ కార్యక్రమం స్వరాజ్య సమరంలో ఎంతో శక్తివంతమైన ఆయుధం' అని మహాత్ముడు అనేకసార్లు పేర్కొన్నాడు.

అసిధారా వ్రతం

1919లో గాంధీజీ కాంగ్రెసు నాయకత్వం చేపట్టగానే దేశ ప్రజలలో ఒక నూతన ఉత్తేజం వెల్లివిరిసింది. అప్పటినుండి హరిజనోద్ధరణ కాంగ్రెసు ఆశయమై, కార్యకర్తల పవిత్ర లక్ష్యమైపోయింది. అనేక విషయాలలో గాంధీజీ రాజీకి రాగలిగాడు గానీ అంటరానితనం నిర్మూలన కృషిలో తగాదాకు దిగిన వ్యక్తితో ఆయన రాజీ కుదుర్చుకోలేకపోయాడు. అనితర సాధ్యమైన యీ పని చేపట్టడంవల్లనే దేశంలోకెల్ల మొదటి ప్రజాసంస్థగా, జాతీయ సంస్థగా కాంగ్రెసు పేరు తెచ్చుకోగలిగింది.

1921లో హకీం అజ్మల్‌ఖాన్ అధ్యక్షతన జరిగిన ముప్పై ఆరవ కాంగ్రెసు సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు యిలా ప్రమాణంచేశారు.

'భగవంతుని పేర త్రికరణశుద్ధిగా ప్రమాణం చేస్తున్నాను. హిందువుగా పుట్టినందుకు న్యాయం, ధర్మం సమ్మతంగా అంటరాని తనం నిర్మూలన యెడల దృఢమైన విశ్వాసం కలిగి ఉంటాను. నాకు లభించిన అవకాశం మేర హరిజన సేవకు వారితో వ్యక్తిగత సంబంధా లేర్పరచుకుంటాను'.

ఈ వాక్యాలే 1922లో జరిగిన కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యుల చర్చనీయాంశావళిలో చేర్చబడి ఆమోదించబడినవి.

గాంధీజీపై హరిజనుల పూర్ణ విశ్వాసం

ఈ ఉద్యమ నిర్వహణలో గాంధీజీకి ప్రజల పరిపూర్ణ సహకారం లభించింది. గౌతమబుద్ధుని అనంతరం భారతదేశ చరిత్రలో ఏ మతాధికారి, ఏ రాజకీయవేత్త యింతటి సాంఘిక విప్లవాన్ని సాధించలేకపోయాడు. సమాజంలో వేలాది సంవత్సరాలుగా అట్టడుగున పడిపోయిన దళితవర్గ ప్రజలకు తమ సమస్యలు పరిష్కరించే మహాత్ముడు లభించాడని విశ్వాసం కలిగింది. 1937లో వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ 151 రిజర్వు సీట్లలో 78 సీట్లను గెలుచుకుంది. అప్పటికి డాక్టరు అంబేడ్కర్ హరిజనులచేత దాదాపు 'దేవుడి'గా పూజింపబడుతున్నాడు. ఆయన నాయకత్వంలోని లేబరు పార్టీకి 13 సీట్లు మాత్రమే లభించాయి.

ఒక్కొక్క ఏడే దేశ సాంఘిక, రాజకీయ రంగాలలో పురోగమించుకుంటూ కాంగ్రెసురథం సాగిపోతూ ఉంటే కరాచీలో జరిగిన 45వ కాంగ్రెసు సమావేశంలో అంటరానితనాన్ని కూకటి వ్రేళ్ళతో పెకిలి పారవేయటానికి తీర్మానించడం జరిగింది.

'కమ్యూనల్ అవార్డ్'

మహాత్ముని సారథ్యంలో కాంగ్రెసు వర్గరహితమైన సెక్యులర్ సంస్థగా రూపం దిద్దుకుంది. బ్రిటిషుఇండియా-భారతఇండియా మధ్యన, ఒక రాష్ట్రం మరొక రాష్ట్రం మధ్యన, ఒకవర్గం మరొక వర్గం మధ్యన, ధనవంతులు-బీదల మధ్యన, కులము-మతముల మధ్యన, ఎటువంటి భేదభావాన్ని గుర్తించలేదు మహాత్ముడు.

కాంగ్రెసు కులతత్వాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని లండన్‌లో జరిగిన రెండవ రౌండుటేబిల్ సమావేశంలో గాంధీజీ ఎంత వాదించినా బ్రిటిష్ ప్రభుత్వం వినలేదు. బ్రిటిషు ప్రధాన మంత్రి రామ్సెమెక్డొనాల్డు చివరకు 'కమ్యూనల్ అవార్డు' ప్రకటించక ఉండలేక పోయాడు.

కేవలం చట్టాలతో నిర్మూలించే పనికాదు అంటరానితనం నిర్మూలన. అది ఒకరికి మానవత్వానికి చెందినదైతే మరొకరికి విశ్వాసాలతో కూడినది.

'అగ్రవర్ణాలనుండి హరిజనులను వెలివేయడమే అవుతుంది' అని కమ్యూనల్ అవార్డుపై వ్యాఖ్యానించి, దానికి నిరసనగా సెప్టెంబరు 20, 1932న జయిల్లో ఉండే ఆమరణ ఉపవాస దీక్ష బూనాడు గాంధీజీ.

ఫలితాలు

తన ఉపవాస దీక్షలవల్ల పెద్ద తక్షణ ఫలితాలు లభిస్తాయని గాంధీజీ గొప్పలు చెప్పుకోలేదు. గురువయ్యూర్ (కేరళ) దేవాలయంలో హరిజన ప్రవేశానుమతికోసం ఆమరణ ఉపవాస దీక్ష బూనిన శ్రీ కేలప్పన్‌కు అట్టి దీక్ష విరమించుకోవలసిందిగా సలహాయిచ్చి, దీక్ష బూనేముందు ఆలయ ధర్మకర్తలకు నోటీసు ఇవ్వవలసి ఉందని పేర్కొన్నాడు.

గాంధీజీ ఉపవాసవ్రత ప్రాముఖ్యాన్ని ప్రతిఒక్క భారత స్త్రీ, పురుషులు పాటించవలసిందని రవీంద్ర కవీంద్రుడు అభిప్రాయ పడ్డాడు.

సెప్టెంబరు 25, 1935న పండిత మదన మోహన మాలవ్యా బొంబాయిలో హిందూనాయకుల సమావేశం జరిపి హరిజనోద్ధరణకు మద్దతు ప్రకటించాడు.

తనకు, తన సహచరులకు హరిజనోద్ధరణ కార్యక్రమ వ్యాప్తిలో భగవంతుడు నూతన శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని కోరుతూ మహాత్ముడు మే 8, 1933న మరొకసారి ఉపవాస వ్రతం బూనాడు. ఆ ఏడే, 'హరిజన పర్యటన కార్యక్రమం రూపొందించి,దేశంలోని మూలమూల ప్రాంతాలలో అంటరానితనం నిర్మూలన కృషిని తీవ్రతరం చేశాడు.

నవంబరు 1, 1933 రోజున డాక్టరు సుబ్బరాయన్ మదరాసు రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో హరిజనులకు దేవాలయ ప్రవేశానికి అర్హత కలిగించే బిల్లుని ప్రవేశపెట్టాడు.

హరిజనుల దేవాలయ ప్రవేశానికి ప్రజాభిప్రాయం ఎటువైపు ఉందో తెలుసుకొనుటకు గురువయ్యూర్ దేవాలయ ప్రాంగణంలో రిఫరెండం జరుపబడింది. యీ రిఫరెండంలో 77 శాతం యాత్రికులు అనుకూలంగా ఓటు చేశారు. అందునా ఎనిమిదివేలమంది ఓటర్లు మహిళలే.

స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు సమాజంలో అట్టడుగున పడిపోయిన హరిజన, గిరిజన వర్గాల ప్రజలకు యథోచితంగా సహాయాన్నందించి బాపూజీ అడుగుజాడలలో పయనించడానికి ప్రయత్నాలు చేస్తున్నవి. స్వాతంత్ర్య సమరకాలం నాటివలె హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని తమ పవిత్ర కర్తవ్యంగా ప్రజలందరు యీనాడు కూడా కొనసాగిస్తే సోషలిస్టు సమాజ స్థాపనను త్వరపరచిన వారవుతారు.

మన సమాజము - వర్ణాంతర వివాహాలు

వర్ణము అనే శబ్దానికి రంగు అని సామాన్యముగా మనము చెప్పుకొనే అర్థం. ఈ రంగు కారణంగా అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలలో వర్ణవ్యవస్థ కన్పిస్తుంది. అక్కడ తెల్ల జాతీయులు, తెల్ల జాతీయులు కానివారు అని రెండే తేడాలున్నాయి. అవి కేవలం శారీరక రంగును బట్టి మాత్రమే ఏర్పడినట్టివని తెలుస్తూనే వుంది.

కాని భారతదేశములోని వర్ణ వ్యవస్థ రంగునుబట్టి ఏర్పడలేదు. గుణాన్నిబట్టి, వృత్తుల్నిబట్టి, ఏర్పడిందని కొందరి భావన. అందుకు తార్కాణంగా గీతలో చెప్పబడ్డ—

"చాతుర్వర్ణ్యం మయా సృష్టామ్
గుణకర్మ విభాగశః"—

అనే శ్లోకాన్ని పేర్కొనడం జరుగుతుంది. ఏమైనా ఈ వర్ణవ్యవస్థ, మనదేశంలో వేదకాలంనుండి అమలులో వున్నట్లు కన్పిస్తుంది. ఇందులో పేర్కొనబడ్డ చాతుర్వర్ణాలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు చెందినట్టివే.

"జన్మనా జాయతే శూద్రః
కర్మణా జాయతే ద్విజః
వేదపాఠంతు విప్రాణాం
బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణః"

జన్మచేత అందరూ శూద్రులే. కర్మచేత వర్ణాలు ఏర్పడుతున్నై. బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించిన ప్రతివాడూ బ్రాహ్మణుడే అవుతాడు వేదకాలంలో. అలాగే క్షత్రియుడైన విశ్వామిత్రుడు, తన మేధా ప్రావీణ్యతలవల్ల బ్రాహ్మణుడు, ప్రవర ఋషీ అయినాడు.

తల్లి ఊర్వశి, వేశ్య,
తన ఆలు మాదిగ;
తాను బ్రాహ్మడయ్యె, తగ వశిష్ఠు
డిలను? గుణమెగాని, కులమేమి ముఖ్యము?
విశ్వదాభిరామ వినురవేమ:

అన్నాడు వేమన్న, వశిష్ఠుని గురించి.

వేదకాలంలోని, గుణప్రధానమైన యీ సిద్ధాంతాన్ని అణచివేసి, స్మృతులకాలంలో, పుట్టుకతోనే కులం వస్తుందని, కృత్రిమ శాసనాలను చేసి, ఏ శూద్రుడైనా వేదాలు చదివితే, అతని నాలుక నరికివేయాలనీ, వింటే వాని చెవుల్లో సీసం కరిగించి పోయాలనీ, ఇటువంటి కఠినమైన శిక్షలు విధించారు.

ఆదిలో వృత్తినిబట్టి, ఏర్పడ్డ ఈ కులవ్యవస్థ, రానురాను పుట్టుకకు ముడిపెట్టబడింది. ప్రారంభంలో, ఆయా కులాల మధ్య, సౌహార్ద్రపూరిత సంబంధాలున్నా, తర్వాత వాటి మధ్య, అడ్డుగోడ లేర్పడ్డాయి. కాల క్రమేణా, ప్రతి వర్ణం అనేక శాఖోపశాఖలుగా చీలి, కొన్ని వేల కులాలుగా రూపొందాయి. ఒక వ్యక్తియొక్క కులం, అతడవలంబించే వృత్తినిబట్టి గాక, పుట్టుకనుబట్టి నిర్ణయించడం అమలులోనికి వచ్చింది. దానితో, భారత దేశంలోని వర్ణ వ్యవస్థ రూపమే మారిపోయింది.

"కులాలకు ఏమీ ప్రాధాన్యత లేదు యీనాడు, అంతా కలిసిపోతున్నారు" అనే వాదన కొంతవరకు పట్టణాలకు

జె. వీరాస్వామి

వర్తించవచ్చునేమోగాని, పల్లెటూళ్ళల్లో, ఆ వ్యక్తి ఏ కులానికి చెందినవాడో చెప్పేవరకు వదలరు. ఇది నిత్యానుభవమైన విషయం.

తక్కిన మతాల్లోనూ, జాతుల్లోనూ లేని హిందూ మతములోని ప్రత్యేకత "కులవ్యవస్థ". దానిలో ఒకభాగం "వెలివెయ్యడం". ఒక వ్యక్తి మరొక కులానికి చెందిన స్త్రీనో, పురుషుణ్ణో వివాహమాడితే, ఆ కులజులు ఆ వ్యక్తిని సాంఘికంగా వెలివేస్తారు. అంటే ఆ రోజునుండి అతనికి, వారి సహాయ, సహకారాలు లభించవు. "వర్ణసంకరుడ"ని నిరసిస్తారు. ఆ మాటకొస్తే, మానవ శాస్త్ర పరిశీలకులు స్వచ్ఛమైన జాతంటూ, ఏ వొక్కటీ లేదనీ, ప్రపంచంలోని అన్ని జాతులు సంకరమైనవేననీ భావిస్తున్నారు. ఇక ప్రత్యేకించి భారతదేశంలో, యీ వర్ణ సమ్మిశ్రితం విపరీతంగా జరిగినట్లు వీరు అభిప్రాయపడుతున్నారు. అసలు మనదేశంలో వివిధ జాతుల రుధిర, సంస్కృతుల సమ్మిశ్రితం జరిగిపోయిన ఎన్నో ఏళ్ళ తర్వాతనోగాని, యీ కుల వ్యవస్థ ఏర్పడలేదు. అందుచే కుల వ్యవస్థ ఉత్తమ సంతతికి దోహదకారి అనుట సరికాదు.

పట్టణాలకు చెందిన ఏ కొద్దిమందో విద్యావంతుల్ని, సంస్కార వాదుల్ని మినహాయిస్తే కులభావన, కులాభిమానం

అందరిలోనూ ఏదో ఒక రూపంలో గోచరిస్తునే ఉంది. "ఈ కులం నాది" "వాడు నా కులస్థుడు"— అనే భావం వ్యక్తి ప్రవర్తనను, ప్రభావితం చేస్తూ ఉంది. వ్యక్తిగత సామర్థ్యానికే ప్రాముఖ్యత ఇవ్వాలనే విద్యావంతులలో గూడా, ఆయా సందర్భాలలో "అతడు నా కులంవాడు" అనే భావం అంతరాంతరాల్లో మెదుల్తూనే వుంటుంది.

ఈ కులాభిమానం మన ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందని పరిశీలిస్తే "కుల, మత, వర్ణ, వర్గ రాహిత్యమైన ఆర్థిక రాజకీయ స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టుగా వుంది. జాతి అభివృద్ధి కిది యేవిధంగాను దోహదకారి గాదు. సరిగదా, ఆర్థిక రంగంలో అభివృద్ధిని సాధించేందుకు సైతం, యీకుళవ్యవస్థ ప్రతిబంధకముగా ఉంది." అనితేలుతుంది.

ఇక ఉద్యోగాల విషయం చూస్తే, ప్రైవేట్ రంగంలో, ఉద్యోగాలు కులాభిమానంతో పంచబడుతున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లో గూడా కుల పక్షపాతం ఉంటూ ఉందని శాసన సభల లోను, పత్రికల్లోనూ వస్తూన్న విమర్శలు మన కందరికీ తెలిసినట్టివే.

ప్రజాస్వామ్యంలో, నేటి రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో తమ అభ్యర్థుల్ని నిర్ణయించేముందు ఆయా నియోజక వర్గాల్లో ఏ కులంవాళ్ళు అధిక సంఖ్యాకులో తెలిసికొని, ఆ కులంవాణ్ణే అభ్యర్థిగా నిలిపే స్థితి మనకి తెలియనిదికాదు. "మానవ సమత ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాతిపదిక కాగా, మానవ అసమత, కుల వ్యవస్థకు ప్రాతి పదిక. అందుచేత కుల వ్యవస్థ వున్న దేశంలో ప్రజాస్వామ్యం వర్థిల్లలేదు. ఆదర్శ సమాజానికి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వమనేవి మౌలిక సూత్రాలు. స్వేచ్ఛా సమాజంలో పరస్పరాభిమానాలు ధారాళంగా వుండాలి. ఆదర్శ సమాజంలో ఒకరి బాగోగుల్లో మరొకరు పాలు పంచుకొంటూ, యథేచ్ఛగా మనగలగాలి. అంతా ఒక్కటై పోవాలి. అదే ప్రజాస్వామ్యానికి ప్రథమ సోపానం. వివిధ కులాల మధ్య "జీవనాడుల" వలె ఏర్పడే సన్నిహిత సంబంధాలపైనే సమాజ బలం ఆధారపడి వుంటుంది.

నాడూ, నేడూ కూడ కుల వ్యవస్థవల్ల దేశానికి అపారమైన నష్టం వాటిల్లిందని స్పష్టమౌతున్నది. ఇది కాదనలేని సత్యం. హైందవ సమాజంలో ఇన్ని వైరుధ్యాలు పుట్టుకొని రావడానికి, హిందూమతం హిందువులకే దుస్సహం కావడానికి, అనేకమంది పరమతాలలోనికి పారిపోవడానికి, మనస్పర్థలు, విభేదాలు, కుట్రలు, అసమైక్యతతో నిర్వీర్యమై పరదేశ మతస్థులకు హైందవ సమాజం పాదాక్రాంతమై ఎంతోకాలం పడివుండడానికి ఈ కుల వ్యవస్థే కారణం.

భారత దేశంలోని ప్రతి వ్యక్తీ తన్ను తాను భారతీయుడుగా భావించాలి. ఇతరుల్నికూడా భారతీయులుగా గుర్తించాలి. పుట్టే పిల్లలందరూ, ఒకే జాతిగా, భారతీయులుగా పిలువబడాలి. బర్మాలోని స్త్రీ, హిందువునుగాని, ముస్లిమునుగాని, క్రైస్తవునిగాని, బౌద్ధునిగాని వివాహ మాడవచ్చునుగాని, వారి పిల్లలందరు బౌద్ధ బర్మాజాతీయులే అవుతారు.

కులవ్యవస్థవలన ఏర్పడిన సాంఘిక అసమానతల్ని పోగొట్టడానికి ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. హిందూ శాస్త్రములలోని విచక్షణా సూత్రములను తొలిగించి, నాలుగువర్ణములను సమానముచేసి, అందరికీ సమాజములో సమానస్థాయి చేకూర్చింది. కేవలం చట్టాలవల్ల కుల వ్యవస్థ కూలిపోదుగదా.

మానవత్వాన్ని మంటగలుపుతుందీ కులవ్యవస్థ. కాకపోతే, కొందరు మానవులు అంటరానివారని ఎలా కట్టుబడిచేసింది? సాంఘిక సంబంధమైన అరమరికలు లేని సహజీవనం ఏర్పడ్డప్పుడే మానవ పురోగమనం అభివృద్ధి చెందుతుంది. అలాంటి సహజీవనం ఏర్పడాలంటే ఒండొరులలో ఇచ్చి పుచ్చుకోవడంవంటి అలవాట్లు వుండాలి. వర్ణాంతర వివాహాలే కులవ్యవస్థ నిర్మూలనకు ఉత్తమ మార్గం. రక్త సంబంధం ద్వారానే, పరస్పర సన్నిహిత భావమేర్పడి, విభేద భావాలు అంతర్ధానమై, వారిలో ఏర్పడే బంధుత్వం కులవిభేదాలను తొలిగిస్తుంది.

పేద, ధనిక వర్గాలు అనే విభజనను మాత్రమే గుర్తిస్తూ జరిగే ఆర్థిక అభివృద్ధి ద్వారా, కులాలు వాటంతట అవే నశిస్తాయని కొందరి సిద్ధాంతం. అదే నిజమైతే, ఒకే ఆర్థిక స్థాయిలోనున్న రెండు కులాలవారు, — భాగ్యవంతులుగాని పేదవారుగాని — అంతర్వివాహములు ఎందుకు చేసుకోరు ? ధనవంతులు, బీదవారు తమ కులము వారినే అన్ని రంగాలలో ఎందుకు బలపరుస్తున్నారు ? సాంఘిక జాడ్యమును ఆర్థిక పరిచర్యవల్లే నివారించవచ్చుననటం హాస్యాస్పదముకాదా ? అందుచేత సాంఘిక ఆంక్షలద్వారా ఉత్పన్నమైన సమస్యలు, సాంఘిక సంస్కరణలద్వారానే పరిష్కరింపబడాలి.

సమైక్యతకు అంతర్వివాహాలే గీటురాయి. నేటి కులవ్యవస్థలోని కీలక సూత్రాన్ని కూకటివేళ్లతో తుంచివేసేవి కులాంతర వివాహాలే. ఇప్పటికే, ఆహారం, వృత్తి మొదలగు వ్యవహారములకు సంబంధించిన కుల నియమాలు చాలవరకు విస్మరించబడ్డాయి. ఆ వొక్క వివాహ పట్టింపు — అంటే "అదే కులంలో వివాహం చేసుకోవాలి" అనే నియమంగూడా త్రోసిరాజంటే, క్రమేణా 'కులం' అనే పదం అర్థరహితం, అసందర్భం అయిపోయి కొంత కాలానికి వాడుకలో వుండకుండా పోతుంది. దానిని ప్రజలుగూడా మరచిపోతారు. ఈ విధంగా కులరహిత సమాజ నిర్మాణానికి కులాంతర వివాహాలు ముఖ్య సాధనాలవుతాయి.

కులాంతర, వర్ణాంతర వివాహాలవల్ల మూడు ప్రయోజనాలు ముఖ్యంగా మనకు కన్పడుతున్నాయి. ఒకటి—పెద్దల ప్రోద్బలంతో గాక, తనకు నచ్చిన వాళ్ళను ఎన్నుకున్నందువల్ల తమకున్న పరిమితమైన పరథిలోనుంచి యువతీ, యువకులు బయటికి రావచ్చు. అంటే గిరిగీసినట్లున్న తమ కులంలో తమకు సరియైన వాళ్లు దొరక్కపోతే, దొరికిన వాళ్ళతోనే రాజీపడి, జీవితాంతం ఏదో వెలితిని అనుభవించటంకన్న, తనకు సరిపడే స్థాయిలో, తను

మెచ్చిన వ్యక్తిని ఎన్నుకున్నందువల్ల, ఎవరిస్థాయి మేరకు వాళ్ళు పూర్తిగా సుఖపడే అవకాశంవుంది. అలాంటి జంటలు "ఒకరి కోసరం ఒకరు సృష్టించబడ్డట్లుగా" ఇంగ్లీషులో చెప్పాలంటే" (Made for each other) లాగా మనకు కనబడతారు.

ఈ వర్ణాంతర వివాహాలు పరిష్కరించే రెండో సమస్య—వరకట్నం. ఈ కట్నాలు నేటి సమాజంలో ఒక విషవలయంలా తయారయినై. తన కూతురికి కట్నం ఇవ్వాలి గనుక, కొడుక్కి కట్నం తీసుకోవాలనే తాపత్రియంలో పడిపోతున్నారు చాల మంది. సంబంధాలు చూసేటప్పుడు, ముందు కట్నాల స్థోమతను చూసుకొని, తర్వాత మిగిలిన యోగ్యతలను ఎంచుకొంటున్నారు. కులాంతర వివాహాలు విరివిగా జరిగి, యీ కులాలసంకెళ్ళను ఛేదించుకోగలిగినట్లయితే, చాలమంది మధ్యతరగతి కుటుంబాల్లోని ఈ దయనీయమైన పరిస్థితి చాలవరకు తొలిగిపోతుంది.

ఇక వర్ణాంతర వివాహాలు పరిష్కరించే ముఖ్యమైన మూడో సమస్య—కులతత్వం. అంతర్వివాహాలు విరివిగా జరిగితే కులాల మధ్య నిర్మింపబడ్డ అడ్డు గోడలు క్రమంగా కూలిపోతాయ్. చాల తొందరగా కులరహిత సంఘ నిర్మాణం జరుగుతుంది. ఆ నవ సమాజంలో, కుల, వర్గ పక్షపాతాలకు ప్రాముఖ్యం తగ్గి వ్యక్తి ప్రతిభా విశేషాలకు సరియైన గుర్తింపు వస్తుంది. సరైన వ్యక్తి సరైన స్థానంలో వుంటాడు. తద్వారా దేశానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఇక, మార్పును కోరేవారు, మార్పును వ్యతిరేకించేవారు, అన్ని కాలాల్లోనూ వుంటూనే వుంటారు. వర్ణాంతర వివాహాలు చేసుకోనేవారిని జడిపించడానికి, వారిని వెలివేస్తామనో, వారి సంతానానికి పెళ్ళిళ్లు కావనో, వారి వివాహాలు విఫలమౌతాయనో, ఏవేవో బెదిరింపులు, సాకులు చెప్పి నిరోధింపచూస్తారు. అదే కులములో చేసుకున్న వివాహాలు మాత్రం విఫలమవటం లేదా? వివాహ సఫలత, విఫలత—భార్యా భర్తల ప్రగాఢ ప్రేమ, శీలము, భావ పరిణామం, సర్దుబాటుశక్తి, సదవగాహనపై ఆధారపడివుంటుంది. అంతేగాని వారి కులాలపైన ఆధారపడదు.

అందుచే సాంఘికాభ్యుదయాన్ని కాంక్షించే వారందరూ వర్ణాంతర వివాహాలు చేసుకొనుటకు యువతీ యువకులను ప్రోత్సహించాలి.

నవ సమాజాన్ని నెలకొల్పడంలో, అభ్యుదయ కాముకులందరూ చొరవతీసికొని ఎంతగా అటువంటి ఆదర్శవివాహాలకు తోడ్పడితే, భారత దేశంలో వర్ణరహిత సమ సమాజం అంత త్వరగా నిర్మించుకోవచ్చు.

ఆకాశంలో హరివిల్లు

ఆకాశంలో హరివిల్లు
ఆంధ్రలో భూకమతాల బిల్లు
పేదల హృదయాల విరిజల్లు
ప్రగతి పథాన తొలి సిరి ఇల్లు
ఎన్నాళ్ళకు వీచేను సంతోషపు పవనం ?
ఎన్నాళ్ళకు వెలిగినది చైతన్యదీపం ?
ఇన్నాళ్ళ స్వప్నాలు ఫలికెను
నేటితో లతలు పుష్పించెను
కృషిలేక కన్నీరు కురిపించు భూములు
పన్నీట స్నానాలు చేయునులే !
కష్టాలు తొలిగి, సుఖాలు పలకి
కష్టించువానికే కూడు ఉండునులే !

దేశమే సస్యశ్యామలమై
ప్రజలే శక్తి సంకేతాలై
ప్రజాస్వామ్యం, రామరాజ్యమై
అభ్యుదయానికి కళ్యాణం.

దారిద్ర్య నిర్మూలనలో తొలి ఘట్టం
సామ్యవాదపు చర్యకు దర్పణం
అందరిలో ఆశల పతాకం
ఆంధ్రలో భూకమతాల చట్టం.

"ప్రేమ"
(యస్. వెంకటరంగారెడ్డి)

పల్నాటి వీర కథా చక్రము:

'కోడిపోరు'

—తంగిరాల వెంకట సుబ్బారావు

తెలుగువీర గాథా కవిత్వములో ప్రాచీనమును, ప్రశస్తమును అగు

పల్నాటి వీరకథా చక్రమున సుమారు ఇరువదియైదు వీరగాథలున్నవని నా పరిశోధనము వలన తెలిసికొంటిని. వీనిలో 'కోడిపోరు' కథ, బాలునికథ అను రెండును మిక్కిలి దీర్ఘములైన ఉత్తమవీర గాథలేకాక, కథాచక్రమునకు మూలస్తంభములనదగు వీరగాథలు. కండపట్టుగల వీరగాథలు కూడ ఇవియే యనవచ్చును. పల్నాటియుద్ధమునకు ముఖ్యకారణము ఈ కోడి పోరే!

'కోడి పోరు' ఒక కథ కాదు. నిలో అయిదు భాగములున్నవి. దీనిని ఐదు కథల సమాహారముగా చెప్పవచ్చును. (1) 'కోడిపోరు ఒప్పందము'; (2) 'అర్థనాల చిట్టిమల్లుడు కథ'; (3) 'కోడి పూర్వజన్మ వృత్తాంతము'; (4) 'బాలగోపన్న కోడి పందెము'; (5) 'కన్నమనేమి యుద్ధము. ఇట్లు ఒక పెద్ద వీరగాథలో ప్రత్యేక కథలా అనిపించు అంతర్గాథలను జానపదులు 'కాండలు' అందురు. కావున 'కోడిపోరు' వీరగాథలో ఐదు కాండలున్నవని చెప్పవలెను. (బాలుని కథ'లో ఇట్టి కాండలు ఎనిమిది కలవు). వీనిని వరుసగా పరిశీలింతము.

1 కోడి పోరు ఒప్పందము

ఈ కాండ రెండు మూడు విధములుగా నున్నది. శ్రీనాథుని రచనలో — బ్రహ్మనాయుడు మలిదేవాదుల పెండ్లిండ్లు చేసి, కానుకలు తీసుకొని, నలగామరాజాదులను చూచుటకై గురజాలకు వచ్చినప్పుడు, నాగమ్మ అతనిని కవ్వించి పందెమునకు ఒప్పించి నట్లుగా నున్నది. వేఱొక జానపద కవి రచనలో ఈ ఒప్పందము భిన్నముగా నున్నది. నాగమ్మ మాచెర్లను దోచుటకై దొంగలను పంపగా, కన్నమనీడు ఆ దొంగలను తఱిమికొనుచు గురజాలకు వచ్చెను. అట నాయకురాలిచే కవ్వింపబడి కన్నమనీడే కోడి పందెము నొప్పుకొని మాచెర్లకు తిరిగి వచ్చును. (ఈ కథ నాకు నెల్లూరుజిల్లా వెంకటగిరి తాలూకా ఆల్తూరుపాడులో లభించిన తాళపత్ర గ్రంథమున గలదు). ముదిగొండ వీరభద్ర కవి పద్యకావ్యమున ('వీరభాగవతము') గూడ కొంతవరకు పై జానపద కథవలెనే యున్నను, చివర భిన్నముగా నున్నది. కన్నమనీడు దొంగలను తఱిమికొనుచు గురజాలకురాగా అతనిని వెదికి కొనుచు బ్రహ్మనాయుడు గూడ గురజాలకు వచ్చును. అప్పుడు నాగమ్మ (శ్రీనాథుని కథలోవలెనే) బ్రహ్మన్నను కవ్వించి పందెమున కొప్పించును. పద్యకావ్యములోనున్న ఈ కథ శ్రీనాథుని రచనకు జానపద కవి రచనకును సమన్వయము సాధించునట్లుగా నున్నది.

శ్రీనాథుని రచన:—

బ్రహ్మనాయుడు, మలిదేవుని పెండ్లి, పట్టాభిషేకములు పూర్తి చేసుకొని, మలిదేవుని ఆజ్ఞ పొంది, కానుకలు గైకొని పాలకిలో గురజాలకు వచ్చును. నలగామరాజాదులు అతనిని ప్రేమతో గారవింతురు. నాగమ్మ, బ్రహ్మనాయుని చంపుటకై విషాన్నమును బెట్టును. అవతార పురుషుడగు బ్రహ్మన్న దానిని జీర్ణించుకొనును. నాగమ్మ, బ్రహ్మనాయుని విడిది దగ్గర పిచ్చుకల పందెము, గొర్రెపొట్టేళ్ళ పందెము వేయించి నాయని కవ్వింప జూచును. కాని నాయడు చలింపడు. వెలమలకు కోడి పందెమన్న ఎక్కువ యిష్టమని గ్రహించి, నాగమ్మ కోడి పందెము వేయును. ఓడి పారిపోవుచున్న పుంజును జూపి నాగమ్మ, అది బ్రహ్మనాయని పుంజని పరిహసించును. నాయుడు మనస్సులో చెన్నకేశవుని తలచుకొనగా, ఓడి పాఱిపోయెడి ఆ పుంజు వెనుదిరిగి నాగమ్మ పుంజును జంపును. ఇరువురకును పౌరుషములు హెచ్చి, రాజ్యముల నొడ్డి, కోడి పోరు జరుపుట కొప్పుకొందురు. రెంటాల-పాలవాయి వీరబయళ్ళలో కోడి పందెమాడుటకు బ్రహ్మన్న అంగీకరించెను. కోడి పందెమున బ్రహ్మన్న ఓడిపోయినచో ఏలేశ్వరము రేవున కృష్ణను దాటి, మండాదికి ఏడేండ్లు వలస పోవలెను. ఇట్లు కోడిపందెము నొప్పుకొని బ్రహ్మనాయుడు మాచెర్లకు వచ్చెను.

మలిదేవుని సభలోని రాజులు ఆడుదానితో కోడిపందెము ఒప్పినందులకు బ్రహ్మనాయని గర్హించిరి. బ్రహ్మన్న, గురజాలలో జరిగిన విషయమంతయు వివరించెను. మలిదేవుని పక్షమువారు పందెమునకు తగిన కోడిపుంజును సంపాదింప ప్రయత్నించిరి. కాని నాగమ్మ భూలోకములోని కోళ్ళన్నియును తనవేయని చాటించెను. బ్రహ్మన్నకు కోడి యెచ్చటను దొరుకునట్లులేదు. అప్పుడు మలిదేవుని సభలోని రాజులు భయపడి, మధుమక్షికముల వలన గజరాజు పట్టణమునకు చేటువచ్చినట్లుగా, ఈ కోడిపందెమువలన మాచెర్లకు మోసము వచ్చునని ఒక ఉపకథను చెప్పిరి.

ఎఱుక ఒకడు తేనె నమ్ముకొనుచు గజరాజు పట్టణమునకు వచ్చెను. అచట పోలిసెట్టి అను వైశ్యుడు తేనె చూపుమని కోరగా, ఆ యెఱుక తేనె కుండపై మూత తీసి, అందు చచ్చి పడియున్న ఈగను చేతితో తీసి గోడపైకి విసిరెను. గోడపై పడ్డ ఆ మక్షికమును వెంటనే ఒక బల్లి మ్రింగెను. ఆ బల్లి నొక ఎలుక చంపెను. ఆ యెలుకను పోలిసెట్టి పెంపుడుపిల్లి చంపెను. ఆపిల్లిని ఎఱుకతోనున్న కుక్క చంపెను. తన పిల్లిని చంపినదన్న కోపముతో సెట్టి ఆ కుక్కను చంపెను. తన కుక్కను చంపినాడన్న రోషముతో ఎఱుక ఆ సెట్టిని చంపెను తమ తండ్రిని చంపినాడని ఆ సెట్టి పుత్రులు మేనల్లుండ్రు కలిసి ఆ యెఱుకవానిని హతమార్చిరి. మఱునాడా యెఱుక వాని భార్య, భర్తను వెదకికొనుచు వచ్చి, విషయమును గ్రహించి, దాని నా పట్టణమునేలు రాజునకు విన్నవింపగా, అతడనాదరించి ఆమెను మెడపట్టి గెంటించెను. ఆ యెఱుకత తనవారి నందఱని రప్పించి, ఆ గజరాజు పట్టణమును కొల్లగొట్టించి, కసి తీర్చుకొనెను. (సరిగా ఈ కథ యెట్లు జరిగినదో పల్నాటి కథయు న్నట్లే జరిగినదని చెప్పవచ్చును. కోడిపోరుకడ ప్రారంభమైన స్వల్పకలహము యుద్ధముగా పరిణమించి, ఆ యుద్ధము కారెంపూడిలో ఘోరయుద్ధమై బాలచంద్రాది మహావీరులను బలిగొన్నది. కవి దీనిని దృష్టియందుంచుకొనియే పై ఉపాఖ్యానమును కల్పించెనని నా అభిప్రాయము.

ఈ ఉపకథనువిని, బ్రహ్మనాయుడు భయపడవలదని రాజుల నూఱడించి, కంచర్లకు పోయిన బాదరాజు (పెద్దన్న) తప్పక కోడి వృత్తాంతము తెలిసికొని వచ్చునని చెప్పెను.

జానపద కవిరచన:—

దొంగలను తఱిమికొనుచు గురజాలకు పోయిన కన్నమనీడు, నాగమ్మదగ్గఱ కోడిపందెము నొప్పుకొని, తిరిగి మాచెర్లకు వచ్చి బ్రహ్మనాయనితో చెప్పును. ఇందు నాగమ్మ, కన్నమనీని కవ్వించుటకై రాముడు లక్ష్మణుడు అను రెండు కోడిపుంజులను పోరించినదనియు, రాముడను కోడి పాటి పోవుచుండగా నాగమ్మ 'అడుగో నాయుడు వెళ్లెవెళ్లెనన్నాది' అనియు కలదు. అప్పుడు కన్నమనీడు ఆ కోడి కెదురుగా పోయి, తన పంద్రెండు మూరల భైరవకత్తిని కోడికడ్డముగా పెట్టి, 'వెళితే కోడి! మా తండ్రి బ్రహ్మనాయని పాదంబులాన' అని అనగా, ఆ వెళ్లెడి కోడి తిరిగి లక్ష్మన్న యనెడి కోడినికూల తన్నెనని యున్నది.

వీరభద్ర కవి రచన :—

ముదిగొండ వీరభద్రకవి (క్రీ. శ. 1862) రచించిన 'వీర భాగవతము' పద్యకావ్యములో 'రావగాపు కథ' 'మలిదేవునిపెండ్లి' విడువబడినవి. బాలుని పుట్టుక, బాలుని వివాహము చెప్పి, తరువాత కోడిపోరు ఒప్పందము తెలుపబడినది.

మాచెర్లలో బాలునకు వివాహముచేసి, బ్రాహ్మణులకు విరివిగా సంభావనలిచ్చి, బ్రహ్మనాయుడు సుఖముగా నుండెను. అప్పుడు నాగమ్మ, మాచెర్ల పురవృత్తాంతమును తెలిసికొనుటకై 'ఎల్లడు' అను వేగులవానిని పంపెను. ఆ వేగులవానిని బ్రహ్మన్న పట్టుకొని, ఉల్లసమాడి విడిచిపుచ్చెను. ఎల్లడు గురజాలకు వచ్చి నాగమ్మతో మాచెర్లపుర వైభవంబును వర్ణించి చెప్పెను. నాయకురాలికి ద్వేషము పెచ్చుపెరిగి, మాచెర్లను దోచిరండని కొందఱు దొంగలను పంపెను.

నాయకురాలు పంపిన దొంగలను కన్నమనీడు పట్టుకొని, వారిని గురజాల ఊరిబయట దొడ్డిని తోలెను. కన్నమ జాడనుతెలిసికొనుటకై బ్రహ్మనాయడు గురజాలకు వచ్చెను. నాయకురాలు బ్రహ్మనాయనికి విషాన్నమును పెట్టినది; కాని ఫలితము లేక పోయెను. నాయడు నరసింగరాజునకు దొంగల నప్పగించెను. (వీరభద్రకవి నలగామునికాక నరసింగరాజునే గురజాలకు ప్రభువుగా చిత్రించుట శోచనీయము). కోడి పందెమున నాయకురాలు బ్రహ్మనాయని కవ్వించినది. పందెము నొప్పుకొని బ్రహ్మనాయడు మాచెర్లకేతెంచెను.

2. "అర్ధనాల చిట్టిమల్లడు కథ"

ఇది కోడిపోరు వీరగాథలో రెండవకాండము. దీనికి 'రావీరపడాలు కోడిని తెచ్చే కాండ' అనియు నామాంతరము. నాగమ్మ భూలోకములోని కోళ్లన్నియు తనవని చాటింపగా, బ్రహ్మనాయడు మున్నగువారు కోడిని తెచ్చుకొనుటకు మిక్కిలి ప్రయాసపడుచుండిరి. ఇంతలో కంచెర్లనుండి పెద్దన్న బాదరాజు వచ్చినాడు. కంచెర్లను జయించి వచ్చుచుండగా పానుగల్లు పట్టణమున తనకు గలిగిన యనుభవముతో పెద్దన్న బాదరాజు కోడి వృత్తాంతమును చెప్పెను. పానుగల్లులో శనైశ్చరుడను చట్టుబండ క్రింద 'అర్ధనాల చిట్టిమల్లడు' అను కోడి కలదనియు, అది దైవాంశచే నుద్భవించిన కోడియనియు దెల్పెను.

బ్రహ్మనాయడు తన అన్నగారి మాటలు విని, 'రావీరపడాలు' ('రాయవీరపడాలు'—ఇతడు పెదమలిదేవుని భార్యయగు సిరాదేవితో అరణముగా వచ్చిన గొల్లబంటు—మహావీరుడు) అను వీరుని పంపెను. అతడు పానుగల్లు పట్టణమునకు పోయి, అటనున్న బేతాళుని జయించి, అర్ధనాల చిట్టిమల్లిని దీసికొని, పరుగుపరుగున మాచెర్లకు వచ్చుచుండగా, మార్గమధ్యమున చోరులడ్డగించిరి. రావీరపడాలు ఆ దొంగలనెదిరించి, దూలాల పోతిరెడ్డి మున్నగువారిని చంపి, కోడిని సురక్షితముగా మాచెర్లకు చేర్చెను.

3. "కోడి పూర్వజన్మ వృత్తాంతము"

ఈ కోడి పూర్వజన్మ వృత్తాంతము 'పెద్దన్న పెళ్లి రాయబారము' అను కథలో వచ్చును. వీరభద్రకవి యీ కథను కావ్య ప్రారంభమందే చెప్పినాడు. నాకు లభించిన కారెంపూడి తాళపత్ర ప్రతిలోనిది మలిదేవుని పెండ్లితరువాత వచ్చినది. కాని నాకు నెల్లూరు మండలమున ఆల్తూరుపాడులో లభించిన వేఱొక తాళపత్ర గ్రంథములో కోడి పూర్వజన్మ వృత్తాంతము పెద్దన్న పెళ్ళి రాయబారము కథలో భాగముగా గాక కోడిపోరునకు ముందు ప్రత్యేకముగా చెప్పబడింది.

వీరభద్రకవి రచన :—

పూర్వకాలమున ఫలదుడను మహర్షి ముగ్గురు దస్యులను కోడిగ్రుడ్లుగా పుట్టుడని శపించెను. వారు ఒక వనములో అవురు దుంప క్రింద మూడు కోడిగ్రుడ్లుగా జన్మించిరి. వాని నొక చెంచుల ఱేడు తన యింటికి తీసికొనిపోయి భద్రపఱచెను. అందులో ఒక గ్రుడ్డు వ్రుళ్లిపోయి మఱు జన్మమున 'బాలగోపన్న'గా జన్మించెను. ఇంకొక గ్రుడ్డు పెట్టగామాఱి, వెంటనే చనిపోయి 'పేరాదేవి' (ముత్యాలపేరమ్మ—నలగామరాజు కూతురు, అలరాజు భార్య)గా పుట్టెను. మిగిలిన గ్రుడ్డు పుంజుగా పెఱిగి పెద్దదయ్యెను. అదియే 'అర్ధనాల చిట్టిమల్లడు'.

ఒకనాడు వనమున వేటాడవచ్చిన అఱువది యార్గురు పానుగంటి రాజపుత్రులకు చెంచులఱేడు ఆతిథ్యమిచ్చెను. చిట్టిమల్లడు ఆ రాజపుత్రుల వేటడేగలను చంపి, వారి మరణమునకు కారణమయ్యెను. ఆ రాచబిడ్డల భార్యలు సహగమనము చేసిరి. దీని కంతటికిని కారణమగు చిట్టిమల్లునకు భయపడి, చెంచులఱేడు ఆ కోడిపుంజునొక యినుపపెట్టెలో పెట్టి, పానుగంటి కోట బయట భూస్థాపితము చేసెను.

పెద్దన్న బాదరాజు కంచెర్ల నుండి వచ్చుచు పానుగంటి సమీపమున విశ్రమించెను. అతని గుఱ్ఱము 'కారుబొల్లడు' నేలపై కాలితో దువ్వగా చిట్టిమల్లడు బయటకు వచ్చెను.

జానపద రచన :—

నాకు లభించిన ఆల్తూరుపాడు రెండవప్రతిలో కోడి పూర్వ జన్మ వృత్తాంతము వేఱుగానున్నది. అహల్యను పెండ్లాడుటలో ఇంద్రుడు, గౌతముడు పోటీపడుదురు. గౌతముడు, కామధేనువు సహాయముతో, దేవతలు చెప్పిన పారిజాత పుష్పమును ఇంద్రుని కన్న ముందుగా తెచ్చి, అహల్యను వివాహమాడును. ఇంద్రుడు పగపట్టి, యెట్లైనను అహల్యను పొందవలెనని, సూర్యుడు, శుక్రుడు బృహస్పతి—ఈ ముగ్గురును తోడురాగా, గౌతముని ఆశ్రమమునకు వచ్చును. ఇంద్రుడు నెమలి కూత కూసి, గౌతముని మోసగించి, అహల్యను పొందును. అహల్యను ఇంద్రుడు కలసికొనగా వాలి, సూర్యుడు కలసి కొనగా సుగ్రీవుడును పుట్టిరట. గౌతముడు వారి మోసమును గ్రహించి శపించెను. ఆ శపించుటలో బృహస్పతిని అడవికోడిగా పుట్టుమనెను. అతడే అర్ధనాల చిట్టిమల్లడు.

4. బాలగోపన్న కోడిపందెలము కథ

'కోడిపోరు' వీరగాథలో నిది నాల్గవ కాండము. అయిదు కాండలలోను ప్రధానమైనదియు నిదియే. ఈ కోడిపందెము గురజాలకును మాచెర్లకును మధ్యగల 'పాలవాయి—రెంటాల' అను గ్రామములకు దగ్గరలోనున్న వీరబయళ్లలో జరుగుటచే దీనిని "పాలవాయి కోడిపందెము కథ" అనియు పిలుచుట కలదు. పింగళివారి ప్రతిలో (విశాలాంధ్రవారు 1961 లో ప్రచురించినది) ఈ కోడి పందెము గురజాలలో జరిగినట్లుగా నున్నది. ఇది తప్పు. నాకు లభించిన శ్రీనాథ కృతమగు తాళపత్రగ్రంథమున నాగమ్మ బ్రహ్మనాయనితో నిట్లనును:

"పాల్వాయి రెంటాల వరవీరబైళ
కోడిగుట్టల కాడ గొబ్బున నాడ
వోడు గెల్పులు రెండు వనరుగా మనకు
కనిపించు నప్పుడు ఘనముగా మనకు"

—(కారెంపూడి తాళపత్రప్రతి. ఆకు 159 బి.)

నాగమ్మ దగ్గర కోడిపందెము నొప్పుకొని బ్రహ్మనాయడు మాచెర్లకు తిరిగివచ్చి మలిదేవాదులతో నిట్లనును:

"పాల్వాయి రెంటాల పాలబయలు చొట
కోడి గుట్టల కాడ గొబ్బున నాడ
అచ్చోట పందెంబు అతివనాచేత
వప్పించుకున్నది వామాక్షి నాతో"

—(కారెంపూడి తాళపత్రప్రతి, ఆకు 163 బి.)

నేడు పల్నాడులో పాలవాయి రైల్వే స్టేషను, గేటు దగ్గఱ నున్న రెండు పెద్ద తాళ్ళగుట్టల కడ ఈ కోడి పందెము జరిగినదని ప్రజలు అనుశ్రుతముగా చెప్పుచున్నారు. ఆనాటి కోడి పందెమునకు వచ్చిన అసంఖ్యాక జనసందోహము కూర్చొనుటకుపయోగించిన గుండ్రని రాళ్ళే ఆ గుట్టలని జనశ్రుతి. వీరికి 'కోడిపోరు గుట్టలు' అని పేరు. కాబట్టి పందెము గురజాలలో జరిగినదనుట అవిచారితము.

మరునాడు పందెమనగా అర్ధనాల చిట్టిమల్లుని తన దగ్గఱకు పంపుమని శీలమ్మ బ్రహ్మనాయని కోరినది. ఆమెకోరిక ప్రకారము బ్రహ్మన ఆ పుంజును తల్లికడకు పంపెను. శీలమ్మ కోడిని అలంకరించి మెడలో ముత్యాల హారమువేసి, తన కుమారునకు విజయము చేకూర్చుమని ప్రార్థించినది. మరునాడు బ్రహ్మన్న కన్నమదాసుతో కలసి కోడిపందెమునకు బయలుదేరుచుండెను. ఆ వార్త విని గొట్టిపాళ్ళ గ్రామములోనున్న 'బాలగోపన్న' కూడ బయలుదేరెను. (పింగళివారు పరిష్కరించిన విశాలాంధ్ర ప్రతిలో గోపన్న పేరు 'చెవుల గోపన్న' అని యున్నది. 'చెవుల' అనునది యింటిపేరు కాబోలును. లేదా 'బాల' శబ్దమును 'చాల' గా భావించి, అర్థమును కిట్టించుటకై దానిని 'చెవులు' చేసిరేమో!) బ్రహ్మనాయడు గోపన్నను పందెమునకు రావలదని యెంతవారించినను అతడాగలేదు. చివరకు బ్రహ్మన్న సమ్మతించి, చిట్టిమల్లుని గోపన్న చేతికిచ్చెను. మాడుగుల గ్రామమున రెడ్డి బ్రహ్మనాయనికి విందు చేసెను. బ్రహ్మనాయడు గోపన్నకు వైష్ణవమిచ్చి 'గోపాలదాసి' యని పేరు పెట్టెను. ఆ నాటికి మాడుగుల గ్రామములో ఆగి, మరునాడు 'పాలవాయి—రెంటాల వీరబయళ్ళ' కు చేరిరి.

కోడి పందెములో మొదటి పందెమున బ్రహ్మనాయడు గెలిచెను. నాగమ్మ మారు పందెమున కొప్పించినది. ఆ రోజునకు పందెమాయెను. నాటిరాత్రి నాగమ్మ బ్రహ్మనాయనికి విషాన్నమును పెట్టెను. కాని ఫలితము లేకపోయినది. గంగవర గ్రామమునకు కబురుపెట్టి, కట్టుబోతులను రప్పించినది. పందెము జరుగుస్థలములో బ్రహ్మనాయడు కూర్చుండుచోట తమగము త్రవ్వి, కీలు

నేర్పాటు చేసియుంచినది. మరునాటి పందెములో మాచెర్ల కోడికి కట్టు కట్టించి ఓడించినది. అట జరిగిన కలహములో బాలగోపన్న మరణించెను.

మాచెర్ల రాజుల పుంజుపేరు 'అర్ధనాల చిట్టిమల్లడు' కాగా, గురజాల రాజుల పుంజుపేరు 'నల్లమల్లడు'. కోడిపందెమంతయు కోడిని వదలు పందెగానిపై నాధార పడియుండును. మాచెర్ల పుంజును బాలగోపన్నయు గురజాల పుంజును 'మువ్వల భీముడు'ను పందెమునకు వదలినట్లుగా ముదిగొండ వీరభద్రకవి 'వీరభాగవత ము'నగలదు. గురజాల పుంజును చింతపల్లి రెడ్డి వదలినట్లుగా విశాలాంధ్ర ప్రతిలో గలదు. ఇది సమంజసము కాదు. చింతపల్లి రెడ్డి నలగాముని మంత్రులలో నొక ప్రధాన వ్యక్తి. ఇతడు పందె గాడుకాడు. పల్నాటిసీమలో జనవ్యవహారమున గూడ మువ్వల భీముని పేరే వినబడుచున్నది.

విశాలాంధ్రప్రతిలో (అనగా మల్లయ్య రచనలో) చిట్టి మల్లునిపై నాగమ్మ మంత్రాక్షతలు చల్లి చంపించినదని యున్నది. వీరభాగవతములోను, తక్కిన వీరగాథలలోను, జనవ్యవహారము నను—నాగమ్మ గురజాలకు దగ్గఱలోనున్న 'గంగవరము' అను గ్రామమునుండి కట్టుబోతులను రావించి, వారిచే చిట్టిమల్లుని కన్ను పోగొట్టించెనని యున్నది. (ఈ గంగవరము నేటికిని మంత్రగాం డ్రకు కట్టుబోతులకు ప్రసిద్ధి. దీనిని కట్టుబోతుల గంగవరము అని యే ప్రజలు పిలుచుచుందురు.)

మల్లయ్య రచనలో, నలగాముని లెంకలపై విజృంభించిన చెవుల గోపన్నను ఆరెజోగన చంపినట్లుగా కలదు. వీరభాగవత మున, బాలగోపన్న తనకోడి ఓడిపోయె నన్న విరాగముతో తన్ను చంపుమని మువ్వల భీముని కోరినట్లున్నది. నాకు లభించిన తాళ పత్రగ్రంథములో బాలగోపన్న విరక్తితో తన్ను చంపుమని 'ఆరె వారి జోగిరౌతు'ను కోరినట్లున్నది, బ్రహ్మనాయడు ఆ జోగిరౌతును పట్టుకొని "నీవేల గోపన్నను చంపితివి ?" అని యడుగగా అత డిట్లనెను. (గోపన్న తన్ను చంపుమని జోగిరౌతును కోరగా, అతడు సంకోచించినాడట—)

"'నేను వెనుక ముందాడితిని
నీకు భయమేమి వెరుపేమి వెయ్యమని పలికె
అందుకుని బాణము అటువేసినాను
కాబట్టి గోపన్న వరిగినా' డనెను.
'నీవు ఎదిరించి విద్ధము శాయలేదా' యనెను.
'వెయ్యమంటే వేస్తిని, నేను
ఎదిరించి విద్ధము శాయలే' దనెను."

—(ఆల్తూరుపారు తాళపత్రగ్రంథము, పత్రసంఖ్య 108 ఎ.)

వీరభాగవతమున చనిపోయిన బాలగోపన్నను బ్రహ్మనా యడు తిరిగి బ్రతికించినట్లుగా గలదు. మల్లయ్యరచనలో, గోపన్నను చంపిన ఆరెజోగనను కన్నమనీడు సంహరించినట్లుగా నున్నది. నాకు లభించిన తాళపత్రప్రతిలో ఆరెవారి జోగిరౌతును బ్రహ్మ నాయడు పై విధముగా ప్రశ్నించి, విడిచి పుచ్చినట్లున్నది. ఇందు కన్నమనేని యుద్ధములేదు. మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని ప్రతులలో 'కన్నమనేని యుద్ధము—గోపుసంస్కా రము' అనునది ప్రత్యేక కథగా నున్నది. ఈ బాల గోపన్న కోడి పందెము కథను 'పాలవాయి కోడి పందెము' అనియే గాక 'గోపు యుద్ధము' అను పేరుతో పిలుచుట కూడ కలదు.

5. "కన్నమనేని యుద్ధము-గోపుసంస్కారము"

కొన్ని ప్రతులలో 'కన్నమనేనియుద్ధము' అనిమాత్రమే కలదు. అంత్యముననిది శ్రీనాథుని రచనగానున్నది. కాని రచనా విధానమునుబట్టి యిది మల్లయ్య రచన కావచ్చునని డాక్టరు బి. రామరాజుగారు భావించుచున్నారు.

కోడిపందెములో ఓడిపోయిన బ్రహ్మనాయడు కన్నమతో కలసి మాచెర్ల మార్గమున పోవుచుండెను. బాలగోపన్న కూలిన సంగతి బ్రహ్మన్నకు తెలియదు. బాలగోపన్నను కూల్చిన ఆరె జోగన అంతటితో నాగక, సైన్యమును వెంటబెట్టుకొని బ్రహ్మనా యని వెన్నంటెను. ఆ కలకలమును జూచి బ్రహ్మన్నయు కన్నమనీడును వెనుదిరిగి చూచిరి. వెంటనే కన్నమనీడు విజృం భించి ఆరెజోగన్నను చంపి, శత్రుసైన్యమును గురజాల వఱకును తఱిమెను. బ్రహ్మనాయడు ప్రాణావశిష్టుండైన బాలగోపన్నకు తులసి తీర్థమిచ్చి స్వర్గమున కంపెను. గోపుశవమును పాలకిలో మాచెర్లకు తెచ్చెను. గోపన్నతల్లి 'దారసాని' మిక్కిలి దుఃఖించెను.

నాకు కారెంపూడిలో లభించిన ఒక తాళ పత్రప్రతిలో బాల గోపన్న (గోపు) భార్యపేరు 'గోపితులసి' అనియున్నది. ఈమె తన భర్తతో సహగమనము చేసినట్లుగా అందు వర్ణితమైనది.

పల్నాటి వీరకథల రసవద్రచనకు మచ్చుతునకగా కోడిపోరు కథలోని బరిమీద పోట్లాడెడి కోళ్ల వర్ణనతో ఈవ్యాసమును ముగింతును :—

మల్లయ్య రచన:-

"పోరుకు విడిచిన పుంజులు రెండు
పొంగుచు రెక్కలు పొరిపొరి నార్చి
కనుల నిప్పులు రాలుకైవడి రవులు
ఉగ్రంపు దృష్టిని నొండొంటి జూచి
కులగిరు లదరంగ కూయుచు చేరి
ముక్కుముక్కున చేర్చి మొనసి రోషమున
మెడ యీక లుబ్బగా మెడవంచి రెండు
ఉప్పరం బెగయుచు నురవడి తన్ను
తన్నిన తూలక దట్టంపు గోళ్ల
మిట్టి మీదికి నెగసి మీరుచు తన్ని
రెక్కల పెల్లార్చి రేగి మొత్తంగ
పెంధూళి యెగసియు పెంపగు చుండ
సంగ్రామ కేళికి సంతసంబంది
ఊకించి తన్నగా నురముల నాటి
రక్తంబు దొరగంగ రాగంబు నొంది
తన్నుట తాకుట తమకు నొచ్చుటయు
తలపక మగటిమి తలకొని రెండు
త్రుళ్ల పడె నట దేవతలు చోద్యపడగ!"

జల్లి సమిష్టి క్షేత్రం

బి. సుదర్శనం

జల్లి సమిష్టి వ్యవసాయ క్షేత్రం దిఇ 25 మార్చి 1971 న రూ. 9.22 లక్షల ప్రణాళికతో ప్రారంభించబడింది. గుట్టువక్కల గ్రామములనుండి నిరుపేద హరిజన కుటుంబాలను యీ సమిష్టి క్షేత్రసభ్యులనుగా చేర్చుకున్నారు. దాదాపు 1000 ఎకరాల సేద్య యోగ్య ప్రభుత్వ భూమిని యీ సమిష్టి క్షేత్రానికి ఇవ్వడం జరిగింది. ప్రారంభంలో కొంత ప్రతిఘటనను యెదుర్కొన వలసినప్పటికి ప్రభుత్వం పట్టుదలతో యీ కార్యక్రమాన్ని చేపట్టింది గనుక అట్టి ప్రతిఘటనను అధిగమించింది. ఇప్పుడు 89 మంది సభ్యులు భూమిని సాగుచేయుచున్నారు. దా ఫలసాయాన్ని అనుభవిస్తున్నారు. ముస్ముందు మిశ్రమ వ్యవసాయ పథకాన్ని అమలు జరుపవలసివుంది. ఆవుల, పాడిగేదెల, కోళ్ళపెంపకాన్ని చేపట్టవలసి వుంది.

జల్లి క్షేత్రం నర్సంపేటకు ఐదుమైళ్ళ దూరములో నెక్కొండపై పుకలదు. ఈ భూమి చెన్నరావుపేట, అమీనాబాదు, జల్లి యెల్లాయిగూడెం, తిమ్మరాయినపాడు గ్రామములమధ్య వున్నది. చెన్నరావుపేట చెరువుక్రింద సాగు వరిచేలనానుకొని రెండు మూడు గుట్టలుదాటి రెండుమైళ్ళ పొడవున యెల్లాయిగూడ భూములను కలిసింది. ఈ క్షేత్రం మధ్యగా తిమ్మరాయినపాడుకు మెటల్‌రోడ్డు ఉన్నది. నర్సంపేట, నెక్కొండ పి. డబ్ల్యు. డి. రోడ్డుపై జల్లి బ్లాక్ 1 స్థాపించారు. దీనికి సమీపముగా విద్యుత్ లైన్ వున్నది. మునుముందు విద్యుత్తును బావులకు తీసుకొనుటకు పథకం కలదు. జల్లి బ్లాక్ 2 ను యెల్లాయిగూడాకు సమీపంలో స్థాపించారు.

పునరావాసం

జల్లి బ్లాక్ నెం. 1 లో 46 కుటుంబాలు జల్లి బ్లాక్ నెం. 2 నందు 43 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. ఇటీవల రాష్ట్ర నిమ్నజాతుల, ఆటవిక జాతులకుటీర నిర్మాణ పథకంక్రింద ఈ సభ్యులందరికి 1000 యిళ్ళ గృహనిర్మాణ పథకాన్ని రూ.1.80 లక్షల ఖర్చుతో చేపట్టి నిర్వహించుచున్నారు. దాదాపు ఇళ్ళు ముగియుచున్నవి. సమిష్టి వ్యవసాయాన్ని విజయవంతంగావించుటకు ప్రప్రథమంగా సభ్యులందరు కలిసిమెలసి క్షేత్రమునందే వుండి సమైక్యతను కల్గియుండుట ఆవశ్యము. అందుకుగాను ఇట్టి పునరావాస సౌకర్యము కల్పించబడినది. ఆ క్షేత్ర సభ్యులంతా ఒకే కుటుంబసభ్యులన్న సంఘీభావము కల్గినట్లు దాని నిర్వాహకులు వారిలో ఐక్యతా భావాన్ని కల్గించుటకు శాయశక్తుల ప్రయత్నించుచున్నారు.

పునరావాసులకు కావలసిన సౌకర్యములన్నింటిని కల్పించుటకు అటు జిల్లా కలెక్టరుగారు, ఇటు సమితి అధికారులు ప్రయత్నించుచున్నారు. పునరావాసులైన వారి పిల్లలకు పాఠశాలలను నెలకొల్పారు. బాలవాడీని తెరచారు. పౌష్టికాహార పథకాన్ని విస్తృతం చేశారు—మంచినీటి కొరకై బావులను సభ్యులే త్రవ్వుకున్నారు. వైద్య సౌకర్యం కల్పించారు. గ్రామసేవకుని, సేవికలను ప్రత్యేకంగా కేటాయించారు. పరిశుభ్రతను నేర్పుటతోబాటు క్షేత్ర నిర్వహణలో ఆ యా సభ్యులెంతవరకు భాగస్తులో వారికి గ్రహింపును కల్గించుచున్నారు.

ప్రణాళిక

క్షేత్ర నిర్వహణకు రూ. 9.22 లక్షలతో బృహత్తర ప్రణాళికను రూపొందించారు. వ్యవసాయానికి మూలం నీటి వవరు కాన 40 వ్యవసాయ బావులను త్రవ్వుటకు విస్తృత కార్యక్రమాన్ని తలపెట్టారు. దీనికి దాదాపు 2.5 లక్షల ఖర్చు కాగలదు. ఈ బావులకు విద్యుత్ యంత్రముల సమర్చుటకు తలపెట్టారు. దీనికి అదనంగా ఒక లక్ష అయినా ఖర్చు అవుతుంది. కాగా భూమిని సేద్య యోగ్యము గావించుటకు బుల్‌డోజర్‌లను, మరనాగళ్ళను వాడినందులకుగాను దాదాపు రూ. 1.5 లక్షలు ఖర్చు అంచనా వేయబడింది. అట్టిపని మొన్నమొన్ననే ముగిసింది. ప్రస్తుతందాదాపు 800 ఎకరాల భూమిని రేపు తొలకరి వ్యవసాయాన్ని చేయుటకు సిద్ధపరచారు. దాదాపు 25 లక్షల రూపాయల వ్యయంతో యిదివరకే 50 జతల గిత్తలనుకొన్నారు. గత ఋతువులో 240 ఎకరాలలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, గోధుమలు, ఆముదాలు, మిరప, యింకా కూరగాయలు మొదలుగా గల పంటలను పండించారు. ఖర్చు 8000 రూ.లు కాగా 17000 రూ॥ల మేరకు ఆదాయాన్నార్జించారు. సభ్యులంతా, వచ్చిన ఆదాయమును 3 : 1 నిష్పత్తి చొప్పున పంచుకున్నారు. సంఘపు మూలనిధికి ఒకవంతు జమచేయగా మూడువంతులు సభ్యులు పంచుకున్నారు.

క్రమబద్ధమైన పైర్ల పెంపకంతోపాటు గుట్టల సమీపమందు టేకు యూకలిప్టస్, మామిడి, జీడిమామిడితోటను పెంచవచ్చు. ప్రత్తి, జనుము పంటలను కూడా పెంచవచ్చు.

నీరు

ప్రస్తుతం 11 వ్యవసాయ బావులను హరిజన సమాజపు వ్యవసాయ బావుల పథకం క్రింద 5 బావులను మిగిలిన వాటిని సంఘ అధ్వర్యమున త్రవ్వించుచున్నారు. పని చురుకుగా జరుగుచున్నది. జియాలజిస్టు సహాయముతో నీరు పడు పాయింట్లను గుర్తించి ఈ బావులను త్రవ్వుచున్నారు. ఫలితాలు చాలా ఆశాజనకంగానున్నవి. వీటితోపాటు గొట్టపు బావులను కొన్నింటిని చేపట్టుట మంచిదని జియాలజిస్టుగారి సలహా, వారి సూచన క్రియా రూపము దాల్చిన నాడు, కొన్ని గొట్టపు బావులనుండి జనమెల్ల నీటిని పారించుకునే అవకాశము లభించుతుంది. వేసవి కాలం కూడా ఈ ప్రాంతమందు 40 అ॥ మేరకు నీటి వూట కలదు. అంతకుమించి బావుల త్రవ్వుట కష్టము, లాభసాటికాదు కావున 100—120 అడుగుల లోతుపోయిన గొట్టపు బావులకు సంవత్సరమంతా నీరు లభించే అవకాశం కలదని జియాలజిస్టుగారు వ్యక్తపరిచారు. 40 బావుల త్రవ్వుట తాత్కాలికంగా సభ్యులకు పని కల్పించినా ఖర్చుని త్రోసిపుచ్చక అవకాశాన్ని

బట్టి కొన్ని గొట్టపు బావులనైనా త్రవ్వినచో నీటి వనరు పుష్కలం కాగలదు. దీనికి అదనంగా 24 ఎకరాల పారకం కాగల ఒక చెరువును గుట్టలమధ్య నిర్మించుచున్నారు. దాదాపు ముగిసింది. ఈ వనరులన్నీ పూర్తి అయిననాడు సమిష్ఠి వ్యవసాయానికి తిరుగుండదని ఆశాభావం.

యీ సమిష్టి క్షేత్రం స్థాపించిన శ్రీ కె. ఆర్. వేణుగోపాల్‌గారు, జిల్లా కలెక్టరు శ్రీ కె. మాధవరావు గారు ఇక్కడ త్రవ్విన నీటి బావులను చూసి ముగ్ధులయ్యారు. బావులను తవ్వినప్పుడు బయటకు తీసే నీరు వృధా పోకుండా ఆ నీటితో 8.5 ఎకరాల పంటను పండించారు సభ్యులు. ఆరు ఆయిల్ ఇంజన్లు పని చేయుచున్నవి. ప్రస్తుతం పూర్తి అగుచున్న బావుల క్రింద దాదాపు 100 ఎకరాల వరి పైరును రేపు తొలకరిలో సాగు చేస్తామని జిల్లా కలెక్టరు గారు తెలుపుచున్నారు. బావులన్నీ పూర్తి అయిననాడు కేవలం వర్షాధార పైరు. లేక నీటివనరుతో పండించగల పైర్లన్నీ లాభసాటిగా పెంచవచ్చు. పుష్కలమైన నీటి వనరులను కల్పించుకొనుట ఈ సమిష్ఠి క్షేత్ర విజయానికి ఆయువు పట్టనవచ్చు.

నిర్వహణ

వ్యవసాయాన్నికూడా ఒక పరిశ్రమగా పరిగణించక తప్పదు. పెట్టుబడి, ఆదాయాలను అంచనావేసి తదనుగుణంగా ఫలసాయాన్ని సాధించుటకు నేర్పు నైపుణ్యముగల వ్యవసాయ నిర్వహణ ఆవశ్యకము. దానికి గాను నిపుణులైన వ్యవసాయ సిబ్బందిని అనగా అనుభవంగల విస్తరణాధికారిని దానికి బాధ్యునిగా చేశారు. అట్లే ఆయా ఖర్చు లెక్కలను క్రమముగా వ్రాయుటకు సహకారసంఘాల సబ్ రిజిష్ట్రారును నియమించారు. దీని నిర్వహణ యంతటిని నర్సంపేట తహసీల్దార్ గార్కి అప్పగించారు. ప్రప్రథమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిగారు దీనిని పర్యవేక్షించేవారు. ప్రస్తుతం జిల్లా సమాచార శాఖాధికారిని నియుక్తులను గావించినట్లు తెలుస్తున్నది.

ఏదిఏమైనా జిల్లాకలెక్టర్‌గారు ఈక్షేత్ర నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధవహించి పర్యవేక్షించుచున్నారు. ఈక్షేత్ర నిర్వహణ సభ్యకుటుంబాల పాత్ర అత్యంత కీలకమైనది ప్రాముఖ్యమైనది కూడాను. శ్రీ పి. శ్రీనివాస్ రెడ్డి, విస్తరణాధి కారిగారిని ఈక్షేత్ర వ్యవసాయ నిర్వహణకుబాధ్యునిగా నియమించినారు. వీరు ఈక్షేత్రాని ఆయా జోనులుగా విభజించి సభ్యులను ఆరుగ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపునకు ఒకజోనును అప్పగించి పంటను పండించుటకు ఉద్దేశించారు. ఆయాగ్రూపు సభ్యులు ఆయా జోనులోని భూమిని పంటవేయుటకు సిద్ధముగాచేయుచున్నారు. దుక్కి దున్నారు. తొలకరి జల్లుతో పంటవేయుటకు సిద్ధంగా నున్నారు. వ్యవసాయ నిపుణులు ఆయాజోనులలో భూమిలక్షణాన్ని బట్టి, నీటి వనరును బట్టి యేపంటను వేయవలయునన్న నిర్ణయాన్ని తీసుకొని ఆయా విత్తనాలను కొని సిద్ధంగానున్నారు.

800 ఎకరాలను దాదాపు 50 నాగళ్ళు అదను పోకుండా దుక్కిదున్నుచున్నవి. పనినిర్వహణలో యేలోటురాకుండా వుండునట్లు పైజోనుల పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఇట్టి జోనులలో పండించబడిన పంటకు అందరు సభ్యులూ హక్కుదారులే. కాని అట్లు ఆర్జించిన ఆదాయంలో సంఘం ప్రభుత్వానికి చెల్లించవలసిన అప్పును ఒక భాగంగా మినహాయించి తక్కినదానిని 3:1 నిష్పత్తి ప్రకారం పంపకం జరపబడుతుంది. గత సంవత్సరం మొదటి సంవత్సరం కావున నెలకొక్కంటికి రూ 40 చొప్పున జీవనోపాధిభత్యము ప్రత్యేకంగా చెల్లించారు.ఈ కరీఫ్ పంట చేతికి రాగానే ఈ పద్ధతిని విరమించవచ్చు. సభ్యకుటుంబాలకు పంట చేతికి వస్తుంది కనక పంట విక్రయ చేయుట కొక గిడ్డంగిని నిర్మించే ఆలోచనగలదు.

పైన సూచించినట్లు 89 కుటుంబ సభ్యులను ఆరుగ్రూపులుగా విభజించారు. ఆయా గ్రూపులకు ఒక్కొక్కపెద్దను సభ్యులనుంచి నియమించారు. ఆగ్రూపు సభ్యులతో పనిచేయించుట ఆపెద్దబాధ్యత. ఆపెద్ద పనిచేయుచూ పనిచేయించుట గమనార్హాము. ఆగ్రూపునందు సభ్యులు ఆయా పనులను అనగా భూమికి గట్టులు వేయుట బావులు త్రవ్వుట ,భూమినిదున్నుట మొదలుగాగల పనులను కేటాయించడం జర్గుతుంది. యేనిర్ణయమైనా అందరినీ సంప్రదించి ఆయా అధికార నిపుణులను సంప్రదించి చేస్తారు. వారి సూచన పై ఆపని చేస్తారు.

తొలుత చెప్పబడినట్లు భూమిని సేద్యయోగ్యం గావించే విస్తృత ప్రణాళికను 1.5 లక్షలతో చేపట్టారు. బుల్‌డోజర్లు పని చేశాయి. ట్రాక్టర్లు 800 ఎకరాలను దున్నాయి. దుక్కి సిద్ధంగావుంది. భూసార రక్షణకు గట్లు వేయుపద్ధతి శాశ్వత కార్యక్రమంగా గలదు. కావున కార్యక్రమాన్ని సభ్యులు గతమాసాలనుండి ముమ్మరంచేశారు. దాదాపు 300 ఎకరాలకుగట్లు వేశారు. పనిని త్వరిత గతిని ముగించుటకు ప్రస్తుతం రెండు బుల్‌డోజర్లతో గట్లు వేయించడం జరుగుచున్నది. వర్షాకాలము రాకముందు సాధ్యమైనంత భూమికి గట్లు వేయాలని త్వరపడుతున్నారు. గట్లపై అల్పకాల పండ్ల చెట్లను పెంచినను పచ్చిరొట్టకై గడ్డినేపియర్‌ను నాటవచ్చు.

సస్యరక్షణ

అట్లే సస్యరక్షణ పంటను కాపాడుటకు అత్యవసరము. దీనికిగాను 2 పవర్ మిస్ట్‌బోయర్లను జిల్లాకలెక్టర్‌గారు 50% సబ్సిడీపై ఇప్పించినారు. దీనికి కావలసిన క్రిమినాశకమందులను సేకరించుటకు ఈ సంఘసభ్యులు సంసిద్ధముగానున్నారు.

ఆశాభావం

ఈసమిష్ఠిక్షేత్రం కేవలం హరిజన నిరు పేదసభ్యులతో స్థాపించబడినప్పటికీ ప్రభుత్వ అండదండలు కలిగి ప్రభుత్వ సిబ్బంది సలహా సంప్రదింపులతో సరియైన పద్ధతిపై నడిపించ గలరని ఆశాభావం. సంఘం సభ్యులదే నైనా, దాని ఫలసాయం సభ్యులకేనైనా దానినిర్వహణలో సభ్యులకు స్వయం సంసిద్ధత చేకూరేవరకు ప్రభుత్వ సిబ్బంది దానినిర్వహణ బాధ్యతను వహించుట ఆవశ్యకము. ఇట్టి ఆదర్శ సంఘీభావం, సమైక్యత ఈ సమిష్టి క్షేత్రాన్ని విజయవంతం గావించి దేశమంతటిలో ఆదర్శవంతం కాగలదని ఆశిద్దాం. ప్రభుత్వ సిబ్బంది, రైతులు కలసి సమిష్టికృషి సల్పిననాడు ఇట్టివిశిష్ట ప్రగతిని సాధించవచ్చుననుటకు జిల్లిసమిష్టిక్షేత్ర నిర్వహణ నిదర్శనమనవచ్చు.

సాంసారిక హాస్యకథానిధి

మునిమాణిక్యం

ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో ఏదో సభ జరిగింది. సభ ముగిసిన తరవాత మునిమాణిక్యం వారూ, నేనూ కలిసి బయటికి వచ్చాము.

"నా పేరూ, అడ్రసూ వగైరా ఒక కాగితంమీద రాసి జేబులో ఉంచుతున్నాను." అన్నారు.

ఎందుకు? అని అడిగాను.

ఎందుకేమిటండీ? నాకు దాదాపు అరవై అయిదేళ్లు. ఎక్కడో ఏమో? రైలులోనో, బస్‌లోనో పోతే అడ్రస్ తెలియొద్దూ?" అన్నారు.

"ఛ,ఛ, అదేం మాటండి? మాలాంటివాళ్లను ఆశీర్వదిస్తూ మీరు పదేళ్ల పాటు ఉండాలి." అన్నాను.

"ఏమిటో, ఉండి ఇంకేంచెయ్యాలి?" అని ఒక క్షణమాగి, "నేను గొప్పగొప్పవాళ్ల జననం తేదీలు మరణం తేదీలు పోల్చి చూశాను. సాధారణంగా, అవి రెండు దగ్గర దగ్గర ఉంటున్నాయి. నేనూ అంతో ఇంతో గొప్పవాళ్లలోకి చేరుతాననుకోవచ్చుగా!" అంటూ కొంటెగా నవ్వారు—పళ్ల సందునుంచి నాలిక కొసకొంచెం బయటికి పెట్టి, కళ్లల్లో నవ్వులు కనబరుస్తూ. అందుకే, మార్చి పదిహేమకు ఒక నెలా పదిహేను రోజులు ఇటూ, ఒకనెలా పదిహేను రోజులు అటూకాస్త జాగ్రత్తగా ఉండటం ఎందుకైనా మంచిదని—అన్నారు.

ఫిబ్రవరి 4న మునిమాణిక్యంవారు కీర్తిశేషులైనారన్న వార్త వినగానే తాత్కాలికంగా మరిచిపోయిన ఈ వృత్తాంతం జ్ఞాపకానికి వచ్చింది. గడచిన నాలుగైదు సంవత్సరాలలోను వారి జన్మదినంనాడు ఉదయం వారిని కలవడం కొంతసేపు సరదాగా కాలక్షేపం చెయ్యడం రివాజు అయింది. సాధారణంగా జనవరిలో ఏ సాహిత్య అకాడమీ సమావేశంలోనో మునిమాణిక్యం వారు కనబడటం—"జ్ఞాపకముందిగా" అనడం, అయ్యో! మరిచిపోతానా అని నేను అనడం ఆయన తెల్లటి మీసాలకింద నవ్వులు కురిపిస్తూ హెచ్చరికలు చేయడం, కూడా నాలుగైదేళ్లుగా జరుగుతున్న కథ.

ఇంకా బతికుండి ఏమిచెయ్యాలన్న ప్రశ్నకు జవాబు ఆయనే వెతుక్కొన్నారు. ఏమీ చెయ్యకుండా కూచోవడం మునిమాణిక్యం వారికి చేతగానిపని. తమ పాతకథలు కొన్ని రేడియోనాటికలుగా మార్చారు. "గాడిదలతిరుగుబాటు"లాంటి వ్యంగ్యరచనలు చేశారు. తెలుగుహాస్యంమీద ఉద్గ్రంథాన్ని పూర్తిచేశారు. అసలు ఈ ఉద్గ్రంథమే వయస్సులో మూడున్నరదశాబ్దాల వ్యత్యాసం ఉన్న మా యిద్దరినీ సన్నిహితులను చేసింది!

అంతకుముందు వారు రేడియోలో పాతకాలం కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పుడు ప్రసంగకర్తగా నాటికారచయితగా వారిని కొన్నిసార్లు కలుసుకున్నాను. ఆ తరవాత ఒకరాత్రి విజయవా మంచి హైదరాబాదుకు బస్‌లో కలిసి ప్రయాణంచేస్తుండగా పానుగంటివారి హాస్యాన్ని నేనేవిధంగా విశ్లేషించానో తెలుసుకోవాలని ఉంది అన్నారు. మాటల్లో తెలుగులోఉన్న హాస్యం గురించి సాధికారగ్రంథం ఒకటి ప్రచురించాలని ఉన్నదనిచెప్పారు. అంతకుముందెప్పుడో ఒకపత్రికలో (మద్రాస్‌నుంచి వెలువడిన కిన్నెరలో నేమో?) తాము ప్రకటించిన వ్యాసాలనుపెంచి చిన్న పుస్తకంచేసే సంకల్పం ఉన్నట్లు చెప్పారు.

చిన్నచిన్న ఎక్సర్‌సైజ్ నోట్‌పుస్తకాలలో వ్రాసి ఉండిన 'హాస్యం' అధ్యాయాలను తెచ్చి మాయింట్లో కూర్చోని వినిపించారు. ఆ తరవాత అహర్నిశలూ పరిశ్రమించి దానిని ఉద్గ్రంథగా తీర్చిదిద్దారు.

"ఫలానిరకం హాస్యానికి మంచి ఉదాహరణ దొరకలేదండీ" అన్నారు ఒకనాడు. నేను కందుకూరి వీరేశలింగంగారి పుస్తకాలలోనుంచి, పానుగంటివారి రచనలలో నుంచి ఉదహరణలు

ముదిగొండ వీరభద్రశాస్త్రి

తెచ్చి వినిపించాను. "ఒకకాగితం మీద రాసియివ్వండి" అంటూ టెలిఫోన్‌దగ్గరకు పరుగెత్తి ప్రెస్‌కు ఫోన్‌చేశారు. "ఫారం ప్రింటైందా?" అని ఆదుర్దాగా అడిగారు. "ఇప్పుడే మిషనుమీదికి ఎక్కిస్తున్నాం" అన్నారు వాళ్లు. "ఆగండి, నేను వస్తున్నాను". కొంచెంమార్పులు చెయ్యాలి."అన్నారు. "మన హాస్యం" పుస్తకాన్ని తృప్తిగా తీర్చిదిద్దటానికి ఆయన ఎంత శ్రద్ధవహించారో చెప్పడానికే ఈ సంఘటన వివరిస్తున్నాను.

పుస్తకం అచ్చు అయింది. నన్ను పరిచయ వాక్యాలు రాయమన్నాను. రఫ్‌చిత్తు దశనుంచి పరిశుద్ధప్రతి దాకా అన్ని దశలలోను ఆ పుస్తకాన్ని—అభివృద్ధి మజిలీలను చూసిన నేను రాయడమే తగునని ప్రోత్సహించారు.

కొన్ని నెలలు అయిన తరువాత, మామూలుగా మాట్లాడుతూనే అమాంతం బాధగావే. నేను ఎంతో కష్టపడి మంచి పుస్తకం రాశాను గదా! హాస్యంగురించి, హాస్యస్వభావంగురించి, హాస్యంలో రకాలను గురించి ఎంత కష్టపడి, ఎంత బాధగారాశాను. నా అభిప్రాయాలతో ఒప్పుకొమ్మని నేనేం అనడంలేదు. అసలు పుస్తకం ఎవరూ చదవడం లేదండీ! మరి నేను ఎందుకోసం కష్టపడ్డట్లు?

"చదవలేదని మీకెట్లాతెలుసు"? అని అడిగాను.

"ఎట్లాతెలుసేమిటి? తెలుసు"అని ఆరకాటంగా నవ్వారు.

"కీర్తికోసమే రచయితలు పుస్తకాలు రాయరండి-కీర్తి వద్దని కాదు. కాని తాను చేసినపని నలుగురికి ఉపయోగపడుతుంది. ఆహ్లాదం కలుగుతుందని రచయిత ఆశిస్తాడు. అది జరగకపోతే నిరుత్సాహం కాదా మరి?"

ఈ నాటి యువపాఠకులకు తమనుగురించిగాని తమతరం రచయితలను గురించిగాని ఏమీ తెలియదేమో అని మునిమాణిక్యం వారి అనుమానం. అతిథులకోసమని, వాళ్ళకు నచ్చుతాయని విందు పదార్థాలు చేసిన యిల్లాలు వచ్చిన అతిథులు మనస్ఫూర్తిగా తినటం లేదేమో-అని పడే ఆరాటం లాంటిది వారి ఆరాటం.

పసిపిల్ల వాడి మనస్సు

మునిమాణిక్యం వారి మనస్సు పసిపిల్లవాడి మనస్సు. కోపం, తాపం, బాధ, సంతోషం ఏది కలిగినా అది వెంటనే కక్కేయవలసిందే. అటువంటి మనస్సు కాబట్టే ఆయన హాస్యం ప్రసన్నంగా వుంటుంది. "మనహాస్యం" పుస్తకంలో కూడా ఉత్తమమైన హాస్యం ప్రసన్నంగా ఉండే హాస్యమేనని ఆయన తీర్మానించారు. తొలిసారిగా, హాస్యరసంలో ఎన్నో అవాంతర భేదాలను పేర్కొనడమే కాకుండా, హాస్యానికి, కవితాచమత్కృతికి, సూక్ష్మవిచారంతో వారు చేసిన విభేదనం చాలా గొప్పవిషయం.

కాంతం మొగుడు

మునిమాణిక్యం వారి రచనలన్నీ దాదాపుగా ఆత్మకథ ప్రాయాలు. కొన్నిచోట్ల సంఘటనలు - అన్నిచోట్ల ఆయన సృష్టించిన ప్రధానపాత్రలు మనస్తత్వం ఆయనకు వ్యక్తిగతంగా సంబంధించినవే. 'కాంతం' ఆయన పాత్రలలో చాలాగొప్ప పాత్ర అని అందరూ పేర్కొంటారు కాని "కాంతంమొగుడు" మాత్రం తక్కువవాడా? కాంతం ఎవరయినాకాని, కాంతం పాత్ర సృష్టి ఏ విధంగానైనా జరగనీకాని, కాంత మొగుడు వెంకట్రావుమాత్రం ముమ్మూర్తులా మునిమాణిక్యంవారే. చిన్నచిన్న కోరికలు, చిరాకులు పరాకులు, అల్పసంతోషం, మొదలయిన లక్షణాలన్నీ వారివే.

మునిమాణిక్యం బహుకాలం ఉపాధ్యాయ పదవిని నిర్వహించి ఉండటం వారి మూర్తిమత్వాన్ని చాలావరకు ప్రభావితంచేసింది. ఉన్నంతలోనే ఒద్దికగా జీవితాన్ని గడుపుకోవటం, ఎంతచిన్న గౌరవసన్మానం జరిగినా కొండంత తృప్తిపొందటం, ఉద్రేకాలజోలికి వివాదాలజోలికి పోకుండా శాంతంగా బతకడం ఇవన్నీ ఆ ప్రభావం వల్ల వచ్చిన లక్షణాలే అనుకుంటాను. అల్పమైన అసంతృప్తులతో రాజీపడి, జీవితంలో పెద్దఎత్తున సంతృప్తిపొందడం కూడా ఉపాధ్యాయవృత్తే నేర్పింది. ఇబ్బందులను, ఆరకాటాలను పరిష్కరించుకోవడానికి వారు "నవ్వు"ను చక్కని సాధనంగా గ్రహించారు. ఆ ఉత్తమసాధనం విశిష్టతను చాటిచెప్పారు.

దీక్షితులు

కాంతం, కాంతం మొగుడుకాక ఆయన సృష్టించిన మరో గొప్పపాత్ర "దీక్షితులు". తన దుఃఖం తనకు ఉండగా, చుట్టూఉన్న వాళ్ళ దుఃఖప్రవాహాలన్నిటిని తన దుఃఖసముద్రంలోకి స్వీకరించి ఆర్ద్రమైనహృదయంతో తనచుట్టూఉన్న వాతావరణంలో ప్రేమానురాగాలను సృష్టించిన ఉదాత్తమూర్తి "దీక్షితులు". దీక్షితులుసాక్షాత్తూ దేవుడేనని అనుకున్నవాళ్లు ఉన్నారు. కాని రచయితగా మునిమాణిక్యం దీక్షితుల్ని దేవుడిగా చేసెయ్యకుండా, "నాకు ఇంకా హృదయదౌర్బల్యం పోలేదు: ఇందరుకుమార్తెలున్నా, ఆ చనిపోయిన ఒక్కదానికోసం దుఃఖం వస్తుందేమోయ్" అనిపించి మానవత్వం మూర్తీభవించిన మనిషిగా ప్రతిష్ఠించారు. అదే విధంగా 'సీతయ్య' పాత్ర కూడ మానవత సంబధాలు కలుషితమై పోతున్న నవ్య ప్రపంచములో ఒక వెలుగు కిరణం.

పక్కా శాస్త్రి గ్రంథాలు మాత్రమే కాకుండా శాస్త్రిగ్రంథాల ఫక్కిలో నడిపిన వితండ వాదాలు, ప్రణయకలహాః మొదలైన పుస్తకాలు కూడ వారి రచనాప్రాగల్భ్యానికి ఉదాహరణలే. ఆపుస్తకాలన్నీ అటువారి లోకానుభవాన్ని, లోకజ్ఞతను ఇటువారి హాస్యరచనా చాతుర్యాన్నికూడా వెల్లడిస్తాయి,

మునిమాణిక్యం వారు వెలలేని ఎన్నో పుస్తకాలను తెలుగు వారికి ఇచ్చివెళ్లారు. వారు ఉండగానే అందులో చెదురుమదురుగా కొన్నిఇతర భాషలలోనికి పరివర్తనం పొందినాయి. వారు ఉండగానే వారి పుస్తకాలపయిన ఒక సమీక్ష గ్రంథం వ్రాయగలనని ఆశించాను. కాని నా కోరిక సఫలం కాలేదు.

మునిమాణిక్య ధీధితులను ప్రదర్శించగల అవకాశం త్వరలోని కలుగుతుందని ప్రస్తుతం ఆశ. వారి మిత్రులు శిష్యులు అభిమానులు దేశమంతటా ఎందరో ఉన్నారు. వారందరూ సహకరిస్తే, మునిమాణిక్యంవారి జీవితచరిత్రను ప్రకటించడం కూడా సాధ్యం కావచ్చు.

"ఇద్దరు చాలు"

తిరుమల శ్రీనివాసాచార్యులు

పసిపాప నవ్వుల పారిజాత సుమాల
        పరిమళమ్ములఁ దేలి పరవశించి
అందాల పాపని డెందమ్ముపయిఁ జేర్చి
        వింత కేరింతల సంతసించి
చిటిపాప చిన్నారి చిగురు చేతులపట్టు
        కొని తప్పటడుగులఁ దనివి చెంది
వెన్నెల చలువల వెన్నముద్దల తియ్య
        చెక్కిలి ముద్దాడి చిటుక వేసి

        మరువ లేనట్టి మాటల మురిసి మురిసి
        మరిచి పోయిన చాల ప్రమాదకరము
        వీర పౌరాగ్రణులుగ తయారు చేయ
        కట్టుకొందును ధర్మకంకణము నేడు.

'గాంధి'గా ఒక 'దేశ బంధు'గా తీర్చెద
ఒక బిడ్డఁడైతేమి సకల మతఁడె.
'పొంగు'లా ఒక' భగత్ సింగు'లా మార్చెద
ఒక కొడుకయితేమి సుకృత మదియ
'కీర్తి'గా ఒక 'శాంతమూర్తి'గా పెంచెద
        ఒక బిడ్డడైతేమి ప్రకటకీర్తి
'నీతి' గా 'నడచెడు జ్యోతి'గా వెల్గింతు
        ఒక పాపఁడైతేమి ఒక ప్రతిష్ఠ

        జాతి రత్నమ్ము భారతమాత కంఠ
        సీమలో వేయగా కోర్కె చిగురులొత్తె
        బ్రతుకు కర్పూరముగఁ జేసి సుతునొక్క
        ఘనునిగాఁ జేయ ధరియింతు కంకణమ్ము

నా కిద్దఱే చాలు లోకానవెలుగగా
        'జ్వాల' యట్టుల 'పూలమాల' యటుల
నాకిద్దరే చాలు నాకలి పెకలింప
        వర్షమ్ముటునమృతవర్షమటుల
నా కిద్దఱేచాలు నయనాలు వెలిగింప
        సత్యమట్టుల ఆణిముత్యమటుల
నాకిద్దరే చాలు నాపేరు నిలుప, మా
        నవతలా రసమయ కవితయటుల

        ఇద్దఱే చాలు బంగరుముద్దలటుల
        మనువు రీతిగా నొక ఇంద్రధనువురీతి
        పేరుఁదేనట్టి పుత్రులు పెక్కురైన
        లాభమేమిటి? హృదయ సంక్షోభ తప్ప.

వస్తులకు తక్కువేలేదు, ఆస్తిపాస్తు
లన్నేమిటో తెలియని అర్థహీన
జీవనము నీడ్చుచున్నాను, కావలెనని
ముగ్గురిని గన్న వచ్చునె ముక్తికొంత.

        బ్రహ్మదేవుఁడు కొంత మావాఁడు గాన
        కలము కాగితాల్ గొనుకల్మి కరుణతోఁ
        గొంత యిప్పించి నాఁడులే, కొంత నయము
        యోగినప్పుడు, చిన్న యుద్యోగినిపుడు.

ముప్పది దాటకమునుపే
తిప్పలు, సరి, తెలిసె బ్రతుకు తీపియు తీఱున్
ముప్పలు తెప్పలు, సంతతి
యిప్పటికో బ్రహ్మదేవ ! ఇద్దరు చాలున్.

జ్వాల లెన్నైన వెల్గింప వచ్చుగాని
గాలిలో నారిపోకుండ గనుట శ్రమము
కన్నవారలు తమదీపకళిక వెలుగు
గనక యున్నచో, గుండియ గండివడదె!

        'తైలమును జూచి వెల్గించు జ్వాలికలను'
        అనెడు మాటలు నిప్పుడు పనికిరావు
        అందఱకు వెల్గుఁజూపు బ్రహ్మాండ మైన
        జ్వాల యొకటైన నేమిలే, చాలమేలు

అర్జునుఁడు గాని అభిమన్యుఁడయిన గాని
దాశరథి గాని ఒక ధర్మ తనయుఁడయిన
గాని లోకాని కొకకొంత ఘనత-నవత-
కౌరవులు నూర్గురైతేమి గౌరవమ్ము!
        కరుణ డెందాన నిండిన గౌతమాత్మ
        ఈసు గాడ్పయిన తాకని ఏసుగుండె
        ఒక్కటయినను విశ్వాన్ని చక్కదిద్ద
        జాలదా! వారిఁగన్నట్టి జన్మ జన్మ.

గుల్లెడుంటేమి లాభమ్ము? గునుగుపూలు
నలిపిననుగాని వాసనల్వొలుకబోవు
చిన్నదయితేమిలే ఒక్క సన్నజాజి
కోటిగుండెలు మురిపించు ఘుమఘుమలను.

        దేశమునకొక్క నూత్న సందేశమొసగు
        కవిత యొక్కటియే యశఃకాయుజేయు
        అంతరంగాలు వెల్గించునట్టిజీవిఁ
        గన్నవాఁడులే నిజమైన కన్నతండ్రి.

ఇల్లాలు శరీరము, జా
బిల్లియునున్ మల్లెవంటి పిల్లల బ్రతుకుల్
కల్లోలము లేకుండగ
చల్లగఁబోషింతు సర్వసంపదలవెగా.

తెలుగు సాహిత్యం మీద 'బంగ్లాదేశ్' ప్రభావం

ముదిగొండ శివప్రసాద్

సాహిత్యం సమాజ జీవితానికి చైతన్యానికి ప్రతీకగానూ దర్పణంగానూ మనం భావించినట్లయితే సామాజిక సంఘటనలూ, పరిణామాలూ సాహిత్యంలో ప్రతిబింబించి తీరుతాయని సిద్ధాంతీకరించి తీరాలి. ఈ సిద్ధాంతానికి ఉపబలకంగా లోగడ వేయేండ్ల తెలుగు సాహిత్యం నిలిచింది. గత రెండేండ్ల "బంగ్లాదేశ్" సాహిత్యమూ వెలిసింది.

'బంగ్లాదేశ్' సంఘటనం మానవాళి చరిత్రలోనే ఒక మరచి పోలేని పీడకల. మానవత్వాని కొంక కలికితురాయి. హిట్లర్‌ను మరపించిన యాహ్యా పైశాచిక కృత్యాలు ఒకవైపు, మహిషాసుర మర్దనిలా విజృంభించి బంగ్లా విమోచనాన్ని సాధించిన ఇందిరాగాంధీ మానవత్వం మరొకవైపు—ఈ సంఘటనకు ఎంతో విలువను తెచ్చి పెట్టాయి. ప్రపంచం దినదినానికి చిన్నదై పోతున్న ఈకాలంలో వియత్నాం యుద్ధానికి విజయవాడలో కవిహృదయం స్పందిస్తున్న రోజులలో మన పక్కనే వెలసిన విరిసిన స్వేచ్ఛారవిందం "బంగ్లాదేశ్"ను భారతీయులు ప్రశంసించడంలో ఆశ్చర్యంలేదు. 'తెలుగు కవి' పరవశించడంలో, కలవరించడంలో విచిత్రమూ లేదు.

బంగ్లా సమస్యలో కొన్ని ప్రధాన ఘట్టాలున్నాయి. మొదటిది షేక్‌ముజిబుర్ రహమాన్ గాంధేయ సిద్ధాంతానికనుగుణంగా సత్యాగ్రహ సమరం జరపడం, ఎన్నికలలో ఘన విజయం పొందడం, ఫలితంగా యాహ్యా సైనికులు తమ వలస రాజ్యమైన "తూర్పు పాకిస్తాన్" లో మారణకాండ (జీనసైడ్)ను జరపడం, అగ్రరాజ్యాలూ, ఐ. రా. స. కూడా ధర్మపన్నాలు పలుకుతూ దూరంనుంచి చూస్తూ వుండటం, రెండవఘట్టం—కోటి మంది కాందిశీకులు భారతదేశానికి రావడం. మానవత్వాన్ని మహిమీద సంరక్షించేందుకు గాను మానిక్ షా ఆధ్వర్యాన భారతదేశం యొక్క బంగ్లా విమోచన సేనలు ముక్తి వాహినికి తోడ్పడటం, ఫలితంగా ఢాకాతో సహా తూర్పుపాకిస్తాన్ విముక్తిపొంది 'బంగ్లాదేశ్' గా అవతరించడం. మూడవ ఘట్టం—మొదటి సత్యాగ్రహ ఘట్టంలో ధర్మవీరమూ, రెండవ మారణకాండలో కరుణరసమూ, మూడవ యుద్ధ ఘట్టంలో ఉత్సాహమూ క్రోధమూ స్థాయీ భావాలుగా కలవాదమూ రౌద్రమూ వున్నాయి. కాబట్టే ఉద్యమాలకు వచ్చి ఉద్యమంతో పోయే శ్రావణమాసపు జల్లుల్లాంటి వెలుగునీడల కవిత్వం కాక కలకాలం నిలబడే కథాకావ్యాలు సైతం వస్తున్నాయి-వస్తాయి కూడా! ఈ'వస్తుగౌరవం' అలాంటిది మరి-

'బంగ్లాదేశ్' పోరాటాన్ని వివరించే సిద్ధాంత గ్రంథాలు కొన్ని వచ్చాయి. అయితే వీటిలో కవితాధర్మం శూన్యం. చారిత్రక పరిశీలనమే ముఖ్యం. ఆ తర్వాత వివిధ దిన వారమాసపత్రికలలోనూ, ఆకాశవాణిలోనూ, ప్రభుత్వ సమాచార శాఖద్వారానూ అసంఖ్యాకమైన ఖండికలూ, ఖండకావ్యాలూ సంకలనాలూ వచ్చాయి. ఇవికాక 'ఈ దేశం నాదికాదా—రక్తేర్ బంగ్లా' (శ్రీ వేమూరి హరినారాయణ శర్మ) వంటి ప్రదర్శన యోగ్యమైన ప్రచార నాటికలు, నాటకాలూ ఎన్నో వచ్చాయి—ఇతి వృత్తంలోని విశిష్టతను బట్టి 'జై భారత్—జై బంగ్లా' వంటి అపరాధ పరిశోధక నవలలు వెలువడ్డాయి. శ్రీ నారాయణరావు వ్రాసిన ఈ నవలలో త్రిలోక్ కుమార్ అనే పత్తేదారు రహస్య ఛేదనం చేస్తాడు. ఇలాంటిదే 'జై బంగ్లా' అనే మరో నవల. ఇలాంటివి తెలుగులోనేకాక సమకాలిన వాతావరణాన్ని బట్టి తక్కిన ప్రాంతీయ భాషలలో కూడా వెలువడ్డాయి. అయితే సంస్కృతంలో 'ఇందిరా విజయం' అనే గ్రంథాన్ని అంబటిపూడి వెంకటరత్నం గారు వెలువరించారు. ఇది విజయోత్సవాల సందర్భంలో (మూడవ ఘట్టంలో) వెలువడిన గ్రంథం. బహుశా సంస్కృతంలో మొట్ట మొదటి సారిగా ఈ సమస్యపై పుస్తకం వ్రాసినవారు తెలుగు వారేనేమో!!

బంగ్లాదేశ్ అవతరణం జరిగింది. డిసెంబరు 16 విమోచన దినం. ఆనాడు శ్రీ కుందుర్తి తమ పుట్టిన రోజును విమో

చన దినోత్సవంతో జోడించి జరుపుకున్నట్లు చాటిన గీతం ఆకాశవాణిలో ప్రసారమైనది. ఇందిరాగాంధి దుర్గా శక్తిగా మారి యాహ్యాపై మహిషాసుర మర్దనిలా విజృంభించినదన్న ధ్వతో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రచించి ఆకాశవాణిలో ప్రసారం చేసిన ఖండిక కూడా ఈ సందర్భంలో పేర్కొనదగిందే! ఈ నాటి కవి సమ్మేళనాలన్నింటిలోనూ ఇదే ఇతివృత్తమైంది. శ్రీ వీరభద్ర మూర్తిగారు మకర సంక్రాంతి పర్వదినాన జరిగిన ఒక కవి సమ్మేళనంలో చదివిన "విజయ సంక్రాంతి" అన్న ఖండిక కవితాతత్వ దృష్ట్యా చాలా ఉత్తమ శ్రేణికి చెందింది. అలాగే సోమసుందర్, దాశరథి, నారాయణరెడ్డి, పైడిపాటి సుబ్బరామశాస్త్రి గార్ల వంటి ప్రముఖ కవులెందరో రసవత్తరమైన కవితలు రచించి ప్రచురించారు ఆలా వచ్చిన సంకలనాలలో సి నారాయణరెడ్డిగారి 'ముఖాముఖి' మాదిరాజు రంగారావుగారి 'వయొలిన్ పై రాగంతో' వంటవెన్నో వున్నాయి.

కేవలం 'బంగ్లాదేశ్' నే కేంద్ర బిందువుగా తీసుకొనివచ్చిన సంకలనాలు కొన్ని వున్నాయి. వాటిలో మద్రాసునుండి వచ్చిన 'పుష్పాంజలి' ప్రథమకృతి. తర్వాత ఏలూరునుండి 'సోనార్ బంగ్లా' వరంగల్ 'బంగ్లాదేశ్' 'సమర్ పథేబంగ్లా' అనే కృతులూ వెలువడ్డాయి. ఇందులో 'సమర్ పథేబంగ్లా' తెలుగు విద్యార్థుల తరపున ఢిల్లీలో ఒక సమ్మేళనంలో బంగ్లావిద్యార్థి నాయకులకు కానుకగా సమర్పించబడింది.

కవితా తత్వం

ఈ సంకలనాలలో కొన్నికొన్ని సిద్ధాంత ప్రతిపాదనలుకూడా వున్నాయి. కొందరు దీనిని ఆర్థిక సంఘర్షణగా చిత్రించారు. మరికొందరు బంగ్లాదేశ్‌ను గుర్తించని చైనానే సమర్థించారు. ఇంకొందరు భారత దేశం 1947 లో చేయబడ్డ స్వాభావిక విభజన ఫలితమే ఇది- అన్నట్లు చిత్రించారు. మరికొందరు రష్యా రాజనీతికి నీరాజనా లర్పించారు. ఈ రాజకీయ సిద్ధాంత పరివేషాలను వదిలివేసి కేవలం 'కవితా' తత్వాన్ని మాత్రమే ఈ వ్యాసంలో వివరిస్తాను.

"మరల రావణుడుదయించె ధరణిపైన
లంకలో కాదు పడమటివంకననిరి
నిక్కమాయని తలయూచి దృక్కుసాచి
కాంచినాడను పశ్చిమాంగణమువైపు
ఒక్క పదిగాదు కాదుకాదొక్క నూరు
లక్ష తలలున్న భీకర రాక్షసుండు
కోటి చేతులతో తుపాకులు ధరించి
'రావి' నదియొడ్డునన్ దోచె రావణుండు"

అభినవ రావణుడు యాహ్యా దారుణ మారణ ఇతివృత్తాన్ని వృత్తాలలో నిబంధించారు దాశరథి. పశ్చిమాంగణము 'పశ్చిమ పాకిస్తాన్'; తూర్పు-సూర్యునికి స్వేచ్ఛకూ, చైతన్యానికీ సంకేతాలు. అందుకే చీకటులనెల్ల తాను రక్షించునంట-తూర్పు మీద దండెత్తగాదొడుగు నంట' ఆ నాటి "తూర్పు పాకిస్తాన్" మీదికి యాహ్యా పంపిన సైనికుల దురాక్రమణాన్ని ఈ కవితలో హృదయంగమంగా చెప్పారు దాశరథి. 'నరరక్త పిపాసులు నాదిర్షావారసులు నాజీ తత్వం నరనారాలల్లో నాటుకున్న నాటు రక్కసులు' బంగ్లాదేశ్‌పై విషాగ్ని వర్షిస్తుంటే తమకేమి పట్టనట్లు 'ఐరాస దిక్కులు చూస్తున్నా అగ్రరాజ్యాలు గోళ్ళు గిల్లు కొంటున్నా ప్రజోద్యమాలకు బాసట వుంటామని ప్రగల్భాలు పలికే దగాకోరులు పైశాచిక శక్తులతో చేతులు కలుపుతున్నా కరాలే ఖడ్గాలుగా పోరాడుతున్న నిరాయుధులు బంగ్లావీరులకు బాష్పాంజలిని సమర్పిస్తున్నారు సి. నారాయణ రెడ్డిగారు 'జయ బంగ్లా దేశ్' అన్న ఖండికలో'.' ఓసీ ఆత్మ విశ్వాసమా! ఎందుకు విచ్చుతావు రెక్కల్ని.కద్రువ యింట, కర్కోటకుల కంట, ఇంద్రుని వజ్రాయుధం వ్రేటు కూడా నీమీదే జాగ్రత్త-' అంటూ భారతీయ పౌరాణికగాథా సామ్యాలను తీసుకొని బంగ్లా గాథను వర్ణించారు కవి సుప్రసన్న తమ 'మూడు స్వేచ్ఛాగీతాలు' 'అన్ని ఖండికలో, 'పరుశురాముడిలా బంగబంధు ముజీబ్‌లా' అన్న సుప్రసన్న వాక్యమూ, దితిపుత్రుల గుండెలదర తిరుగుబాటు మాట చాలు, తిరుగబడినవాని బరువు మోయలేనిఉరి కంబము, ఫెళఫెళ మని చిట్లి పుట్టు ప్రతినరుడొక నరసింహుడు' అన్న కాళోజీ వాక్యాలూ ఇందుకు కొన్ని ఉదాహరణాలు. 'అర్ధరాత్రి పగిలిన అగ్నిపర్వతం, కన్ను మిన్ను తెలియని కుంభకర్ణునిలాగా కనిపించినవాళ్ళను కబళించి కబళించి బ్రేవుమని త్రేన్చేలోపల వసంతోత్సవం జరుపుకున్న మామిడి తోటలోని కపోతాలు ప్రమాణ స్వీకారంచేసి దిగంతాల కెగిరిపోయాయి' ఈ పావురాలు బంగ్లా ప్రజలకూ ముక్తి వాహినికీ సంకేతాలు. ఇది 'అరవిచ్చిన స్వాతంత్ర్యం' అన్న పరాశరం గోపాలకృష్ణ మూర్తిగారి ఖండిక.

"అరణ్యవాసంగడువు ముగిసిన పాండవ సైన్యంలా
అంతకంతకూ ముక్తివాహిని విజృంభిస్తుంది
శాపఫలం తీరిన శకుంతలలా,
బంగ్లా గుర్తించ బడుతుంది" అంటారు పిరాట్ల వెంకటేశ్వర్లుగారు 'చరిత్ర పునరావృత్త మవకతప్పదు' అన్న ఖండికలో—ఇవన్నీ బంగ్లా పై యాహ్యా కిరాతకాలు జరుగుతున్న రెండవ ఘట్టములో వచ్చిన ఖండికలు. కవుల కలాల నుండి వదిలిన రణ చండికలు!!

సంగ్రామ సమయంలో తెలుగులోనే గాక వివిధ భారతీయ భాషలలో కూడా ఎన్నో కవితలు వెలువడ్డాయి. వాటి అనువాదాలు కూడా అప్పటికప్పటికే జరిగి తెలుగులో ప్రచురింపబడ్డాయి. వాటిని కూడా ఇక్కడే ప్రసక్తం చేయడం సముచితంగా వుంటుంది.

ఆంగ్లంలో, బెంగాలీలో, శ్రీ అబూహెనా ముస్తఫా కమల్, హుమాయూన్ అజాద్ ప్రభృతులు రచించిన కవితలు అంతర్జాతీయంగా ప్రశంసలనందుకున్నాయి. అలాంటివాటిని కొన్నిటిని తెలుగు కవులు అనువదించి పాఠకులకు అందించారు. ఉదాహరణకు శ్రీ లక్ష్మణ మూర్తి అనువదించిన 'బ్లడ్ బ్యాంక్' అన్ని ఈ ఖండిక చూడండి:

"బంగ్లా ధరిత్రిపై అనుదినమూ
రక్తం ప్రవహిస్తున్నది
బంగ్లా ధరిత్రి రక్తనిధిలో
భవిష్యత్తు కోసం పెట్టుబడిగా
ప్రతి బాట సారీ
కొన్ని నెత్తురు చుక్కల్ని
పదిల పరుస్తున్నాడు
ప్రతి శ్రామికుడూ
సూర్య కిరణాలు సోకి
వెచ్చనైన తన నెత్తురు
దారి పొడుగునా విత్తనాలుగా నాటుతున్నాడు"

ఎంత అద్భుతమైన కల్పన ఇది! ముఖ్యంగా వెచ్చనైన తన నెత్తురును విత్తనాలుగా చల్లుతున్నాడనటంలో వుంది. కవిత్వమంతా! "నిశ్చయంగా ఈ రక్తం నుండే మరో పద్మానది ప్రభవిస్తుంది" అంటారు అజాద్ మరో పాదంలో—"బంగ్లానేలకంటె మరో మంచి బ్లడ్ బ్యాంక్ లేదు. ఒక్క నెత్తురు చుక్క క్షణంలో పది రెట్లై ఎదుగుతుంది" స్వాతంత్ర్యం కోసం చిందిన ప్రతి రక్త బిందువు ఒక సింధువుగా మారుతుంది—వేలాది స్వాతంత్ర్య వాదులను సృజించుతుంది అన్న భావనను గాఢంగా గుండెలలో నాటేటట్లు చెప్పారు కవి ఇందులో—

శ్రీ అబూహెనా ముస్తఫా కమాల్ గీతం "ఇయంపృథ్వీ సత్యమస్తు" లో తన మధురాతి మధురమైన మాతృ దేశాన్ని పలకరించి పులకరిస్తాడు—

'ఈ ప్రశాంతినీ
నిర్మల నీల సరస్సునీ
చల్లని పల్లె పట్టునీ
పసిపాపల నవ్వునీ
పావురం గుసగుసనీ
బంగారు పుర్వు పాటనీ
నీవూ నేనూ పంచు కుంటున్నాము'

అని బంగ్లా ధరిత్రితో ముఖా ముఖీ మాట్లాడుతాడు కవి.

బంగ్లా ఇతివృత్తంగా వచ్చిన సమగ్ర కావ్యాలలో 'ముక్త ధాత్రి' ప్రశస్తమైన కృతి. డాక్టర్ మాదిరాజు రంగా రావు రచించిన ఈ గ్రంథం లఘు కావ్యం. ఇందులో అనల తోరణం, జ్వాలా తరంగాలు, విలయ చక్రం, విజయ వర్షం అన్న నాలుగు శీర్షికలున్నాయి. ఇందులో గ్రీష్మం పాక్ నిరంకుశత్వానికీ, వర్షం బంగ్లా స్వేచ్ఛా సంగీతానికీ ప్రతీకలుగా స్వీకరించ బడ్డాయి. వంగ నేత ముజీబ్‌ను పాక్ నియంత యాహ్యా బంధించడంతో కృతి ప్రారంభమై, విజయేందిర సాక్షాత్కారముతో కథ ముగుస్తుంది

'స్వేచ్ఛా వాయువులను గదిలో బంధించ గోరే
స్వాతంత్ర్యకాంక్షలను చీకటిలో దాచ గోరే
ఎవరు వారు?
విషకీలాకాలాహలు సమర భావ దూషితాలూ
ఏకదేశ సోదరులా?, అని ప్రశ్నిస్తారు

'అనల తోరణం' అన్న ప్రథమ ఖండికలో పీరు. ఇందలి ప్రతి పంక్తిలోనూ ఆధునిక వచన కవితా వైశిష్ట్యం దోబూచులాడుతూ వుంటుంది. శ్రీ రంగారావు రసానుగుణంగా తీసుకున్న ఉపమానాలూ సంకేతాలూ చూడ ఉత్తమ శ్రేణికి చెందినవి.

'ఉదయ కాలపు నీడలు
సాయం వేళల నీడలు
ఎదురెదురై క్రమ్ముకొని
నిల్చాయి పందిరి వలె'
'నక్కలూ సింహాలూ పులులూ
వచ్చిచేరాయి జన పథాల్లోకి
అనుమానం కాదు నిశ్చయంగానే
తరుముతున్నాయి ప్రజల నడవుల్లోకి'

పాక్ నియంతల సేనలు బంగ్లా దేశ్‌లో ప్రవేశించి స్వదేశీయులను కాందేశీకులుగా తరమడం ఇందులో అభివర్ణిస్తున్నారు కవి.

'అత డెవరు?
విప్లవ మూర్తి
నెత్రు మడుగులో
విరిసిన అగ్ని పద్మం' వంగనేత షేక్ ముజిబుర్ రహమాన్ వర్ణన యిది.

"అతని కళ్లముందు కపోతాలు శ్రేణులు శ్రేణులుగా సాగి సైనికుల శిరస్త్రాణాలపై, ఆయుధాల చివరులపై ఆగి ఆగి ఎగిసాయి పైకి" ఇది తొలిదశ. అప్పుడతనిని బంధించారు. ఫలితంగా ఏమైంది?

"పిచ్చెక్కినట్లు వీచే తుఫానులలో
ఒడ్డుకోసి పొంగి పొరలే నదిలో
పయనించే వేళ నావ
జారిపోయాడు నావికుడు"

మిగిలిన ఖండ కావ్యముల వలె ఇది సంఘర్షణ జరిగే సమయంలో రాక సమాప్తి చెందిన శుభ ఘడియలో వచ్చింది. అందుకనే మంగళంతో కృతి ముగుస్తుంది.

"ఎక్కడ చూచినా అద్దంవలె కనబడుతోంది నారూపమే
మానవతా సంస్కృతీ రమణీయమై......
దేవుడు ఉన్నాడో లేడోగాని
మానవుడు మాత్రం ఇక్కడ
దక్కాడు నలగీకలగీ
సంస్కృతికి వారసుడుగా ——"

మానవత మిగిలింది చివరకు బంగ్లాలో—ఉసురశక్తి పరాజయం పొందింది. బంగ్లా చరిత్ర ప్రపంచానికిచ్చే ప్రబల సందేశమే ఇది!!

"బంగ్లాదేశ్" అవతరణం జరిగి ఇంకా ఎక్కువ కాలం కాలేదు. కాబట్టి భవిష్యత్తులో ఇంకా ఇలాంటి అనేకానేక ఉజ్వలకృతులకు ఈ సంఘటన స్ఫూర్తినిచ్చి తీరుతుందనే మనం భావించవచ్చును!!

శ్రీకాకుళం జిల్లాలో ఆకర్షణలు


—టి. ప్రకాశరావు

శ్రీకాకుళం జిల్లాలో యాత్రికులకు, పారిశ్రామిక వేత్తలకు ఎన్నో ఆకర్షణలున్నాయి. అరసవిల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయము, శ్రీకూర్మములోని శ్రీకూర్మనాథస్వామి దేవాలయము, శ్రీముఖలింగము లోని శ్రీముఖలింగేశ్వర దేవాలయము, యితరములైన చూడదగ్గ ప్రదేశాలు, యాత్రికులను ఆకర్షిస్తూన్నాయి. జిల్లాలోని తీరప్రాంతము, అటవీప్రాంతము, మైదాన ప్రాంతములలో లభ్యములగు సహజసంపద, పంటలు, పారిశ్రామికాభివృద్ధికి దోహదకారులైన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాయి, ఆకర్షించనున్నాయి. వ్యవసాయ పారిశ్రామికాభివృద్ధికి దోహదముచేయు వంశధార, నాగావళి, సువర్ణముఖి, వేగావతి, చంపావతి, మహేంద్రతనయ, గోముఖి, బాహుదా వంటి పుణ్యనదులు ఈ జిల్లాలో ప్రవహిస్తున్నాయి. వీటిలో లభ్యమగు నీటిని రిజర్వాయర్లు, ఆనకట్టలు ద్వారా వినియోగించిన శ్రీకాకుళం జిల్లా అధికోత్పత్తికి, తద్వారా దేశ సౌభాగ్యానికీ ఎంతో దోహదము చేయగలదు.

యాత్రాస్థలాలు, వాటివివరాలు క్లుప్తముగా తెలుసుకొందాం.

అరసవిల్లి:

ఈ క్షేత్రము శ్రీకాకుళమునకు 2 మైళ్ళ దూరములో ఉన్నది. ఇచ్చట శ్రీసూర్యనారాయణ స్వామి వారి దేవాలయ



అరసవిల్లి సూర్య దేవాలయంలో మూల విరాట్టు

మున్నది. దేశములో గల కొద్ది సూర్యనారాయణస్వామి దేవాలయాలలో ఇది ముఖ్యమైనదని అందురు. శ్రీ సూర్యదేవుడు త్రిమూర్తుల స్వరూపుడు–ఉదయమున బ్రహ్మ, మధ్యాహ్నమున విష్ణు, సాయంకాలమున ఈశ్వరుడు అని భక్తులు శైవ వైష్ణవ మత భేదములు విస్మరించి ఈ స్వామిని సేవింతురు.


దేవేంద్రుడు తన ఆరోగ్యప్రాప్తికి, శ్రీ సూర్యదేవుని ఇచట ప్రతిష్ఠించెనని పురాణములో చెప్పబడుచున్నది.

దేవ శిల్పి మయుడు ఆలయమును నిర్మించెనట. ఒక రాగి రేకు శాసనమునుబట్టి క్రీ. శ. 7వ శతాబ్దమున కళింగదేశమును పాలించిన దేవేంద్రవర్మ యిచట శ్రీ సూర్యదేవాలయమును కట్టించినట్లు, అది కాలగతిలో కానరాకపోగా కీ.శ. 1778 సంవత్సరములో యలమంచిలి పుల్లాజీ పంతులు ఈ ఆలయమును పునరుద్ధరణ చేసినట్లు తెలియుచున్నది.

ప్రతి ఆదివారము, రథసప్తమి, వైశాఖ, మాఘ మాసములలో వేలాది భక్తులు యిచటకు వచ్చి స్వామిని దర్శింతురు. యిచటను శ్రీకాకుళం పట్టణములోను కూడా తిరుపతి తిరుమల దేవస్థానము వారి వసతి గృహములు కలవు. అరసవిల్లి శ్రీకాకుళము పట్టణములో భాగమైనందున యిచటకు జిల్లాలోని అన్ని పట్టణములనుండి, విశాఖపట్నం నుండియు మంచి బస్సు సౌకర్యము కలదు.

శ్రీకూర్మం:

ఈ పుణ్యక్షేత్రము శ్రీకాకుళం పట్నమునకు 10 మైళ్ళ దూరములో ఉన్నది. మనదేశములోని అరుదైన శ్రీ కూర్మనాథుని దేవాలయము యిచ్చటనే ప్రసిద్ధి గాంచినది. శ్రీ కూర్మనాథుడు మహావిష్ణువుని రెండవ అవతారము. శ్రీ కూర్మ నాథుడు బ్రహ్మచే ప్రతిష్ఠింపబడిన దైవమని చెప్పుదురు.



శ్రీకూర్మ దేవాలయం


దేవాలయమునకు తూర్పునున్న ధ్వజస్తంభముతో పాటు పశ్చిమమునకూడ ఒక ధ్వజ స్తంభము కలదు. శ్రీ కూర్మనాథుడు పశ్చిమాభిముఖుడైన తరువాత రెండవ ధ్వజస్తంభమును భగవద్రామానుజులు ప్రతిష్ఠించినట్లు చెప్పుదురు. శిల్పకళతో శోభిల్లు మండపములోని స్తంభము ఒకేరీతిగా కనిపించును. ఏ రెండు

స్తంభములు ఒకేవిధముగా ఉండనట్లు చేసి శిల్పి తన కళానైపుణ్యమును ప్రదర్శించెను. ఇచటి కూర్మగుండము హరిశంకరాలయముల మధ్యను అస్తి నిమజ్జనము చేయుటవలన చనిపోయినవారికి శాశ్వత మోక్షమని స్థల పురాణములు చెప్పుటచే, దేశములో వివిధ ప్రాంతములనుండి జనులు అస్తి నిమజ్జనము చేయుటకు వచ్చుచుందురు.

పద్మపురాణము బ్రహ్మాండ పురాణములలోను శ్రీ కూర్మ క్షేత్ర మహిమను గూర్చి వర్ణింపబడినది. కీ.శ. 4 నుండి 14వ శతాబ్దము వరకు కళింగరాజ్యమును పాలించిన రాజులగూర్చి తెలియజేయు శాసనము లెన్నో ఇచటకలవు.

ప్రతి ఏటా ఫాల్గుణ మాసములో జరుగు దోళాయాత్రకు, సుమారు లక్షమంది యాత్రికులు వచ్చుచుందురు. ఇచ్చట తిరుపతి తిరుమల దేవస్థానము వారి వసతి గృహము కలదు. ఇచటి నుండి శ్రీకాకుళం, శ్రీకాకుళం రోడ్, కళింగపట్నం, సింహాచలం అన్నవరం మొదలగు ప్రదేశములకు బస్సు సౌకర్యము కలదు.


శ్రీముఖలింగము :— ఈ క్షేత్రము శ్రీకాకుళమునకు 30 మైళ్ళ దూరమున ఉన్నది. ఇచ్చట శ్రీముఖలింగేశ్వర, శ్రీసోమేశ్వర, శ్రీభీమేశ్వరస్వామి దేవాలయములు కలవు వీటిలో శ్రీముఖలింగేశ్వర దేవాలయము ముఖ్యమైనది. ఇచ్చట శిల్ప కళా చాతుర్యము అద్భుతము, ఆకర్షణీయము.



శ్రీముఖలింగేశ్వర దేవాలయము

పూర్వము శ్రీముఖలింగేశ్వరుని మధుకేశ్వరుడు అని పిల్చెడివారట. దేవ వైద్యులు అశ్వని దేవతలు యిచ్చట ఆలయమును నిర్మించినట్లు స్థలమహాత్యము చెప్పుచున్నది. కళింగ రాజ్యమును పాలించిన గంగవంశపు రాజులు, శ్రీముఖలింగమును రాజధానిగా చేసుకొని ఇచ్చట శ్రీముఖలింగేశ్వర ఆలయమును మరల కట్టించినట్లు చెప్పుదురు. అశోకుడు ఇచ్చటనే కళింగయుద్ధము చేసినట్లు కూడా చెప్పుదురు.

శాపగ్రస్థుడయిన గంధర్వరాజగు చిత్రసేనుడు, శబర నాయకుడుగా జన్మించెనని, వానికి చిత్తి, చిత్కళ అను యిద్దరు భార్య




సోమేశ్వర దేవాలయం

లుండేవారని, వారికలహమునకు ఇప్పచెట్టు కారణమగుటచే దాని మొదలంట నరికివేసినట్లు కథలు చెప్పుచుందురు. ఆ ఇప్పచెట్టు మొదలునుండియే శ్రీముఖలింగేశ్వరుడు ఆవిర్భవించినట్లు చెప్పుదురు.

మహాశివరాత్రినాడు, కార్తీకమాసమున ప్రతి సోమవారము నాడును భక్తులు అధికసంఖ్యలో వచ్చి శ్రీస్వామిని సేవించుదురు. మహాశివరాత్రి యాత్రకు సుమారు 50 వేలమంది యాత్రికులు వచ్చుచుందురు. ఇచ్చటినుండి టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురము, శ్రీకాకుళం, పాలూరు పట్టణములకు బస్సు సౌకర్యము కలదు.

చూడదగ్గ యితర ప్రదేశములు :— శ్రీకాకుళములోని శ్రీరుద్రకోటీశ్వరాలయము, జుమ్మామసీదు, బొబ్బిలిలోని యుద్ధచిహ్నాము, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయము, సాలిహుండములోని బౌద్ధ స్తూపములు; కళింగపట్నం, బారువాలలోని అహ్లాదకరమైన సముద్ర తీరము ఈ జిల్లాలలోని ముఖ్యములైన చూడదగ్గ యితర ప్రదేశ



సాలిహుండం శిథిలాలు

ములు. శ్రీకాకుళం నుండి సాలిహుండం 12 మైళ్ళు, కళింగపట్నం 17 మైళ్ళు, బారువ 68 మైళ్ళు, బొబ్బిలి 58 మైళ్ళ దూరములో ఉన్నవి. ఈ ప్రదేశములన్నింటికి శ్రీ కాకుళం నుండి బస్సు

తృణప్రాయులై యుండిరి. అట్టివానిని నీ వీనాడు చంపి మూడు లోకములకు మేలుచేసితివి. దేవతలకంటకమును ఊడబీకి పార వేసితివి. ఇతనినేకాక యితనితో సమాన బలపరాక్రమములుగల అనేక రాక్షసులను నీవు—నీ పార్షదులు చంపి అందరికిని ఆనందము కలిగించితిరి. సాక్షాత్తు భగవంతుడగు ఉమాపతివలె నీవుగూడ యుద్ధమునందు అజేయుడివైతివి. ఇది నీ తొలి విజయము. నీ కీర్తి మూడు లోకములందును అక్షయమయ్యెను. దేవతలందరు నీకు వశులైరి."

అని చెప్పి యింద్రుడు మహాదేవునకు నమస్కరించి దేవతలతోపాటు వెడలిపోవుచుండెను. ఆ తరువాత రుద్రదేవుడు భద్రవట సమీపమునకు పోయెను. దేవతలు తమ తమ స్థానములకు పోవుచుండగా శంకర భగవానుడు వారితో 'దేవతలారా! మీరందరు స్కందదేవుని నన్నువలెనే భక్తితో ఆరాధించుచుండుడు' అని చెప్పెను. అగ్నిపుత్రుడగు స్కందుడు ఒక దినములోనే దానవులనందరను సంహరించి త్రైలోక్య విజయమును సాధించి మహర్షులచే పూజింపబడెను. పవిత్రమగు ఈ స్కందజన్మ వృత్తాంతమును పఠించినవారు ఈ లోకములో సమస్త సుఖ సంపదలను అనుభవించి చివరకు శాశ్వతమగు స్కంద లోకమును చేరెదరు" అని చెప్పి యుధిష్ఠిరుని ప్రార్థనపైన స్కందునియొక్క 'ఆగ్నేయుడు' మొదలగు ఏబదియొక్క నామములను చెప్పి మార్కండేయ ముని స్కందదేవుని ఇట్లు స్తుతించెను:—

"బ్రహ్మజ్ఞాన సంపన్నుడు, బ్రాహ్మణ ప్రియుడు, బ్రహ్మ పుత్రుడు, బ్రహ్మనిష్ఠుడు, బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు, ఏడు జ్వాలలతో ప్రకాశించువాడు, సంవత్సర మాసాది కాలస్వరూపుడు, సర్వదేశవ్యాప్తుడు, లోకపాలకుడు, దేవాసుర సంరక్షకుడు, దేవసేనాధిపతి, సర్వభోక్త, అనంతరూపుడు, శక్తిధరుడు, స్వాహాసుతుడు, కుక్కుటము (కోడిపుంజు)తో క్రీడించువాడు (అది యతని వాహనము), సర్వయజ్ఞ స్వరూపుడు, సర్వ కాల స్వరూపుడు, శత్రు నాశకుడునగు నో మహాత్మా! నీవు సూక్ష్మమునకంటె సూక్ష్ముడవు—మహత్తుకన్న గొప్పవాడవు. నీ తేజస్సుచేత ఈ సర్వప్రపంచము వ్యాప్తమైయున్నది. నిన్ను విడిచి నాకు వేరు గతిలేదు. నీకు నమస్కరించెదను."

స్కందుని యొక్క నామములను, స్తోత్రమును శ్రద్ధాభక్తులతో పఠించినవారికి, వినినవారికి ఈ లోకమునందు ధనము, దీర్ఘాయుష్యము, యశస్సు, పుత్రసంతతి, శత్రుజయము కలుగును. చివరకు స్వర్గసుఖము ద్వారా స్కందదేవుని సాలోక్యరూపమగు ముక్తిగూడ నిస్సంశయముగా లభించును.

ఇది కుమారస్వామి చరితము.

ద్రౌపది, సత్యభామకు పతివ్రత కర్తవ్యములను బోధించుట

అచ్చట బ్రాహ్మణులు, పాండవులు కూర్చొని యుండగా ద్రౌపదీ సత్యభామలు వచ్చిరి. వారు పరస్పరము చూచుకొని చాలకాలమైనందుచేత హాస్యవినోద భాషణములు జరిపించుకొనుచు నచట నొక వైపున కూర్చునిరి. ఆ యిరువురు కురు—యదు వంశములకు సంబంధించిన కథలు చెప్పికొనుచుండిరి.

అప్పుడు సత్యభామ ద్రౌపదిని ఇట్లు అడిగెను:—"ద్రౌపదీ! బలవంతులు, లోకపాలకులతో సమానులు, వీరులునైన పాండవుల హృదయమును నీవెట్లు ఆకర్షింపగలిగితివి? వారు నీ వశములో ఉండి నీ యెడల కోపించకుండుటకు కారణమేమి? అందరును నీ ముఖ దర్శనమునందు లాలసులై యుందురుగదా! ఇందలి రహస్యములను తెలుపుము. నీవు చేయు వ్రతములు, తపస్సు, తీర్థ స్నానములు, మంత్రములు, ఓషధులు, మూలికలు, విద్యాబలము, జప—హోమాదులు దీనికి కారణములైయున్నచో వాటిని నాకు తెలుపుము. వాటి ద్వారా నేను గూడ నీవలెనే పతిప్రేమను సంపాదించి శ్రీకృష్ణుని వశములో నుంచుకొని నిరంతర కీర్తి—సౌభాగ్యములను పొందగలను." సత్యభామకు ద్రౌపది యిట్లు బదులు చెప్పెను:—

"సత్యభామా! దురాచారలు, కులటలునైన స్త్రీలను గూర్చి నన్ను అడుగుచున్నావు. అట్టి వారి విషయము మనమెట్లు ముచ్చటించ గలము? ఇట్టి ప్రశ్నములు చేయుటగాని లేక పతిప్రేమ విషయమై సందేహించుటగాని నీవంటి పతివ్రతలకు ఉచితముగాదు. నీవు బుద్ధిమంతురాలవేకాక శ్రీకృష్ణుని పట్టమహిషివగుటచేత నీకిది తగదు. తన భార్య మంత్ర-తంత్ర-ఓషధుల చేత తనను వశపరచుకొన జూచుచున్నదని పతికి తెలిసినచో నతడు మిక్కిలి ఆందోళన చెంది ఇంటిలో దూరిన సర్పమును జూచినట్లు అటువంటి భార్యను జూచి భయపడుచుండును. అట్టివానికి శాంతి ఉండదు. శాంతిలేని పతికి గృహములో సుఖము లభించదు. కనుక మంత్రతంత్రాదులచేత పతి యెప్పుడు పత్నీవశుడు కాజాలడు. కొందరు శత్రువులు స్త్రీలకు కొన్ని మారణౌషధములను ఇచ్చి 'ఇవి నీ పతిని నీకు వశుని చేయును' అని మోసగించి యిచ్చెదరు. వాటిని పతికి సేవింపజేయుటచేత తమచేజేతుల పతిని చంపికొందురు. శత్రువులిచ్చు ఔషధములు నాలుకకుగాని చర్మమునకుగాని తాకినంత మాత్రము చేత వెంటనే పతి మరణించును. ఎందరో స్త్రీలు వశీకరణౌషధములను ప్రయోగించి పతులను 'జలోదర—కుష్ఠ—అకాల వృద్ధత్వ—నపుంసకత్వ—అంధత్వ—మూకత్వ—బధిర'త్వాది రోగములకు గురిచేయుచున్నారు. పాపాత్ములను ఆశ్రయించి కొందరు స్త్రీలు పాపిష్ఠురాండ్రై పతులను అనేక విపత్తులలో ముంచెదరు. కనుక పతివ్రత యెప్పుడు గూడ పతికి అప్రియము చేయగూడదు. సత్యభామా! నేను నాపతులయెడ వ్యవహరించు విధమును చెప్పెద వినుము:—

నేను అహంకారమును, కామ—క్రోధములను విడిచి జాగ్రత్తతో పాండవులను—వారి యితర భార్యలను సర్వదా సేవించుచుందును. నా స్వేచ్ఛను అణచి, మనస్సును వశములో నుంచుకొని, స్వాభిమానమును వీడి, పతులచిత్తము ననుసరించుచు వారిని సేవించెదను. ఎప్పుడు గూడ చెడ్డమాటలను పలుకను. అసభ్యత తోచువిధమున నిలబడను. సిగ్గువీడి అంతటను దృష్టి పోనీయను. చెడ్డచోట్లలో కూర్చొనను. చెడుపని చేయను. అసభ్యముగా నడవను. ఈ విషయములలో మిక్కిలి జాగ్రత్తవహించుచు పతుల యింగిత

మును కనిపెట్టి మెలగుచుందును. సూర్య-చంద్ర-అగ్నులతో సమానులు, మహారథికులు, దృష్టిమాత్రము చేత శత్రువులను సంహరించువారు, భయంకర తేజస్సు పరాక్రమముగలవారు నగు నా భర్తలను నేను ఎల్లప్పుడు సేవించుచుందును. దేవ—మనుష్య—గంధర్వులలో యువకుడు, సుందరుడు, బాగుగా నలంకరించుకొనిన వాడు, ధనవంతుడు ఎవడైనను అన్య పురుషుని కన్నెత్తియైన చూడను. పతులకు—సేవకులకు భోజనముపెట్టుటకు పూర్వము నేనెప్పుడు భుజించను. పతులకు స్నానము చేయించక నేను చేయను. వారు నిద్రించనప్పుడు నేను నిద్రపోను. వారు కూర్చున్నప్పుడు నేను కూర్చునెదను. పొలమునుండి కాని, వనము నుండి కాని, అన్యగ్రామము నుండి కాని యింటికి వచ్చిన భర్తలను ఎదుర్కొని యింటిలోనికి తోడుకొనివచ్చి, ఆదరపూర్వకముగా వారిని కూర్చుండచేసి, పానీయమును ఇచ్చి, సేదదేర్చెదను. ఇంటిలో పాత్రలు తోమెదను. రుచికరమైన భోజనమును వండెదను. సకాలములో పతులకు భోజనము పెట్టెదను. మనస్సును, ఇంద్రియములను నావశములో నుంచుకొనెదను. ఇంటిలో రహస్యముగా భోజన సామగ్రిని సేకరించి ఉంచెదను. ఇంటిని ఊడ్చి, అలికి శుభ్రముగానుంచెదను. ఎవరిని తిరస్కరించి మాట్లాడను. దుష్టస్త్రీల నుండి దూరముగ నుండెదను. ఏ మాత్రము సోమరితనము లేక సర్వదా పతులకు అనుకూలవతిగా నుండెదను.

"పతులు నన్ను పరిహాసము చేసినప్పుడు తప్ప ఇతర వేళలలో నవ్వను. మాటిమాటికి ఇంటివాకిట్ల నిలబడను. మురికిగా నుండుచోట చాలసేపు నిలువను. ఉద్యానవనవిహారము ఒంటరిగా చేయను. నీచ పురుషులతో మాట్లాడను, సంతోషరహితముగా పతులయెదుటనుండను. ఇతరులను గూర్చిన చర్చలను చేయను. ఎక్కువగా నవ్వను. అధికముగా కోపించను. కోపమునకు అవకాశమేరానీయను. ఎల్లప్పుడు సత్యము పలికెదను. పతిసేవలో లగ్నురాలనై యుందును. పతులు లేనట్టి చోట్లలో నుండుటకు ఇష్టపడను. పతులు పరదేశము పోయినప్పుడు, పుష్పములు ధరించను, సుగంధ ద్రవ్యములు దేహమునకు పూసికొనను, బ్రహ్మచర్యములో నుండెదను. పతులు తినని వస్తువును, త్రాగని పానీయములను, సేవించని వస్తువులను నేను విడిచెదను. శాస్త్రములలో స్త్రీలకు కర్తవ్యముగా చెప్పబడిన పనులను చేసెదను. మంచి వస్త్రములను, భూషణములను ధరించి పతి సేవ చేసెదను. పతి ప్రీతికరములనే చేసెదను. కుటుంబములోని ధర్మములను నా అత్తగారు బోధించిన విధముగా ననుష్ఠించెదను. ఏ మాత్రము అశ్రద్ధ చేయను.

"పూజ, వైశ్వదేవము, భిక్షాదానము, శ్రాద్ధము, పర్వకాలములలో చేయవలసిన హోమములు, పూజ్యులను సత్కరించుట, వినయము, నియమము మొదలైన ధర్మ కార్యములను అనుష్ఠించెదను. నాపతులు మృదు స్వభావులు—సత్య సంధులు—ధర్మ పరులునైనప్పటికిని వారిని నేను కోపించిన సర్పములను జూచిన విధమున భయపడుచు శ్రద్ధగా సేవించుచుందును. పతి నాశ్రయించుటయే స్త్రీ ధర్మము. అని నా నిశ్చయము. స్త్రీకి పతియే దైవము—పతియే గతి — అన్యముకాదు. కనుక అట్టి పతికి ఏ స్త్రీ అప్రియము చేయును? నా అత్తగారిని ఎప్పుడుగూడ నిందించను. నన్ను నేను వశములో నుంచుకొనెదను. సత్యాదేవీ! నేను వేకువనే మేల్కొని గృహ కృత్యములు, గురుజన శుశ్రూషలు చేయుచుందును. దాని చేతనే నా పతులు సంతుష్టులై నాకు అనుకూలురుగా నుందురు. నేను ప్రతి దినము కుంతీదేవికి అన్న—పాన—శయనాదులను సకాలమునందు సమకూర్చి ఆమెను తృప్తి పరచుచుందును. పూర్వము యుధిష్ఠిర మహారాజు పంక్తిలో ఎనిమిది వేల బ్రాహ్మణులు సువర్ణ పాత్రములలో భుజించుచుండిరి. ఆ మహారాజు ఎనుబది యెనిమిది వేల గృహస్థులను తన యింటిలో పోషించుచుండెను. వారిలో నొక్కొక్క గృహస్థుని సేవకై ముప్పది మంది చొప్పున దాసీజనమును నియమించియుండెను. వీరుకాక పదివేల మంది యతులకు, యోగులకు బంగారు పాత్రములలో భోజనము పెట్టుచుండెను. ఆ బ్రాహ్మణులకందరికిని నేను పూజా వైశ్వదేవాదులు ముగించిన వెంటనే తొలుత అన్నము పెట్టుచుంటిని. పరుపులు, పానీయములు ఇచ్చుచుంటిని.

"సత్యభామా! యుధిష్ఠిర మహారాజు సేవకుగాను ఒక లక్ష దాసీజనము ఉండిరి. వారందరు సువర్ణ మణిభూషణాలంకృతులై, సుస్నాతలై, సుగంధలేపనలై, సువస్త్రధారిణులై సుందరముగా నుండిరి. వారికి నృత్యగీతాదులలో పాండిత్యము ఉండెను. వారందరి పేర్లు, రూపములు, వారి భోజనపానాదులు అన్నియు నాకు తెలిసియుండెను. ఎవతె యేపని చేసెను—ఎవతె చేయలేదు. అను విషయములన్నియు కనిపెట్టుచుంటిని. ఆ దాసీజనులందరు అతిథులకు తృప్తిగా సత్కారము చేయుచుండిరి. ఆ మహారాజు ప్రయాణమునకై బయలుదేరినప్పుడు ఆయన వెంట ఒక లక్ష గుఱ్ఱములు, ఒక లక్ష యేనుగులు పోవుచుండెను. వాటిని నేనే లెక్క పెట్టుచుంటిని. వాటి అవసరములను తెలుసుకొని తీర్చుచుంటిని. అంతఃపుర స్త్రీలందరు మరియు ఆబాలగోపాలము చేసిన పనులను, చేయని పనులను కనిపెట్టుచుంటిని. కల్యాణీ! పాండవుల రాబడి—వ్యయము—నిలువ ధనమును గూర్చిన లెక్కలన్నియు నేనే తెలిసికొని చూచుచుంటిని. పాండవులు గృహ కృత్యరాజ్య భారమంతయు నాపైననే వేసియుండిరి. ఆ భారమును దుష్టులైన స్త్రీపురుషు లెవరుగూడ భరించజాలరు. నేను అన్ని సుఖములను విడిచి రాత్రింబగళ్లు దుర్భరమగు ఆ భారమును సహించి వహించి యుంటిని. నా పతులయొక్క ధనాగారము వరుణదేవుని సముద్ర ధనాగారమువలె అక్షయముగా నుండెను. నేను మాత్రమే దాని విషయమునంతయు తెలిసియుంటిని. పాండవుల ఆకలి దప్పులను కనిపెట్టి రేయింబవళ్లు కష్టమును సహించి వారిని ఆరాధించుటలో నిమగ్నురాలనై యుండెదను. నాకు రాత్రి—పగలు రెండు గూడ ఒకే విధముగ నుండెను. పతులకన్న తొలుత మేల్కొని వారు నిద్రించిన తరువాత నిద్ర పోవుచుండెదను. ఈ విధముగా నేను సర్వదా వారి సేవ చేయుచుండెదను. ఇదియేనా వశీకరణ మంత్రము. పతులను వశపరచుకొనుటకు ఇదియే అన్నిటికన్న గొప్ప ఉపాయమని నాకు తెలియును. దుష్ట స్త్రీలు ఆచరించు వశీకరణములను నేను చేయను. చేయు తలంపుగూడ నాకు లేదు."

ఇట్లు ద్రౌపది చేసిన ఉపదేశమును విని సత్యభామ ఆదర పూర్వకముగా "పాంచాలీ! నేను నీ శరణు జొచ్చితిని. నేను చేసిన అనుచిత ప్రశ్నములకు నన్ను క్షమించుము. సఖురాండ్రిలో ఇట్టి ఉపహాసవాక్యములు స్వేచ్ఛగా మాట్లాడుకొనుటకలదు కదా! దానికి నీవు అన్యథా భావించకుము" అని యనెను. అదివిని ద్రౌపది యిట్లు పలికెను:—

"సత్యాదేవీ! పతి మనస్సును ఆకర్షించుటకు నీకు మంచి మార్గము చూపించినాను. ఇందులో ఏమాత్రము కపటము—కుమార్గములేదు. నీవు నేను చెప్పిన మార్గములోనే నడచినయెడల నీ భర్త చిత్తమును నీ సవతులనుండి నీవైపునకు తప్పకుండా ఆకర్షించుకొనెదవు. స్త్రీలకు ఏ లోకములోనైన పతికన్న ఇతర దైవములేదు. పతి అనుగ్రహమువలన పత్నికి అన్ని కోరికలు తీరును. అతడే కోపించినయెడల స్త్రీలకు అన్ని ఆశలు నశించును. సేవలద్వారా వశమునందుంచుకొనబడిన పతివలన స్త్రీకి మంచి సంతానము, వివిధ సుఖములు, శయ్య, ఆసనము మంచి వస్త్ర భూషణములు, పుష్ప సుగంధ ద్రవ్యములు, గొప్ప కీర్తి కలుగుటయేకాక స్వర్గలోకముగూడ సులభమగును.

"సత్యభామా! ఎప్పుడుగూడ సుఖపడుటవలన సుఖము లభించదు. దుఃఖానుభవముచేతనే సుఖ ప్రాప్తియగును. పతివ్రత కష్టపడి తన సుఖమును వీడి భర్తను సేవించినప్పుడే నిరంతర సుఖమును పొందగలదు. కనుక నీవు నీ పతికి నేను చెప్పిన సేవలన్నిచేసి, వ్యవహారకుశలురాలై మెలగుచుండినచో శ్రీకృష్ణుడు నీ ప్రేమాదరములకు మెచ్చి నీవశములోనుండగలడు. 'సత్యభామకు నాయెడలనే అధిక ప్రీతికలదు' అని అతడు అనుకొనులాగున నీవు వ్యవహరించినచో నతడు నిన్ను సర్వదా హృదయమునకు హత్తుకొని యుండును. వాకిట్లోకి వచ్చిన పతి ధ్వని వినగానే అతనిని ఎదుర్కొని లోపలికి తోడ్కొనిరమ్ము. ఆసనమునందు ఉంచి అర్ఘ్యపాద్యాదులతో నతనిని పూజించుము. అతడొకవేళ దాసికి పని ఆజ్ఞాపించినను అది విని వెంటనే నీవు లేచి ఆ పనిని దాసికన్నముందే చేయుము. దానివలన నీవు అతనిని సర్వాత్మనాభజించుచున్నట్లు తెలిసికొని నిన్ను ప్రేమించును. నీకు భర్త చెప్పినమాటలు రహస్యములు కాకున్నను ఇతరులకు చెప్పకుము. వానిని నీ సవతి విని శ్రీకృషునికి చెప్పినచో నతనికి నీ యెడల విరక్తి కలుగును. అతనికి ప్రియులు, హితులు అనురక్తులు నైనవారిని నీవు ఆదరించి భుజింపజేయుము, అతనికి అప్రియులను దరిజేరనీయకుము. ఇతర పురుషుల సమక్షములో నీవు స్వాభిమానమును ప్రకటించకుండ మౌనము వహించి నీ మనోభావమును ప్రకటించకుము. నీ సవతి కొడుకులు ప్రద్యుమ్నుడు, సాంబుడు నీ కొడుకులే కదా అనుకొని వారితో ఎప్పుడు గూడ ఏకాంతములో కూర్చొనకుము. గొప్ప కులములో పుట్టినవారు, పుణ్యాత్ములు, పతివ్రతలు నైన స్త్రీలతోనే నీవు మైత్రి చేయుము. కోపము–మదము–అతి భోజనము–దొంగతనము–దుష్టత్వము–చంచల స్వభావము ఇవిగల స్త్రీలను దూరముగా త్యజించుము. అమూల్యములైన తూల్యాభరణములను, సుగంధపు మైపూతలను ధరించి సర్వదా సువాసితురాలవై పతిని ఆరాధించుచుండుము. దానివలన నీకు యశస్సు–సౌభాగ్యము వృద్ధిచెంది నీ మనోరథములు ఈడేరి నీ శత్రువులు నశింతురు."

శ్రీకృష్ణుని ద్వారకా ప్రస్థానము :

శ్రీ కృష్ణుడు మార్కండేయాది మునులతోను, పాండవులతోను అనేక కథలు, ఇష్టసంభాషణలు సలిపి హాయిగా కాలముగడిపి ద్వారకాపురికి తిరిగిపోవదలచి సత్యభామను పిలిచెను. ఆమె ద్రౌపదిని కౌగలించుకొని 'కృష్ణాదేవీ! నీకు రాజ్యము లభించలేదని చింత–బాధ అక్కరలేదు. దేవతలతో సమానులైన నీ పతులు తిరిగి రాజ్య సంపాదనము జేసి సుఖపడగలరు. నీవంటి శీలవతులు, ఉత్తమ లక్షణ సంపన్నురాండ్రు చాలాకాలము దుఃఖము ననుభవించరు. నీవు నీ పతులతో తప్పక తిరిగి రాజ్యమునందు సుఖపడగలవని మహాత్ములవలన నేనువిన్నాను. దుర్యోధనాదులను వధించి వైరములను గడిచి యుధిష్ఠిరుడు రాజ్యమును పాలించగలడు. నీవు స్వయముగా చూడగలవు. నీవు వనమునకు పోవునప్పుడు పరిహసించిన కురు స్త్రీలందరు త్వరలోనే ఆశలు ఉడిగి దుఃఖపడగలరు. నీవు దుఃఖితురాలవై యున్నప్పుడు నీకు అప్రియము చేసినవారందరు త్వరలోనే యమలోకమునకు పోవగలరు. నీ కొడుకులు 'ప్రతివింధ్యుడు, సుతసోముడు, శ్రుతకర్మ, శతానీకుడు, శ్రుతసేనుడు' ఈ యైదుగురు నభిమన్యునితో పాటు సుఖముగా ద్వారకాపురములో నున్నారు. వివిధాస్త్ర విద్యలలో సమర్థులైన నీ కొడుకులను సుభద్ర అభిమన్య కుమారునితోపాటు ప్రీతితో నీవలెనే పెంచు చున్నది. సుభద్ర నీ కుమారులలోను తన కొడుకులలోను ఏమాత్రము భేదభావము లేక అందరి సుఖమును దుఃఖమును సమానముగా తాను పంచుకొనుచు ప్రేమతో చూచుచున్నది. రుక్మిణీ కృష్ణులుగూడ తమ కొడుకులతో సమానముగా నీ కొడుకులను చూచుకొనుచున్నారు. వారికి అన్న–పాన–శయనాదులలో మా మామగారగు వసుదేవులు స్వయముగా చూచుకొనుచున్నారు. ఈ విధముగానే వారిని బలరామదేవుడు ఇతర యాదవులును ఆదరించుచున్నారు. ప్రద్యుమ్నాది కుమారులుగూడ సోదర ప్రేమతో మెలగు చున్నారు. కనుక నీ కొడుకులను గూర్చి యేమాత్రము చింత పడకుము. ద్వారకలో వారు సుఖముగాను ఆనందముతోను నున్నారు.

ఈ విధముగా చెప్పి సత్యభామ ద్రౌపదికి ప్రదక్షిణ నమస్కారములు చేసి కృష్ణుని రథములో కూర్చొనెను. అందరి వద్ద సెలవు తీసికొని కృష్ణుడు బయలుదేరెను.


పాండవుల సమాచారము విని దృతరాష్ట్రుడు దు:ఖించుట :

ఈ విధముగా ద్వైతవనములో సరోవర తీరమునందు కుటీరమును నిర్మించుకొని పాండవులు నివసించుచుండగా వేదవిదులైన బ్రాహ్మణులు కొందరు వారికడకు వచ్చి వారి చేత పూజితులైరి. ఇట్లు వారు దేశాటనము చేయుచు నొకనాడు వారిలో నొకడు ధృతరాష్ట్రుని వద్దకు పోయెను. ఆ వృద్ధరాజు ఆతనిని సత్కరించెను. ఆ బ్రాహ్మణుడు ప్రసంగ వశాత్ అడవిలో ఇడుములు వడుచున్న పాండవులను గూర్చి చెప్పెను. ద్రౌపది యనుభవించుచున్న క్లేశమును గూర్చి కూడా చెప్పెను.

(సశేషము)




ఫిబ్రవరి 11 వ తేదీన కేంద్ర   రిజం, పౌర విమానయానశాఖ మంత్రిణి డా. సరోజినీమహిషి హైదరాబాదులో వాతావరణ పరిశోధన కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు



భారత పౌర సంబంధాల సంస్థ ఆంధ్రప్రదేశ్ శాఖను గవర్నరు ఫిబ్రవరి 4 వ తేదీన జూబిలీహాలులో ప్రారంభోత్సవం చేశారు

నగరంలో

వార్తా చిత్రాలు




అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనంలో ఫిబ్రవరి 9 వ తేదీన గవర్నరు ఆ యా ప్రదర్శనస్టాల్సుకు బహుమతులు అందజేశారు




గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 వ తేదీన పారిశ్రామిక ప్రదర్శనలో డా. సి. డి. దేశ్‌ముఖ్ ఒక గ్రంథానికి ఆవిష్కరణ చేశారు



ఫిబ్రవరి 16 వ తేదీన కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ వెంకటస్వామి గారికి హైదరాబాదులో సన్మానం జరిగింది




14 మంది సభ్యులుగల బంగ్లాదేశ్ విద్యావిషయాల కమీషన్ వారు ఇటీవల గవర్నరును కలుసుకున్నారు



రిపబ్లిక్ దినోత్సవంనాడు పెరేడ్ మైదానంలో గవర్నరుకు స్వాగతం యిస్తున్న
శ్రీయుతులు హెచ్.సి. శరీన్; వి.కె. రావు గార్లు

నగరంలో వార్తాచిత్రాలు

పొగాకు కొనుగోలు మాత్రమే మా లక్ష్యమైనప్పుడు



పొగాకు కొనటం, అమ్మటం మా వ్యాపారం. కాని కొత్త ప్రదేశాలను పొగాకు పంట క్రిందకు తీసుకురావటానికి సహాయపడాము. దేనికి? పొగాకు పరిశ్రమ అభివృద్ధికోసమై వేసిన దీర్ఘకాల పథకాలు అమలుపర్చుటకోసం. భవిష్యత్తును గూర్చి ఆలోచించటం మా ప్రధాన కర్తవ్యంగా భావిస్తాము. నాగార్జునసాగర్ ఆనకట్టవలన ఆంధ్ర ప్రదేశ్‌లో పొగాకు పండిస్తున్న భూములలో కొంత భాగం యిక నీరుపెట్టి పండించే ఆహార ధాన్యాల పరము అవుతుంది. ఈ లోటును పూర్తి చేయటానికి పొగాకు పండించే యితర ప్రదేశాలను అన్వేషించాలి. విదేశీయ కొనుగోలుదారుల అభిరుచులలో యీ లోపల వచ్చిన మార్పుల దృష్ట్యా, వేరే రకమైన భూములలోను, వాతావరణ పరిస్థితులలోను పొగాకు పండించవలసి వస్తుంది. కొత్త ప్రదేశాలలో విస్తరణ చేస్తూ, సరికొత్త వ్యవసాయిక పద్ధతులను యీ పొగాకు పండించుటకై ప్రవేశపెట్టాలి. రైతులకు కొత్తదైన యీ పంటను పండించటం కోసం శిక్షణ యివ్వవలసి ఉంటుంది. ఈ ఎత్తులో జరిగే అభివృద్ధి పథకం కోసం ఎంతో మంది కర్మచారులు కావాలి. వీరు, హున్సూరులో మేము నిర్వహించే విద్యాలయములో తయారౌతారు. మేము యిప్పటిదాకా సాధించినది ఏమిటి? ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమ గోదావరి, కర్నూలు జిల్లాలలోను. మైసూరులో కొన్ని ప్రాంతములలోను సాధించగలిగినవి గణనీయమైనవి. ఎగుమతి చేయబడు రెండు రకాలు—ఫ్లూ క్యూర్‌డ్ వర్జీనియా పొగాకు, వైటు బర్లీ, మరియు నాటు పొగాకు మేము అభివృద్ధి చేసిన రకాలలో ఉన్నాయి. సమస్యలను మొదలంట పరిశోధించువారు ఒకరు కావాలి మరి.

కొత్త ప్రదేశాలలో పొగాకు పండించటానికి మేము ఎందుకు ప్రోత్సహిస్తున్నాము?

ఐ ఎల్ టి డి

ఇండియన్
లీఫ్ టొబాకో
డెవలప్‌మెంట్
కంపెనీ లిమిటెడ్

ఐ ఎల్ టి డి—పొగాకు శాస్త్రీయ వ్యవసాయిక పద్ధతులకు మూలాధారము.

U-IL-C-9 TEL

స్వాతంత్ర్య సమరవీరుడు

రాజా వెంకటరెడ్డి

ఎస్. ఆర్. కోటేశ్వరశర్మ

ప్రతి ప్రాణికి స్వాతంత్ర్యేచ్ఛ సహజ లక్షణం. స్వజాతిపైన అభిమానం, స్వధర్మ రక్షణాపేక్ష ప్రతి వీరునకు జీవిత ధ్యేయాలుగా వుండటం యదార్థ విషయం. ప్రాణం కన్న స్వాతంత్ర్యం ఎంతో విలువైంది. ఒక జాతిని మరొకజాతి బానిసలుగామార్చి స్వాతంత్ర్యాన్ని, ఆ జాతి ధర్మాన్ని హరించడానికి ప్రయత్నించినప్పుడు, దెబ్బతిన్నజాతి సమరం చేయడం సహజం. దాన్ని సమరాపేక్షకన్నా ఆత్మ రక్షణ అనడం ఎంతో సబబైన విషయం. భారతజాతి చరిత్రలో అలాంటి ఘట్టాలు అనేకం వున్నాయి. అందు తెలుగుజాతికి విశిష్టస్థానం వుంది. జాతికోసం స్వాతంత్ర్య సమరాలు సాగించి, అసువులు బాసిన వీరులు తెలుగు జాతి చరిత్రలో లెక్కకు మించివున్నారు. వారి పవిత్ర ఆదర్శాలను, త్యాగ తత్పరతను నేడు మనం సంస్మరణ చేసుకొనడం ఎంతో అవసరం.

తన దేశ స్వాతంత్ర్యంకోసం, దురాక్రమణ దారుని త్రిప్పి కొట్టే ప్రయత్నంలో సర్వం పణం పెట్టిన స్వాతంత్ర్య వీరుడు రాజా వెంకటరెడ్డి సమరగాథ మరువరానిది. ప్రాచీనాంధ్రుల వీరత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడీతడు. కాకతీయుల వైభవాన్ని, విజయనగరాధీశుల శౌర్యపరాక్రమాల్ని నరనరాల్లో జీర్ణించుకొని, తన దేశం బానిసశృంఖలాల నుండి విముక్తిపొందింపచేసే ప్రయత్నంలో ఆఖరు క్షణం వరకు పోరుసల్పి, అసువులుబాసిన ధీశాలి రాజా వెంకటరెడ్డి.

ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతంలోని నేటి వనపర్తిని పూర్వం "నూగూరు" సంస్థానంగా పిల్చేవారు. ఈ సంస్థానాధీశుడే రాజా వెంకటరెడ్డి. వీరి పూర్వీకుల చరిత్ర తెలుగు జాతికి తప్పనిసరిగా ఉత్సుకత కల్గించగలదు. విజయనగర సామ్రాజ్యం వైభవోపేతంగా వర్ధిల్లుతున్న దినాల్లో కడప ప్రాంతవాసియగు వీర కృష్ణారెడ్డి అనే క్షాత్రవీరుడు కృష్ణానది దాటి ఈ ప్రాంతంకు వచ్చాడు. పాతపల్లె, నూగూరు, మరికొన్ని గ్రామాలకు ఆధిపత్యం వహించాడు. ఈతని సంస్థానం గోలకొండ కుతూబ్‌షాహీలకు లోబడివున్నా వారి ఆధిపత్యం నామ మాత్రంగానే వుండేది. ఇతని తర్వాత ఈతని మునిమనుమడు గోపాలరావు పేరెన్నిక గాంచిన పాలకుడు. శౌర్య సాహసాల్లో దిట్ట కాకుండా, అష్టభాషా పాండిత్యాన్ని గడించాడు. గోలకొండ సుల్తాను ఈతనికి సమపీఠంవేసి "బహిరి" అనే బిరుదును యిచ్చి 1676లో గౌరవించాడు.

కాని ఆనాటి భారతదేశ రాజకీయ పరిస్థితి అల్లకల్లోలంగా వుంది. క్రీ.శ. 1687లో గోలకొండ పతనం జరిగింది. దక్షిణ దేశంపై మొగలాయీల ఆధిపత్యం వచ్చింది. విజేత అయిన ఔరంగజేబు దక్కనుదేశ పాలనను సుబేదారునకు అప్పగించాడు. గోలకొండ పతనమైనా, ఆ రాజ్యంలోని సంస్థానాల స్వతంత్ర పతిపత్తికి ఆదిలో అంతగా ముప్పువాటిల్లలేదు. గోపాలరావు నిస్సంతువు గాబట్టి బంధు వర్గంలోని ఒక బిడ్డను దత్తుచేసుకున్నాడు. అతని పేరే రాజా వెంకటరెడ్డి. ఈ దత్తత అనంతరం, గోపాలరావునకు సంతాన ప్రాప్తి కల్గినా క్రీ.శ. 1691లో ఆ బాలుడు అకస్మాత్ మరణం పొందడంవల్ల, దత్తుడే నూగూరు సంస్థానంకు రాజయ్యాడు. ఇది 17వ శతాబ్దపు చివరి సంవత్సరాల గాథ.

రాజా వెంకటరెడ్డి చాల అభిమాన వంతుడు, స్వాతంత్ర్య పిపాసి. స్వధర్మ పరిరక్షణం కోసం తెలుగుజాతి ఔన్నత్యం కోసం కంకణం కట్టుకొన్న ధీశాలి. న్యాయశీలుడుగా, ప్రజారంజకుడుగా పేరు మోశాడు. ప్రజోపకారమగు పనులను పెక్కు కావించాడు. ఈతని ధర్మరక్షణ ఎలాంటిదంటే, పన్నులు కట్టకపోతే జనక తండ్రిని కూడా క్షమించలేదు. ప్రజకొక న్యాయం, రాజబంధువునకొకన్యాయం కూడదనే సిద్ధాంతాన్ని ఆచరణయుక్తంగాచేసి చూపించాడు. సైనిక శక్తిని పెంచి, తన సంస్థానంలో అశాంతిని అలజడిని అణచి ప్రజలకు సుభిక్షతను, సౌభాగ్యాన్ని కల్గజేశాడు. తన దత్తుతల్లి పేర జానం పేటను, తండ్రిపేర గోపాల పేటను వైభవంగా కట్టించాడు. ఈతనిచే నిర్మితమైన గోపాలపేట ఉత్తరోత్తర ఉన్నతమైన స్థాయిని సంతరించుకొంది.

అది 18 వశతాబ్దపు మొదటి దశాబ్దం దాటిన తొలి సంవత్సరాల కాలంలో. రాజా వెంకటరెడ్డి యొక్క ప్రాపు, ప్రజాదరణ కార్యకలాపాలు దక్కను సుబేదారగు "అసఫ్‌జా" కు కన్నెర్ర కల్గజేశాయి. ఆతని ప్రగతి కృత్యాలకు అడ్డు పుల్లలు వేసూ కాలు దువ్వుతూ వచ్చాడు. అప్పటికి "అసఫ్‌జా" మొగలు సామ్రాజ్యం నుండి విడిపోయి స్వతంత్రం ప్రకటించు కొనలేదు. రాజా వెంకట రెడ్డి పాలనలో పితూరీలు కల్పించి, ఢిల్లీకి ఎన్నో సార్లు ఫిర్యాదులు జేశాడు. ఢిల్లీనుండి రాజా వెంకట రెడ్డికి లేనిపోని ఆంక్షలు వచ్చేలా చూశాడు. తెలుగు జాతి అభివృద్ధి, గౌరవ పరిరక్షణం కోసం కంకణం కట్టుకొన్న రాజా వెంకటరెడ్డి మొగలు సామ్రాజ్య ఆంక్షలను లక్ష్య పెట్టలేదు. దక్కను సుబేదారు హెచ్చరికలను ఖాతరు చేయలేదు.

రాజా వెంకటరెడ్డి యొక్క పెరుగుతున్న ప్రాభవాన్ని, స్వతంత్ర విధానాన్ని సహించలేని "అసఫ్‌జా" సరైన కారణం

లేకుండానే, ఢిల్లీ నుండి ఆజ్ఞ రాకుండానే నూగూరు సంస్థానంపై యుద్ధం ప్రకటించాడు. పరిస్థితుల్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్న స్వతంత్ర వీరుడు రాజా వెంకటరెడ్డి పెద్ద ఎత్తున స్వాతంత్ర్య సమరం కొనసాగించాడు. విజయమో; వీరస్వర్గమో; తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. నిజాం దురాశలను, దుష్టతలంపులను తన సైనిక నాయకులకు, వీరులకు విపులంగా చెప్పి, శత్రువులను సంపూర్ణంగా నిర్జించాలని హెచ్చరించాడు. తెలుగు వీరుల ఖడ్గాలు ఒరలు నుండి మెరుపుల్లా లేచాయి.

జానంపేట వద్ద స్వాతంత్ర్య వీరులు, నిజాం సైన్యాలు ఢీకొన్నాయి. దేశీయ సైనికులు తొలి ఘట్టంలోనే నిజాం సైన్యంపై పులుల్లా విరుచుకపడి చావు దెబ్బ కొట్టారు. శత్రుసైన్యాలలో భయోత్పాతాన్ని కురిపించారు. శత్రువులను వందల కొలది సంఖ్యలో సంహరించి, పెద్ద సంఖ్యలలో ఖైదీలను చేశారు. మిగిలిన నిజాం సైన్యం పలాయన మంత్రం పఠించింది. విజయం పొందిన తెలుగు వీరులు జై "వీరవంకట రెడ్డి" అంటూ జానంపేట దుర్గ ప్రవేశం కావించారు. వారి ఉత్సాహ తరంగాలు మిన్ను ముట్టాయి. శతాబ్దాలుగా మరుగున పడిన తెలుగు జాతి తేజం పెల్లుబికి, ఆనాడు పండుగను చేసుకుంది.

అపజయం పొందిన 'అసఫ్‌జా' తన ఓటమికి పళ్లు పట పట కొరకడం తప్ప అన్యం చేయలేక పోయాడు. తన తొందర పాటు చర్యకు ఢిల్లీ నుండి కూడా సమర్థన రాలేదు. హైదరాబాదులో తన అనుచరులతో మంతనాలు జరిపాడు. శాంతిని నటిస్తూ, మెరుపు దాడిని తీయాలని నిర్ణయించుకున్నాడు. ఈ శత్రువుల కుట్రను గమనించని తెలుగు వీరులు విజయోత్సాహంలో మరో యుద్ధ విషయంపై అశ్రద్ధ చేశారు. వారు ఆదిలో పొందినది తాత్కాలిక విజయమని గ్రహించలేక పోయారు. అదే సమయాన స్వదేశీ గూఢచారి నిజాం యొక్క మాతన దాడి గూర్చి అతని వినూత్న సమరసన్నాహాల గూర్చి రాజా వెంకటరెడ్డికి వివరాల్ని అందజేశాడు.

రాబోయే ప్రమాదానికి రాజా వెంకటరెడ్డి చలించలేదు. మరొక్క మారు సమర సన్నద్ధుడయ్యాడు. సైనికుల నుద్దేశించి రెండు ప్రత్యేక సమావేశాలు కావించాడు. వారి వారి విధులను ఏ సమయంలో ఎలా నడుచుకోవాలనే విషయాన్ని ఘనంగా చెప్పాడు. తెలుగు వీరుల్లో మరొక్కమారు కార్యదీక్ష తొణికిసలాడింది. ప్రజలు కూడా నిజాంపై యుద్ధానికి సర్వవిధాల దేశీ సైనికులకు తోడ్పడ్డారు. రాజా వెంకటరెడ్డి అధ్వర్యంలో నూగూరు సంస్థాన వీరులు యుద్ధ సమా సన్నులైనారు. సంస్థానంలోని కోటలన్ని గట్టి కావింపబడ్డాయి. అనేక రక్షణచర్యలు తీసుకొనబడ్డాయి. శిథిల దుర్గ కుడ్య ప్రదేశాలు బలిష్ఠం కావింపబడ్డాయి.

మరొక్క మారు యుద్ధ ప్రకటన చేయకుండానే జానంపేట దుర్గాన్ని "అసఫ్‌జా" పెద్దఎత్తున ముటడించాడు. దేశీయ వీరుల, నిజాం సైనికుల మధ్య సంకుల సమరం సాగింది. ఆదర్శాలను, ఐక్యతా భావాల్ని హృదయాంతరాళాల్లో నింపుకొన్న తెలుగు వీరులు ప్రాణాల్ని తెగిస్తూ, శత్రువులతో యుద్ధం చేస్తున్నారు. మరొక్క మారు శత్రువులకు అపజయాన్ని ఆపాదించే క్షణాలు ఆసన్నమయ్యాయి నిజాం సైనికులు చాలామంది ప్రాణాలకోసం కాలికి బుద్ధిచెప్పేలావున్నారు. ఇది గమనించిన నిజాం తనసైనికులు పారిపోకుండా అన్ని కట్టుదిట్టాలు కావించాడు. తానే స్వయంగా రణరంగలోకి దూకి, తన సైన్యాన్ని హెచ్చరిస్తూ, రాజా వెంకటరెడ్డితో తలపడ్డాడు. గత్యంతరం లేక నిజాం సైనికులు కూడా స్వదేశీ సైనికులతో హోరాహోరీపోరుసల్పక తప్పలేదు. చివరకు నిజాం యొక్క సైనిక సంఖ్యాబలం స్వదేశీయుల మీద పైచేయిగా మారింది. రాజా వెంకటరెడ్డి సైనికుల్లో చిట్టచివరి వ్యక్తి వరకు యుద్ధం సల్పాడు ఒక్కొక్క వీరుడు పదిమంది శత్రువుల దాక నేలకు కరిపించాడు అయినా తుదకు అపజయం తప్పలేదు. జానంపేట దుర్గం నిజాం వశమైంది.

"అసఫ్‌జా" తనశక్తిని యింతగా కించపరచి, తనమనస్సులో అంతంతగా అల్లకల్లోలం సల్పిన రాజా వెంకటరెడ్డిని బంధించి, చిత్రహింస కావించి చంపాలనుకున్నాడు. అందువల్లనే అవకాశం దొరికినా వెంకటరెడ్డి, యుద్ధంలో చంపవద్దని తన సైనికులకు ఆజ్ఞలొసంగాడు. నిజాం కుయుక్తులను గ్రహించిన తెలుగు వీరుడు, యుద్ధంలో వీరమరణం పొందాలని కృతనిశ్చయుడైనాడు. శత్రువులచేతుల్లో బందీగా మాత్రం కాదల్చుకొనలేదు. కాని అనుకున్న అంచనా వమ్ము అయ్యేలావుంది. సమయం పసిగట్టిన వెంకటరెడ్డి బందీకాకుండా ఆత్మహత్య చేసుకున్న అభిమానవంతుడయ్యాడు.

ఇప్పటికీ తెలంగాణంలో శారద గాండ్రు రాజా వెంకటరెడ్డి సాహసగాథల్ని ఘనంగా గానం చేస్తున్నారు. నేటికీ గ్రామీణ ప్రజలు ఈ వీరుని వీరగాథల్ని పాటలుగా కట్టుకొని, సతతం తమ పెదవుల నిల్పుకొని ఉత్సాహంగా, ఉత్తేజంగా పాడుకుంటున్నారు.

రచయితలకు విజ్ఞప్తి

రాష్ట్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి సంక్షిప్తంగా రచనలు పంపించండి. సుదీర్ఘమైన వ్యాసాలకన్న చిన్న చిన్న వ్యాసాలనే ప్రచురించడానికి ఎక్కువ వీలు వుంటుందని గమనించగలరు.

ప్ర. సం.

జీడికల్లు క్షేత్రము

ఆంధ్రప్రదేశమునగల అనేక పుణ్యక్షేత్రములలో 'జీడికల్లు' అత్యంత ముఖ్యమైనది. ఈ క్షేత్రము హైద్రాబాదు నుండి వరంగల్‌కు పోవు మార్గంలో కల ఆలేరునకు సుమారు పదిమైళ్ల దూరమున కలదు.

పాలకుర్తి సోమనాథుడు, బమ్మెరపోతన జన్మించిన పాలకుర్తి యనియెడి పుణ్యస్థలము దీనికి తూర్పుదిశన ఆరు కోసుల దూరమున నున్నది. పశ్చిమ దిశన శైవ పీఠాధిపతియైన రేణుకాచార్యుల జన్మస్థలమైన 'కొలిపాక' అయిదు క్రోసుల దూరములో, మరియు రెండవ తిరుపతిగా పిలువబడుచున్న యాదగిరి దేవస్థానము ఆరు క్రోసుల దూరములో నున్నది.

పూర్వము మేరువు, మేనకలకు సంతానప్రాప్తి లేక మిగుల దుఃఖార్తులై యుండిరి. త్రిలోకసంచారియైన నారదుడు వారి బాధను గమనించి దండకాటవి యందు కేవలము వాయు భక్షకులై శ్రీమన్నారాయణుని గూర్చి తపమాచరించినచో కోరుకున్నది నెరవేరునని సెలవిచ్చెను. వారు మహర్షి ఉపదేశంబును పాటించినవారై నారాయణుని ప్రసన్నము గావించుకొనుటకై ఆహారపానీయాదుల విసర్జించి కేవలము గాలిని భుజించి అతికఠోరముగా తపస్సును సాగించిరి. వారి తపోదీక్షకు ముల్లోకములు గజగజ వణకినవి.

అప్పుడు ఆర్తత్రాణపరాయణుడైన నారాయణుడు వారి భక్తికి మెచ్చి మేరు మేనకాదేవులయందు ప్రసన్నుడై, వారి ముందు ప్రత్యక్షమై వారికి కావలసిన వరములను కోరుకొనమనెను. 'స్వామీ! మీ పాదసేవా దురంధరుడైన పుత్రుని ప్రసాదింపుడు, అని వారు వేడుకొనిరి.

అట్టి కోరికకు శ్రీమన్నారాయణుడు మిగుల సంతసించి మీ కోరిక అచిరకాలముననే తీరేదుగాక! దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థము నా యంశమున శ్రీరాముడు జన్మించి, మీ తనయునికి కైవల్యప్రాప్తి చేకూర్చును అని అనుగ్రహించెను.

కొంత కాలమునకు వరప్రసాదమున, ఒక శుభదినంబున పుత్రోదయమయ్యెను. అతడు 'వీరుడు' అను నామమున శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుండై, గామభక్తుడై పదహారు సంవత్సరములకే సకల శాస్త్రములందు ప్రవీణుండయ్యెను.

తన శేష జీవితమును రామపాదసేవకు అంకితం బొనర్చు ఉద్దేశముతో మాతాపితృల ఆజ్ఞను పొంది దండకారణ్యము ప్రవేశించి రాముని సాక్షాత్కరించుకొనుటకై, యోగ నిష్ఠాగరిష్ఠుడై వీరుడు తపం బాచరించెను.

శ్రీరాముడరణ్యవాసమున మాయలేడిగా వచ్చిన మారీచుని బాణముతో కొట్టిన సందర్భమున రామాయణంలో

చంచత్కాంచన కంకపత్రము ధను
ర్జ్యావల్లి సంధించి ర
త్నాంచత్పుంఖము గర్ణచుంబితముగా
నాకృష్టి గావించి క్రో
మ్మించుంగీలలు గ్రమ్మనేయ నదియున్
మేనబ్బి 'హా! లక్ష్మణా'
యంచుం గూలె నిజాకృతింబుడమిపై
నయ్యస్త్ర పాతంబునన్

అని యున్నది.

అయితే బ్రహ్మాండ పురాణమందలి గౌతమీ మహాత్మ్యమునందు మరొక విధముగా చెప్పబడినట్లు స్థానిక 'జీడికల్లు' మహాత్మ్యమునందు వర్ణింపబడినది.

కె. వి. హనుమంతరావు

శ్రీరాముడు కోదండ మెక్కుపెట్టి మాయలేడిని గురిచూచి కొట్టగానే, 'శ్రీరామా! యని గంధర్వ రూపముతో పడిపోయినది. రాముని కోపానికి అంతులేదు. అరుణారుణ నేత్రాలతో ప్రళయకాల రుద్రునిలా రెండవ యమ్ము సంధించుకొని దాని దగ్గరకు వెళ్ళాడు.

"ఎవరు నీవు? నీ మాయరూపములు శ్రీరాముని వద్ద సాగవని తెలియదా?" అంటూ గద్దించాడు.

"స్వామీ! నేను చిత్రరథుడను గంధర్వుడను. కౌశిక మహర్షి శాపమువలన లేడి రూపం ధరించాను. ఇప్పుడు మీచేత శాప విముక్తి పొందాను. యిది నా జన్మస్థానము కాబట్టి మిమ్ము యింత దూరం శ్రమపెట్టాను. అనుగ్రహించండి." అంటూ వినమ్రుడై పలికాడు.

చిత్రరథుని ఆంతర్యం గ్రహించిన శ్రీరాముడు 'భక్తా నీకేదైనా వరం ప్రసాదించాలని ఉంది. కోరుకో!" అన్నాడు.

ప్రభూ! నాకు మీ పాదజలంకన్న కావలసినదేముంది? అనగా చుట్టూ పరికించి తన మోకాలు ఆనించి బాణం సంధించిన బండమీదికి వెళ్ళిన బొటనవేలతో అదుముతూ ఉత్తర గంగను ప్రార్థించాడు.

అప్పుడచ్చట ఒక గుంట నీర్పడి దాని నిండ జలం నిండి వున్నది. అని చిత్రరథునిపై వుంచాడు

చిత్రరథుడు సాష్టాంగపడి "స్వామీ ! యీ నీరు ఎప్పటికినీ వూరునట్లు యీ బండకు 'లేడిబండ' యని కలియుగాంతమువరకు పేరు వుండునట్లు వరం ప్రసాదించండి" అని ప్రార్థించాడు.

అదియే లేడిబండ. ఆ బండపై మోకాలు ఆనించగా పడిన గుర్తు. రెండవ కాలిగుర్తు ఇప్పటికినీ స్పష్టముగా గాంచ గలము అందు పుణ్యవంతులు అయినవారు మాత్రమే కొత్త గుడ్డతో అట్టి గుర్తులపై తుడిచిన నీళ్ళు వూరుతుందని ప్రతీతి.

తను ఎక్కడనైతే మోకాలిపై కూర్చొని మాయలేడిని సంహరించాడో ఆ స్థలము పరమ పవిత్రము. ప్రసిద్ధము అయి 'లేడిబండ'గా ఇప్పటికినీ విలసిల్లుచున్నది

మాయామృగ సంహారానంతరము శ్రీరాముడు వెనుదిరిగాడు. ఎక్కడినుండో ఒక వింత ధ్వని వినిపించుచుండగా, దాని దరి చేరుకొన్నాడు

చిత్ర విచిత్రమైన పూదీగలతో తీరు తీరు ఫలవృక్షాలతో పరివేష్టితమై ఒక వెడల్పయిన బండ ఆహ్లాదంగా వుంది. ఆ బండ మధ్యమున ఒక గుండముంది. దాని ప్రక్కన బదరీ వృక్షముక్రింద తలనిండ జడలతో రామనామ తారకం జపిస్తూ తన విగ్రహాన్నే పూజిస్తున్నట్లు కనిపించింది. రాముడు ఆతడు 'వీరముని' అని గ్రహించి ఆతనిముందు నిలిచాడు. వీరముని కళ్ళు తెరచిచూచి తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు. వెంటనే భక్తి ప్రపత్తులతో సాష్టాంగపడి రెండు బదరీ ఫలములను కానుకగా సమర్పించుకొన్నాడు. రాముడు సంతుష్టుడై.

"వీరా ! నీ భక్తికి మెచ్చాను. నీకేమి వరము కావలయునో కోరుకో?" అన్నాడు.

"స్వామీ! నీ పాద సేవ తప్ప నాకు ఇంకేమి కోరిక గలదు? నన్ను అనుగ్రహించు మహానుభావా!" అని ప్రార్థించాడు.

"భక్తాగ్రేసరా! నీ కోరిక ఈడేరుగాక!" అని అక్కడ వున్న తన విగ్రహముకు జీవకళ నాపాదించి, కలియుగారంభము వరకు నీ విచ్చటనే వుండి, నిత్య పూజావిధులు జరిపి, పిదప వైకుంఠమునకు చేరగలవు మరియు జీడితో సమానమైన పాపము లన్నియు ఈ క్షేత్రమున స్నానమాచరించినచో పరిహారమగును. అంతియేగాక ఈ క్షేత్రము యుగ యుగాంతముల వరకు వీరాచల క్షేత్రముగా ప్రసిద్ధి నొందగలదు" అని ఆశీర్వదించి వచ్చినదారి ననుసరించి పర్ణశాల వైపు బయలుదేరాడు.

క్షేత్ర మాహాత్మ్యము

అదియే వీరాచల క్షేత్రం. అది వాడుకలో 'జీడికల్లు' గా మారిన వైనము. అచ్చటి జీడి గుండముల చరిత్ర ప్రసిద్ధమై, మిక్కిలి ఆసక్తిదాయకమై యున్నది.

వంగదేశమును ఏకఛత్రాధిపత్యముగా చంద్రగుప్తుడు పరిపాలించసాగాడు అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నను సంతాన లేమి వలన రాజదంపతులు మిక్కిలి దుఃఖితులైనారు. ఒక నాడు వేటకై బయలుదేరిన మహారాజు దండకారణ్య మధ్య భాగమున కల భృగు మహర్షి ఆశ్రమంచేరి తనబాధను విన్నవించుకొన్నాడు మహర్షి కరుణించి రెండు సంతాన ఫలములను రాణికిచ్చాడు చంద్రగుప్తుడు ఆనందభరితుడై మహర్షిని తమ రాజ్యాన్ని దర్శించ వేడుకొన్నాడు 'రాజా ! నీకు సంతానం కలిగిన తరువాత తప్పక నీ కోరిక తీరుస్తాను, అని నచ్చచెప్పి రాజును రాజ్యానికి పంపించాడు.

చంద్రగుప్తుడు ఆ రెండు సంతాన ఫలములను భార్యయైన సుమతికి ఇవ్వగా ఆమె భుజించగా, సకాలమున ఆడ, మగ శిశువులు కవల పిల్లలుగా కార్తీక పౌర్ణమిన జన్మించారు. లేక లేక కలిగిన సంతానం కాబట్టి 'బాలసారె' మహోత్సవముగా చేయనిశ్చయించి, బంధుమిత్రులను, సామంతరాజులను ఆహ్వానించాడు.

పట్టణమంతయు అలంకరింపబడి మహా కోలాహలముగా యున్నది. భృగుమహర్షి పట్టణమునకు విచ్చేసి తన రాకను తెలియజేశాడు కవల పిల్లలను చూసుకొంటూ మైమరచి ఆనందాంబుధిలో తేలియాడుతున్న మహారాజు, తమ దర్శనార్థమై ఒక ఋషి వచ్చియున్నాడు అని వార్తాహరుడు విన్నవించుకొనగా "యిప్పుడు రావడానికి వీలులేదని చెప్పు" అన్నాడు.

వార్తాహరుని నోటవెంట రాజతిరస్కారము వినిన మహర్షి కోపాన్ని ఆపుకోలేక "ఏ పిల్లను చూసి మిడిసిపడుతున్నావో మరల వచ్చే ఆ పిల్లల పుట్టిన రోజుననే విగతజీవుడవు అగుదువుగాక" అని శపించి వెనుదిరిగి చూడకుండా తన ఆశ్రమం చేరుకొన్నాడు.

పౌర్ణమినాడు పుదయించినవారు అగుటవలన ఆ శిశువులకు బాలచంద్రుడు బాలచంద్రిక అను నామకరణములు గావించి మహాడంబరముగా ఆ వేడుక ముగించాడు రాజు.

వంగదేశ సౌభాగ్యమును చూచిన కాశ్మీర భూపతి భీమసేనునకు ఏవిధంగానైనా ఆ రాజ్యాన్ని ఆక్రమించాలన్న తలంపు కలుగనే కలిగింది.

కాలచక్రం గిర్రున తిరిగి పిల్లల పుట్టినరోజు రానేవచ్చింది. పుట్టినరోజు మహావైభవంగా జరుగుతున్నది. పురజనుల వేడుకలకు, వినోదాలకు అంతేలేదు దేశరక్షణ దళాలుకూడా మత్తుపదార్థములతో కేరింతలు కొడుతున్నారు. చంద్రగుప్తుడు సంతోషంలో అలిసి ఒళ్ళుతెలియని నిద్రలో మునిగియున్నాడు.

అదే అదనుకొని భీమసేనుడు అంతకుముందే కూర్చుకొన్న సామంతరాజుల అండతో మహాభీకరంగా కోటను ముట్టడించాడు ఆ కోలాహలమునకు చంద్రగుప్తుడు మేల్కాంచాడు కాని పరిస్థితి అప్పటికే చేయిదాటిపోయింది ఇదంతా తన అసమర్థత, అజాగ్రత్త వల్లనే కలిగిందన్న ఉక్రోషంతో తన కైజారుతో ఆత్మహత్య చేసుకొన్నాడు పట్టమహిషి సుమతి ఈ అలజడికి మేల్కొని శత్రుముట్టడి ఒకవైపు, భర్తమరణించటం మరొకవైపు చూచి, భరించరాని ఆవేదనతో అదే కైజారుతో పొడుచుకొని తనూ మరణించినది.

పిల్లలు కెవ్వుమన్నారు. మహామంత్రి విగత జీవులైన దంపతులను చూచి, వంశాంకురాన్ని రక్షించ నెంచి, బాలచంద్రుని తీసుకొని రహస్య ద్వారం గుండా తప్పించుకొని తెల్లవారే సరికి వంగ సరిహద్దులను దాటినాడు.

భీమసేనుడు రాజాంతఃపురములో ప్రవేశించి చచ్చిపడున్న రాజదంపతులను చూచి, బాలచంద్రుడు లేకపోవటం గమనించి ఏదో మోసం జరిగిందని గ్రహించాడు. కాని చంద్రుని తలదన్నే బాలచంద్రికను చంపజాలక సంతానము లేముచే తను పెంచదలిచాడు.

మహామంత్రి దండకాటవిలో ఒక దొంగల మురాచేతిలో చిక్కుకొన్నాడు. అతనిని బెదిరించి దొంగల నాయకుడు రాజకళ ఉట్టిపడుతున్న బాలచంద్రుని తీసుకొని మంత్రిని వదిలిపెట్టారు. మరి తన కర్తవ్యం నెరవేరిందన్న సంతోషంతో భీమసేనుని భటులకు పట్టుబడగా, రాజు అతనిని విచారించి, ఫలితం గానక కనుగ్రుడ్లను ఊడబెరికించి కారాగారమున పడద్రోయించాడు.

దొంగల నాయకుని వద్ద బాలచంద్రుడు దిన దిన ప్రవర్ధమానుడై సకలాస్త్రశస్త్రాలలో ఆరితేరినాడు.

బాలచంద్రిక భీమసేనుని పెంపకంలో అల్లారుముద్దుగా ఏ లోటు రాకుండా పెరిగి పెద్దదై యుక్త వయస్కురాలయింది. స్వయంవరం జరుపదలచి సకల దేశాధీశులను ఆహ్వానించాడు.

బాలచంద్రుడు, బాలచంద్రికలకు ఒండొరుల ఉనికి తెలియదు

రాజకుమార్తె స్వయంవరం అని తెలిసి బాలచంద్రుడు తనూ స్వయంవరమునకు హాజరయ్యాడు.

బాలచంద్రిక అప్సరసలను తలదన్నిన అందచందాలతో ప్రకాశిస్తూ, రాయంచను మించిన నడకతో, చెలికత్తెలతో సభా భవనమునకు విచ్చేసి అరమోడ్పు కన్నులతో అందరినీ వీక్షించి, సరాసరి వచ్చి బాలచంద్రుని వరించింది.

రాజులందరు విశ్వేష్టులై ఎవరు నీవు? మీదేదేశం? అని ప్రశ్నించారు "రాజ్యం వీరభోజ్యం" అని బాలచంద్రుడు సమాధానమివ్వగా రాజులందరు ఒకుమ్మడిగా కత్తులు దూసారు. బాలచంద్రుడు అందరినీ ఓడించి ఆ అమ్మాయిని చేపట్టాడు.

సహజ యౌవ్వన మధూహాలతో ఇరువురు శయన మందిరంలోకి అడుగు పెట్టారు. ఒకరి నొకరు చూచుకొని ర్రాన్పడిపోయారు ముఖాలు కృష్ణ పక్ష చంద్రునివలె కళా విహీనంగా మారిపోయాయి. బట్టలు జీడిలో ముంచినటు నల్లగా మారి పోయాయి. ఆ రాత్రి ఏలాగో గడిపిసతరువాత పరిచారికలు వారి ఆకారాలను చూచి దిగ్భ్రాంతులై భీమసేనునికి తెలియజేశారు.

భీమసేనుడు రాజ పౌరోహితులను, జ్యోతిష పండితులను రావించి దంపతుల విషయమై ప్రస్తావించాడు. వారు చెప్పలేక చెప్పలేక బాలచంద్రుడు, బాలచంద్రిక ఏక గర్భ జనితులు కావటాన ఇలా మారారని, వారు పుణ్యక్షేత్రాలు సేవించి, భూ ప్రదక్షిణం చేసి, ఎప్పుడైతే వారి జీడి నలుపు తెల్లనౌతుందో అపుడు వారి పాపపరిహార మవుతుందని సెలవిచ్చారు.

దంపతులు మిగుల దుఃఖించి, పాపపరిహారార్థమై కాశీ. ప్రయాగ, బద్రీనారాయణము, కురుక్షేత్రము, సాలగ్రామము, హరిద్వారము, మధుర, బృందావనము, అయోధ్య, నైమిశారణ్యము, చిత్రకూటము, అవంతీ, గోవర్ధనము, పంచవటి, పాండురంగము, అహోబిలము, ధర్మపురి, తిరుపతి, కంచి, ఘటకాచలము, కుంభకోణము, శ్రీరంగము ధర్భశయనము, మంగళగిరి, భద్రాద్రి మొదలుకొని అన్ని దివ్యక్షేత్రములను దర్శించి తిరిగి వేసారి చివరకు వీరాచల క్షేత్రమునకు చేరారు.

ఎన్ని పుణ్యక్షేత్రాలు సేవించినా, తమ పాప పరిహారం కాలేదని, వీరాచల బండ మధ్య కూర్చొని కంటికి, మింటికి ఏకధారగా దుఃఖించసాగారు. వారిపై శ్రీరామ చంద్రుడు కరుణించాడు. శ్రీరామచంద్రుని అనుగ్రహం వల్ల వారి జీడిబట్టలు, వారికంటిన పాపము పటాపంచలై రెండు గుండములుగా మారిపోయినవి.

వారు మిన్నుముట్టిన సంతోషముతో ఆ గుండములలో స్నానం చేసి, స్వామి సన్నిధిలో వున్న గుండమున స్నానమాచరించి, తమవద్ద నున్న సొమ్ముతో ఆలయమును నిర్మింపనెంచి, పెద్ద పెద్ద స్తంభములను నిలిపారు తదుపరి నిష్ఠాగరిష్ఠులై స్వామి సాన్నిధ్యంకోసం ప్రార్థించసాగారు.

శ్రీరామచంద్రుడు బాలచంద్రుని స్వప్నము నందుకనిపించి, భక్తాగ్రేసరా! నీకు, నీ సోదరికి పాప విముక్తియైనది. మీరు సుఖంగా మీకు తగిన వధూవరులను పొంది వివాహమాడి జనరంజకముగా రాజ్యపాలన మొనర్చండి' అని ఆశీర్వదించాడు.

'స్వామీ! యిప్పటికే మాకు తొంబది అయిదు సంవత్సరములు నిండుకొన్నవి. మాకు ఇప్పుడు వివాహ ప్రసక్తి అనవసరము మాకు నీ సన్నిధానమే శరణ్యము.' అని వేడుకొన్నాడు.

'సరే అట్లే అగుగాక! కానీ నాకు ఆలయ ప్రయత్నము చేయుచున్నావు. నాకా అవసరం లేదు. ఆకాశమే నాకు గాలి గోపురం. యీ బండయే నాకు సరియైన మంటపము. సూర్యచంద్రులే నాకు అఖండ జ్యోతులు. నక్షత్రములే నాకు వజ్రవైఢూర్యములు పొదిగిన కిరీటము. పరిసర వృక్షములనుండి వీచే గాలే నాకు వింజామరలు నేను దివారాత్రములు సమస్త ప్రాణులకు దర్శన మీయదలిచాను ఏ భక్తులు యీ మూడు గుండములలో స్నానమాచరించి నన్ను పూజింతురో వారి పాపములు పరిహారమై స్వర్గలోక మలంకరించెదరు' అని చెప్పి అదృశ్యుడయినాడు.

అందులకే ఇక్కడ రామునికి గుడి గోపురములు లేవు. శిల్ప చిత్రములు లేవు. భక్తియే ప్రధానము. అందరూ సకల కాలముల యందునూ చరిత్ర ప్రసిద్ధమైన ఈ దివ్యక్షేత్రమును దర్శించి శ్రీరాముని దివ్యమహిమకు పాత్రులు కాగలుగుచున్నారు.

ఆ తరువాత బాలచంద్రుడు, బాలచంద్రిక మూడు గుండములలో స్నానమాచరించి స్వామి సన్నిధానమున కిరువైపుల కూర్చుండి ధ్యాన నిమగ్నులై పోయారు. వారిలో నుంచి రెండు అఖండ

(తరువాయి 60 వ పుటలో)

కథానిక:

రైతుబిడ్డ

కొసనం మహేశ్వరరావు

పచ్చని పైరులు తలలూపుతూ సంగీత సాధన చేస్తున్నట్లున్నాయి. పవనుడు శృతి కలుపుతున్నాడు. బాలభానుడు లోక సంచారానికి బయలుదేరడానికి సన్నాహాలు చేస్తున్నట్లున్నాడు. చిన్న మబ్బులు పెద్ద మబ్బులు భేదభావం లేనట్లు వళ్లు మరచి ఆడుకుంటున్నాయి. అత్యంత మనోహరమైన, అతి రమణీయమైన ఆ సుందర సుప్రభాతానికి స్వాగత గీతాలు పాడుతున్న పక్షులు నృత్యం కూడా చేస్తున్నాయి. ఆడుకోవడానికి స్వేచ్ఛ లభించినట్లు తల్లి ఒడిలోంచి చెంగుచెంగున దూకిపోతున్నట్లు, మధుర మంజుల కమనీయ సుధాధారలు కదలినట్లు, ఏ అపూర్వ శాస్త్రజ్ఞుడో రూపొందించిన చిరు అందెల నుండి తేనె సోనలలా జాలువారిన సంగీతం వినిపిస్తున్నట్లు పిల్లకాలువలు ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

వెలుగు క్రమంగా చిక్కనవుతున్నది అప్పటికే ఊరు ఊరంతా మేల్కొన్నది. ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. గ్రామ వైతాళికులయిన కోళ్ళు ఇంకా మేలుకొలుపు ఆలాపిస్తూనే ఉన్నాయి.

రామయ్య వేపపుల్ల బుగ్గన పెట్టుకొని ఆలోచిస్తున్నాడు. ఒకప్పుడయితే ప్రకృతి అందాలనుచూసి ఆనందించేవాడే; ఆ అందాలకు వన్నె దెచ్చు వర్ణనలను కూడా ఆలోచించేవాడే. రాబోయే పంట గురించి అంచనా వేసేవాడు. ఇంకా మరింత పండించడానికి పథకాలు ఆలోచించేవాడు. గడ్డి మొలవని భూమిని సేవించి బంగారం పండిస్తున్నాడు. 'రైతు బిడ్డంటే రామయ్యే' అని నలుగురూ చెప్పుకొనేట్లు చేశాడు. తనకంటే గొప్పవాడు కావాలి తన కొడుకు అనుకొన్న రామయ్య అంచనా తారుమారయింది. అందుకే అతనికి వేదన. వేదనకన్న మించినదేదో అతని గుండెలను తొలచేస్తున్నట్లు బాధపడుతున్నాడు. అనేకసార్లు పొలంగట్టున కూర్చుని కన్నీరు పెట్టుకున్నాడు. అంతటి తన మనోవేదనను కొడుకు సూర్యం అర్థం చేసుకోవడంలేదు. తన ఆశయం చెప్పాడు; అందుకే నిన్ను చదివించానురా బాబూ...అని వివరించాడు. కనీసం నేను బ్రతికి ఉన్నన్నాళ్ళయినా నే చెప్పినట్లు విను, తరువాత నీ ఇష్టం అని ప్రాధేయపడ్డాడు.

'నీ కంటే గొప్ప చదువు చదివిన నేను నీ మాట వినడమేమిటి? నీ అంత ఎదిగిన నాకు భవిష్యత్తును గురించి ఆలోచించగల మేధస్సు లేదా? నన్ను వట్టి దద్దమ్మను చేస్తున్నావు......' అన్న కొడుకు నిర్లక్ష్యభావం, అహంకారం రామయ్య గుండెలను దహించి వేస్తున్నాయి.

అర్ధాంగి సీతకే తన ఆలోచనలు నచ్చలేదు; తన మనసు అర్థం కాలేదు. ఆమె కూడా కొడుకునే సమర్థిస్తూంటుంది. ఒక్కగానొక్క కొడుకు అనే వాత్సల్యమూ ఉండవచ్చును. తనకు మాత్రం లేదా. ప్రాణంతో సమానంగా అభిమానిస్తాడు. అంత అభిమానంతోనూ ఈగను కూడా వాలనిచ్చేవాడుకాదు; అలా పెంచుకొచ్చాడు; అలా అన్ని సౌకర్యాలు కలుగజేస్తూవచ్చాడు చదివించకుండా ఉన్నట్లయితే అలా చేసేవాడా...ఛ ఇవేం ఆలోచనలు... అనుకొనేవాడు అప్పుడప్పుడు.

బంగారు కలలతోనే కొడుకును ప్రత్యేకించి వ్యవసాయం చదివించాడు. మొదట్లో తన మాటలకు అవుననేవాడు. రాను రాను పట్నవాసపు నాజూకుతనం, పై పై మెరుగులు, ఉద్యోగంపై మోజు ఇవన్నీ పెరుగుతూ రావడం గమనించి అప్పుడప్పుడూ హెచ్చరించాడు "నీ కాళ్ళమీద నీవు నిలబడి నలుగురికి బ్రతుకు తెరువు చూపించగలవు సూర్యం, నీకివేం ఆలోచనలురా బాబూ... ఉద్యోగం చేయాలిటరా నువ్వు..." అని రామయ్య అన్నప్పుడు కొడుకు 'అవును' అన్నట్లు తలూపేవాడు. అదంతా తనకు భయపడి పైకి అలా కనిపించేవాడని తెలిసినప్పుడు రామయ్య హతాశుడే అయాడు.

ఉద్యోగపు కాగితం, పట్ట తెలియని సంతోషంతో తల్లికి చూపించి ఏదో స్వర్గం దొరికినంత సంబరపడిపోతున్న కొడుకునీ, అంత ఆనందాన్నీ వ్యక్తపరుస్తున్న భార్యనీ చూసిన రామయ్య వణికిపోయాడు. ఏదో దౌర్భాగ్యం దాపురించినట్లు, ఏదో శని గహ్వరంలోకి ఈడ్చుకపోబోతున్నట్లు నరకయాతనే అనుభవించాడు. కళ్ళలో నీరు తిరిగింది. తల్లీ కొడుకులు అవి కన్నీరుకాదు, ఆనందబాష్పాలని భ్రమించారు మొదట. కానీ అవి విషాద ధారలని తెలిసీ ఆశ్చర్యపోయారు. 'శుభమా అని కొడుక్కి సర్కారీ పని వస్తే అదేవిటో...' భార్య సీత బుగ్గలు నొక్కుకుంది. 'సంతోషించాలి గానీ...మీదంతా చోద్యంగా వుంది...మా బంగారు తండ్రి ఎంతో గొప్పవాడవుతాడు...' సూర్యాన్ని దగ్గరకు తీసుకొని నుదుటిమీద ముద్దెట్టుకొని తల నిమిరింది.

'సుతరామూ వల్లకాదంటే కాదు...' రామయ్య గర్జించాడు.

నాలుగురోజులపాటు ఎవరికీ తిండీ తిప్పలూ సరిగాలేవు. 'నా మాట వినకపోతే ఈ ఆస్థి అంతా పంచిపెట్టేస్తాను...' అన్న రామయ్య చివరికి 'ఏమయినా చావండి మీ ఇష్టం...మధ్యలో నేనెవరిని...నా ఆశయాలు, నా అభిప్రాయాలు, నా ఆశలు నాతోనే చస్తాయి...మీకెందుకు అర్థం అవుతాయి...అయినా మీరెందుకు అర్థం చేసుకోవాలి...నాదంతా భ్రమ...ఎవరి ఇష్టం వాళ్ళది... కాలం అలా వుంది' వచ్చే దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ

ఎలాగో అనగలిగాడు పులిలా ఉండే రామయ్య మానసికంగానూ, శారీరికంగానూ రోజు రోజుకూ దిగజారిపోతూ వస్తున్నాడు. గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు

రామయ్య ముందు నాలుగైదు కాకులు చేరి పోట్లాడుకుంటూంటే జ్ఞాపకాల, ఆశయాల తలపులకు అంతరాయం కలిగింది. చిన్నరాయి తీసుకొని, వాటిపైకి విసిరాడు. భయంభయంగా ఎగిరిపోయాయి. ధైర్యంగల ఒక కాకి పడిఉన్న మాంసపు ముక్కను నోటకరచుకొని తారాజువ్వలా దూసుకుపోయింది. మిగిలిన కాకులు దానివెనుక పడ్డాయి ఒక కాకి కాలిగోరు రామయ్య చెంపను గీరింది. రామయ్య చెంపను తడిమాడు చేతికి రక్తం అంటింది. ఎంత మలకనయాను...అనుకున్నాడు తనవారే తనను చులకన చేస్తున్నప్పుడు ఎవరికో లెక్కేమిటి అనుకున్నాడు.

ఊరిలో రామయ్య పెద్దగా చలామణీ అవుతున్నాడు. ఎంత పెద్ద తగాదానయినా సులువుగా తీర్చిపంపేవాడు. అందరూ ఎంతగానో గౌరవిస్తారు. ఈ మధ్య తీర్పుకోసం వచ్చేవాళ్ళకు అవకాశమే ఇవ్వడంలేదు. ఊపిరి సలపని పనులున్నట్లు ఏ పని లేకపోయినా తప్పించుకొంటూ వస్తున్నాడు. ఊర్లో చాలామంది రామయ్యలో కనిపిస్తున్న మార్పును గమనించారు. కొందరు ఉండబట్టలేక అడిగితే నవ్వి ఊరుకొనేవాడు. ఏదో పరాజయం కలిగినట్లు, ఏదో పోగొట్టుకున్నట్లు, శూన్యంలో దేనికోసమో వెదుకుతున్నట్లు, ఎప్పుడూ పరధ్యానంగా ఉంటున్న రామయ్య ధోరణి భార్యకే సరిగా అర్థం కాలేదు. అర్థంకాక అమాయకంగా ఆమె అడిగితే ఏమీ చెప్పేవాడు కాదు. మరీ రెట్టించి అడిగితే 'చెప్పినా అర్థం చేసుకోలేవు ... తెలుసుకొని ఏమిచేస్తావు ... నా మాటలు చాదస్తాలుగా అనిపిస్తాయి ...' అనేవాడు.

'వయసు పైబడుతున్నకొద్దీ...మరీ ఇదవుతున్నారు ... ఏదన్న మందు తీసుకోండి' భార్య అన్నప్పుడు ఒక నిశ్వాసాన్ని మాత్రం విడిచి ఊరుకొనేవాడు.

తన తెలివితేటలకు ఊరిలో అందరికన్నా ఆశ్చర్యపడే భార్య, కొడుకు విషయంలో తనకు ఎదురు నిలిచింది. కొడుకు ఆఫీసరు కావాలి...పెద్ద ఉద్యోగి కావాలి...అని ఆమె ఆరాటం.

'తన కొడుకు గొప్ప రైతుబిడ్డ కావాలి...స్వతంత్రంగా బ్రతకాలి' తన ఉద్దేశ్యం. పోనీలే అని సరిపెట్టుకోలేకపోతున్నాడు. మనసును ఎంత సమాధానపెట్టుకుందా మనుకున్నా కుదరటంలేదు. స్వాతంత్రోద్యమంలో అనేక కష్టనష్టాల కోర్చి, ఎంతో త్యాగం చేసిన రామయ్య మనసు స్వయంశక్తిపై ఎక్కువ విశ్వాసాన్ని పుంజుకొంది. తన విశ్వాసం మీద, తన ఆదర్శం మీద, తన ఊహాసౌధం మీద పిడుగుపాటు అయింది. నిలువునా కుంగదీసింది ఇక కోలుకోగలడో లేదో నన్నంత మార్పును అతనిలో చూచినప్పుడు నిజంగా బాధే కలుగుతుంది.

అప్పటికే సూర్యుడు చుర్రుమనిపిస్తున్నాడు. పందుంపుల్ల ఇంకా రామయ్య నోట్లో నలుగుతూనే ఉంది. 'తాతా! మామ్మ రమ్మంటున్నది భోజనానికి...' ఏవరో కుర్రవాడు పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పి జవాబుకోసమయినా చూడకుండా తిరిగి వెళ్ళిపోయాడు లేచినుంచుని ఒడలువిరుచుకున్నాడు. పిల్లకాలువలో మోహం కడుక్కున్నాడు. పొలాన్ని కలయజూశాడు. తెల్లకంకి, తప్పకంకి కనబడుతున్నాయి పాలేరు, ఇరుగుపొరుగు రైతులుకూడా ఆ మాటే అన్నారు. ఇంకొకప్పుడయితే తీరని అపమానంగా భావించేవాడు ... తనలాగే నేలతల్లి నిరాశతో కుమిలిపోతున్నది గాబోలు అని గొణుక్కున్నాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటికి వెళ్ళాడు. భార్య ఎదురు చూస్తున్నది. 'బారెడు పొద్దెక్కింది ... ఏదయినా పని చేయిస్తున్నారా పొలంలో...' అనడిగింది. రామయ్య ఏమీ మాట్లాడలేదు, నవ్వనూలేదు. అసలు వినపడనట్లే వెళ్ళి వాలుకుర్చీలో కూర్చున్నాడు.

'ఏమిటో ఇలా అయిపోతున్నారు...' సీత బాధగా అనుకున్నాది.

భోజనం చేస్తూండగా 'అబ్బాయిని చూడాలనిపిస్తున్నదండీ...' భార్య అన్నది.

'అయితే ఏమంటావు...' కొరాకొరా చూశాడు రామయ్య'

'వాడి ఊసెత్తితేనే అంత ఇదయిపోతారేమండీ ...?' సీతకు కంటినీరు తిరిగినంత పనయింది.

'అవును మగ, కొడుకు కాదూ ... అందుకని ...' కస్సుమన్నాడు.

'ఒక్కగానొక్క బిడ్డ...' ఈసారి అతిప్రయత్నం మీద గుడ్లనీరు కుక్కుకుంది. 'ఏదో చిన్నతనం ... నాలుగు రోజులు పోతే అన్నీ అవే సర్దుకుపోతాయి...'

'హుఁ అలాగే...సరేలే...' రామయ్య బుసకొట్టినట్లన్నాడు.

భోజనం వదిలిపెట్టి ఎక్కడ లేచి వెళ్తారోనని భోజనం పూర్తయేవరకు ఊరుకుంది సీత. భోజనం అయినాక 'ఏమండీ...' దీనాతిదీనంగా ఉందా సంబోధన.

'కోపం తెచ్చుకోనంటే ఒక మాట...'అస్పష్టంగా అన్నది. భర్త దగ్గరనుంచి ఏమీ జవాబు రాకపోయేసరికి 'అబ్బాయి కూడా వ్రాశాడుగా ... మనలను పట్నం రమ్మని...' భయం భయంగానే అన్నది.

'అయితే వెళ్ళు ... నేనొద్దన్నానా?' ఖంగున మ్రోగింది కరం.

'అదేమిటండీ ... మనమా పెద్దోళ్ళమయామా ...' భర్త మోహంలోకి చూస్తూ అన్నది...'పొలంపనీ అదీ ఎందాక చూడగలరు ...'

'అందుకని ... ఏమిటి చెప్పేది సూటిగా చెప్పు' త్రాచులా లేశాడు.

నీళ్ళు నమిలింది సీత. ఎన్నాళ్ళనుండో చెప్పాలని ప్రయత్నం...కానీ చెప్పలేకపోతున్నది. కృష్ణా, రామా అను

కుంటూ కొడుకు దగ్గర ఈ వృద్ధాప్యం గడిచిపోతే అంతకంటే ఏమికావాలి అని ఆమె ఆరాటం, కోర్కె. ఇవాళ ఆ మాటే ఎలాగయినా చెప్పేయాల్సిందే అనుకున్నది కానీ ధైర్యం చాలటం లేదు...భర్త మనస్తత్వం, ఆదర్శం తెలిసీ ఎలా చెప్పేది... కొడుకు ఆఫీసరు...పట్నంలో సకల సుఖాలు...ఆఫీసరుగా ఉన్న కొడుకు గొప్పదనం చూడాలి...గొప్పదనంలోని అనుభూతి ఎలా ఉంటుందో...ఆమె మనస్సు కొడుకువైపుకే ఆకర్షింపబడుతున్నది

'అబ్బాయి దగ్గరకెళ్ళి ఉందాం...కొన్నాళ్ళపాటు...... మాట పూర్తికాకముందే 'ఇక్కడ పనులెవరు చూస్తారు......' రామయ్య గద్దించాడు 'కట్టుబడి కిచ్చేయండి......' అమె మాటనోటోనే అణిగిపోయింది; చెంప చెళ్ళుమంది భర్త చేయిచేసుకోవడం తనమీద ఇదే మొదలు రామయ్య పళ్ళు పటపటా కొరికాడు 'చివరికి ఛలాంటి ఆలోచనలు వస్తున్నాయి...నీకుకూడా...... ఇలాంటి మాటలు వినకముందే నేను చచ్చిపోయినా బావుండేది... భగవంతుడా ఏమిటీ శిక్ష...?"

ఏడుస్తూ కూర్చొంది సీత ఏడుపువస్తున్నా మగవాడు కాబట్టి అతి ప్రయత్నంమీద ఆపుకొంటూ కళ్ళు మూసుకున్నాడు రామయ్య

స్వాతంత్రం రాకముందు దేశ దౌర్భాగ్యానికి, దుస్థితికి, జాతి వికసించకపోవడానికి అదే కారణమనుకున్నాం. స్వతంత్రం వచ్చి రెండున్నర దశాబ్దాలయినా మానసిక పరివర్తన రాలేదు... నైతిక విలువలు పెరుగలేదు...అవినీతి పోటీపడి పెరిగిపోతున్నది ...జాతిలో ఐక్యతలేదు...ఎటుచూసినా రాజకీయ ప్రయోజనాలు ప్రధానంగా నిలబడి అసలు సమస్యలను మరింత వికృతం చేస్తున్నాయి మనిషికన్న, జాతికన్న, దేశంకన్న స్వప్రయోజనాలు ప్రధానం అవుతున్నాయి???...... ఒకరి మేలును ఒకరు కోరుకొనేబదులు, తన స్వార్థంకోసం, తనకు లభించాలనుకున్న ఎండమావులవంటి తాత్కాలిక సుఖాలకోసం, ఎదుటివారేమయినా, తన పరిసరాలు నాశనమవుతున్నా, దేశం బలహీన పడుతున్నా ఏమీ పట్టించుకోని మనస్తత్వం ఎక్కడిది ?......గాంధీ కలలుకన్న గ్రామ రాజ్యం, రామరాజ్యమేనా ఇది???? ప్రతివారి దృష్టి పట్టణాలమీదే...తర తరాలుగా వస్తున్న భూమాతను, తర తరాలుగా ఆ భూమాత పాలు త్రాగి పెరిగిన శరీరాలు ఏవేవో సుఖాలనాశించి ఆ తల్లిని కాలదన్ని, ఎంతో తెలివిగల పని చేసినట్లు భుజాలు ఎగురవేసుకొనే దుస్థితి......... వంశ పారంపర్యంగా తమను పోషిస్తూ వచ్చిన కుటీర పరిశ్రమలను తృణీకరించి అవహేళన చేసే స్థితి ఎక్కడిది? ఆ పరిశ్రమకు మరింత పుష్టి చేకూర్చి అభివృద్ధికి తీసుకురావాలనే మనస్తత్వం ఏది? ఎందుకు కలుగడంలేదు? ...... భిక్షగానిలా పరాయి దేశాల సహాయంకోసం తహ తహలాడి, వాళ్ళ తిండి గింజలు లేనిదే బ్రతకలేమేమో అనే స్థితి ఇన్ని సంవత్సరాల స్వతంత్ర దేశానికి పట్టిన దుర్గతి ఈ విషవలయాన్ని ఛేదించాలనే ఆలోచనలేదే...... చేయగల, చేసి చూపించగల, చేసి చూపించి ఫలితం సాధించగల పట్టుదల, దీక్ష లేనప్పుడు దేశ పౌరునిగా ఉండే స్థానం ఏమిటి...... వందకోట్ల చేతులున్నాయి ...... పనిలేదు. పని చూపించమని ప్రభుత్వయంత్రాంగం వైపు, నాయకులవైపు వెర్రిగా, ఆశగా చూస్తూ ఎంతో కాలాన్ని వృధా చేస్తూపోయే బదులు తమంత తాము ఏదో చేయాలని ఎందుకు ఆలోచించరు?... ఒకవేళ అలా ఆలోచన చేసినా కొందరికి తగిన అవకాశాలు ఉండవు ... తండ్రి చేసిన పనినే కొడుకు చేయడానికి చదువు—అందువల్ల ఏదో తన వ్యక్తిత్వం పెరిగిందనుకొనే తత్త్వం అడ్డొస్తున్నది......... రామయ్య మనసు ఈ విధంగా ఆలోచిస్తున్నది. పోస్టుమాన్ రావడంతో ఆలోచనలు ఆగిపోయాయి. సీత పైట కొంగుతో మొహం తుడుచుకొని పోస్టుమాన్ ఇచ్చిన కవరు చించింది కొడుకునుంచి వచ్చిందని తెలియడంతో ఆమె మోములో అప్పటివరకు క్రమ్ముకున్న నీడలు కాస్త తొలిగాయి ఉత్తరం చదుతూ మధ్య మధ్య భర్తవైపు అనుమానంగాను, ఆశ్చర్యంగాను చూసింది 'అబ్బాయి వ్రాశాడండీ ఉత్తరం......' ఆమె చదివాక భర్తకివ్వబోయింది రామయ్య అలాగే చూస్తూండిపోయాడు... ఉత్తరంకూడా తీసుకోలేదు. ఉత్తరంతో పాటు ఏదో ప్రతిక వచ్చింది.

'క్రిందటి ఉత్తరంలో వ్రాశాడు గదండీ డబ్బు పంపమని ...పంపలేదా...సీత సంకోచిస్తూ అన్నది.

'మన కొడుకు చాలా గొప్పవాడు......వాడికి నేను డబ్బు పంపడమా...పెద్ద ఉద్యోగి...ఆఫీసరు...చూడు గొప్పదనం ...' వెటకారంగా అన్నాడు రామయ్య.

'పాపం చిట్టి నాన్న ఎంత ఇబ్బంది పడిపోతున్నాడో...'

'అన్నొందలు వస్తున్నాయి... ఏమవుతున్నట్లు... మనకు ఎంత ఖర్చు అవుతున్నది ... కాస్త ఆలోచించావా...... నెత్తికెక్కించుకునే ఇట్లా తయారుచేశావు ......'

'మనకేం తక్కువండి ... ఉన్నదొక్కడూ......సుఖంగా ఉంటే అంతేచాలు ...' ఎప్పుడూ ఖర్చు పెడతాడా ఏమిటి...... వయసులో ఉన్నవాడు...ఉత్తరంతోపాటు ఏదో పుస్తకంకూడా వచ్చింది...... భర్త ఒడిలో ఉంచింది; ఉత్తరాన్నీ పుస్తకాన్నీ.

'ఉఁ... మా చెప్పావులేగానీ నోరు మూస్తావా లేదా.... ' ఉరిమినట్లు అన్నాడు యధాలాపంగా ఒడిలోని పుస్తకాన్ని తిరిగేశాడు అందులో కొడుకు పేరు కనపడింది. మనసులో ఏదో కుతూహలం రేగింది సరిగా కుర్చున్నాడు సర్దుకుని 'నిరుద్యోగ సమస్య పరిష్కారమయ్యేదెలా ?......' శీర్షికను చదివిన తరువాత మరింత ఉత్కంఠ కలిగింది. ఏక బిగువున వ్యాసం ఆసాంతం చదివాడు. అన్నీ తన భావాలే అలా వ్రాయగలిగినవాడు మరి ఎందుకు ఆచరించలేకుండా ఉన్నాడు—అనే ప్రశ్న కలిగింది. ఇదంతా ఎక్కువగా నాయకులు అనుసరించే పద్ధతిలా అనిపించింది. ఆచరించలేనివాడు ఎందుకు చెప్పాలి...... ఆచరించ గలిగేట్లయితే తన కొడుకు ఒక్క క్షణం ఉద్యోగంలో ఉండడు రెక్కలు కట్టుకుని తన స్వయం కృషిలో లీనం కావాలి చెప్పేది ఒకటి, చేసేది మరొకటి అయితే ఇది మరింత ప్రమాదకరమైన స్థితి—అనిపించింది రామయ్యకు, ఒకవేళ కొడుకు మనసు నిజంగా మారిందేమో? ఒకసారి చూడాలి... నిజంగానే మారేదేమో...... నిజంగానే మారితే అంతకంటే కావలసిందేముంటుంది...... 'మనబ్బాయిలో

చాలా మార్పు వచ్చినట్లుందేవ్ సీతా.... చూడు ఏం వ్రాశాడో .. తండ్రికి తగ్గ కొడుకు....... భర్త మాటలకు సీత ఆశ్చర్య పోయింది...... ఉన్మాద లక్షణాలు కాదు గద అన్న తలపు కలుగక పోలేదు నోరు తెరచి అలాగే చూస్తూండిపోయింది మీరనేదేమిటన్నట్లు సీత

బయట బండిచప్పుడయింది తమ ఇంటిముందే ఆగింది ఎవరా అని సీత బయటకు వెళ్ళి చూసింది 'అరే......నీవా...... ఏమండోయ్ అబ్బాయండీ...అబ్బాయి వచ్చాడు............... ఇంతకు ముందే నీ ఉత్తరం వచ్చింది......మాట మాత్రంగా నైనా రాయలేదే......' ఆశ్చర్యపోతూ ఆనందం పట్టలేక అన్నది.

కొడుకు వెనకనే ఒక అమ్మాయి దిగడంతో ఆమె ఆశ్చ ర్యానికి అవధులు లేకపోయాయి ఎవరన్నట్లు చూసింది సూర్యం సిగ్గుపడినట్లు బుర్ర వంచేసుకున్నాడు ఆమె మాత్రం సీతకు వంగి కాళ్ళ నద్దుకుంది ఎంత బావుంది అమ్మాయి...అనుకుని 'లోపలికి పదండి......'అంది. సీత

'ఈమె నా స్నేహితురాలు లక్ష్మి......అమ్మా......' సూర్యం తడబడుతూ చెప్పాడు

రామయ్య కూర్చున్న కుర్చీనుంచి లేవనేలేదు. కళ్ళు మూసుకుని ఏమీ ఎరగనట్లు తెలియనట్లు కూర్చుండిపోయాడు

'అమ్మా......నాన్న ఏరి......పొలం వెళ్ళారా......' కొడుకు అడుగుతున్నాడు తల్లిని. 'ఇక్కడే ఉన్నానురా బాబూ...' అని అందామనుకున్నాడు లేచి ఎదురెళదామనుకు న్నాడు. బలవంతంమీద ఏమీ చేయలేదు; మనసును సమాధాన పెట్టాడు

'లేదు......ఇంట్లోనే ఉన్నారు......' సీత అన్నది.

క్షణాల్లో తన దగ్గరకొస్తారు మనసు పరి పరి విధాల ఆలో చిస్తున్నది మనసు మారిందేమో......ఏమో......తెలుస్తుం దిగా......ఈ అమ్మాయి ఎవరు? ఎప్పుడూ ఇలాంటి పనిచేయని వాడు ఇప్పుడు వెంట ఎందుకు తీసుకువచ్చినట్లు......'నాన్నా... నాన్నా......నిదురపోతున్నట్లున్నారమ్మా......' కొడుకు దగ్గ రగా వచ్చి రెండడుగులు వెనక్కు వేశాడు రామయ్య కళ్లు మరింత గట్టిగా మూసుకున్నాడు

'స్నానాలు అవీ కానియండి......వంట చేస్తాను......' సీత వంట ఇంటివైపు దారితీసింది ఆమె వెనుకే లక్ష్మి కదలింది 'అన్నట్లు మరచేను......లక్ష్మి......ఇదిగోనమ్మా ఈ గదిలో నీ సామాను పెట్టుకో...' అని సీత ఒక గదిలోకి తీసికెళ్ళింది. 'తరువాత సర్దుకుంటాలెండి......మీకు కాస్త సాయం చేయనీ. యండి...' అని లక్ష్మి అన్నది

'భలేదానివమ్మా......నీచేత పనిచేయించటమా......అతి థులచేత పనిచేయించకూడదు......'

'పరాయిదాన్ని కానులేండి......' అని లక్ష్మి పెదవి కరుసుకుంది సీత 'అవును పరాయిదానివని ఎవరన్నారు...... పరాయిదానివి కాకుండా మా ఇంట్లోనే అచ్చంగా ఉండి పోకూడదూ...అంతకంటే కావలసింది ... ఏముంటుంది ...' మనసులో కోడలిని ఊహించుకొని అంటున్నది.

'పెళ్ళి చేసుకోమని చిలక్కి చెప్పినట్లు చెప్పాం...... ఎప్పటికప్పుడు టలాయిస్తూ వస్తున్నాడు తొందరేముందంటూ... ఆ దేవుడు ఎప్పుడు రాసిపెట్టాడో...' సీత తన ధోరణిలో చెప్పుకుపోతున్నది

రామయ్య ఏమేమో ఆలోచిస్తూ నిజంగానే నిద్రపోయాడు. మెలకువ వచ్చేసరికి పొద్దువాలుతూన్నది ఆవళించి ఒళ్లు విరుచు కుని కూర్చున్నాడు

పక్కనే పడుకుని ఆలోచిస్తున్న సీత భర్త మేలుకుని కూర్చోపెడంతో ఆమెకూడా కూర్చుంది

'అబ్బాయి వచ్చాడండీ......'

'ఉహూం......ఎందుకు వచ్చాడట?......'

'అదేమిటండీ పాపం వాడు వస్తే.....

'పాపం......అదే ఎందుకు వచ్చాడు...ఏమి పనిమీద వచ్చాడు......డబ్బు పంపలేదని......ఆస్తి పంపకానికి వచ్చా డేమో......'

'అవేం మాటలండీ...ఎవరన్నా వింటె నవ్విపోతారు...

'ఎవరో నవ్వుకుంటారని నాకేమీ బాధలేదు......అయితే ఎందుకొచ్చాడంటావ్...అడిగావా?...'

'అడగలేదు...' నిజంగా ఎందుకనో ఆమెకి అడిగితే బావుండుననిపించింది నిజంగా భర్త అన్నట్లు తెగతెంపులు చేసు కోవడానికి గానీ రాలేదు కదా. డబ్బు పంపలేదని కోపం వచ్చిం దేమో......ఏమో మరి? అయితే ఆ అమ్మాయి ఎవరు? స్నేహితురాలన్నాడు.

ఇంతలో భర్త అడగనే అడిగాడు 'ఒక్కడే వచ్చాడా, ఇంకెవరైనా ఉన్నారా???' ఏమీ తెలియనట్లు అడిగాడు.

ఎవరో లక్ష్మిట......స్నేహితురాలన్నాడు.....

అదీ వ్యవహారం......వీడు ఎంతకు తెగించాడు...... చూశావా......మనం బ్రతికి ఉండగానే......

'ఇంతకీ ఏమంటారు......' అర్థం కానట్లు అమాయి కంగా అడిగింది

'వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు కాబోలు......ఇంతకీ వాళ్ళేరీ......'

'ప్రేమా......అంటే పెళ్ళిచేసుకుంటారన్నమాట...... ఎంత బావుందండీ......పేరుకు తగ్గ అందం......నిజమే నంటారా......మన పొలంకేసి వెళ్ళారు......మరి కులం...... ఏమిటో, సంప్రదాయం ఏమిటో వంశం ఎలాంటిదో......' సీత అన్నది.

'వాళ్ళకు నచ్చినప్పుడు అవన్నీ మనకెందుకు గానీ...... నాదొకటే షరతు...నేను చెప్పినట్లు వింటే వాడు చెప్పినట్లు వింటాను...' రామయ్య అన్నాడు.

'ఏమిటండీ......అది? ఎవరమ్మాయో ఏమిటో తెలుసుకోకుండానే......' సీత అన్నది.

'అవన్నీ నాకు అనవసరం......వాళ్లు ఇద్దరూ ఇష్టపడినప్పుడు మధ్య మనకేమిటి......వాళ్ళ సుఖమేగా మనకూ కావలసింది......కాలంతో పాటు మంచి అనుకున్నప్పుడు మనమూ అంగీకరించాలి......' రామయ్య అన్నాడు.

'నలుగురినోట్లో నానిమటండీ...వేరేవిధంగా జరిగితే... ఏ కులమో ఏమో...అఖునా మన ఇది గానీ పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిని సరాసరి వెంటబెట్టుకొస్తాడుటండీ...అదేమీ ఉండదనుకుంటాను...' సీత అన్నది.

రామయ్య ఏమీ మాట్లాడలేదు.

కాళ్లూ చేతులు కడుక్కొని మజ్జిగ త్రాగి బయలుదేరాడు రామయ్య. సీత కూడా ఆయనవెంట బయలుదేరింది. 'మన తోటలో ఈ సంవత్సరం పళ్ల దిగుబడి బాగా తగ్గి పోయిందన్నాడు పాలేరు...నాకేమో అనుమానంగా ఉంది...దొంగతనం ఏమయినా జరుగుతున్నదేమో...'సీత అంది.

'ఉహూ అదేం లేదు...దిగుబడి తక్కువగానే ఉంది... మనలాగానే తోట కూడా దిగులుగా ఉంది...' రామయ్య అన్నాడు.

సంధ్య కిరణాలు ప్రకృతికి బంగారు ముసుగు కప్పుతున్నాయి. మేతకు పోయిన పశువులు ఇంటిముఖం పట్టాయి.

'చూడు వాతావరణం ఎంత అందంగా ఉందో...ఎన్నాళ్లు గానో చూస్తున్న నాకు ప్రతిరోజూ ఏదో క్రొత్తదనం కనిపిస్తుంటుంది. నీకు పట్టణంలో ఈ వాతావరణం దొరుకుతుందా...నాకు ఎప్పుడు వెళ్లినా ఉన్న నాలుగు రోజులు తోచదు. ఎప్పుడు ఇంటికెళ్లి పడదామా అనిపిస్తుంటుంది...ఇది వాస్తవికత, ఇది అధ్యాత్మికం ...అది భౌతికం...ఇక్కడ ఆనందం కొనుక్కోనక్కరలేదు. .అక్కడ కొనుక్కున్నా లభించదు...అదొక ముసుగు ...ఆ ముసుగులో ఏమో ఉందని భ్రమ...ఎండమావుల్లో నీళ్లు ఉన్నట్లు భ్రమించినట్లుగానే ఉంటుంది. అక్కడ ఉన్న సౌకర్యాలు మనం కూడా కలుగజేసుకోవచ్చుగా. మన ఇల్లు ఉంది...ఎంత సౌకర్యంగా ఉంటుంది...ఏమో నాకు ఇదే స్వర్గం అనిపిస్తుంది...' రామయ్య అంటున్నాడు.

'అబ్బాయిగోరూ ... ఏరో అమ్మాయిగారూ వచ్చినారండీ...' పాలేరు ఎదురొచ్చి చెప్పాడు.

'వాళ్లకు మంచీ చెడ్డా ఏమైనా చూశావా...' సీత అడిగింది. అంతలోకే వాళ్ళిద్దరూ దగ్గరకు వచ్చారు.

'వీరు నాన్నగారు...' సూర్యం లక్ష్మితో అన్నాడు.

పాదాభివందనం చేసింది. రామయ్య ఆశీర్వదించాడు. 'పేరు లక్ష్మి నాన్నా...మేష్టరు ఉద్యోగం చేస్తున్నది...' సూర్యం అన్నాడు.

'చాలా సంతోషం...' రామయ్య అన్నాడు. 'మీ ఇద్దరికీ ఏకాంతంగా తిరిగే అంతటి సంబంధం ఏమిటి...?'అన్నట్లు చూశాడు.

'మీ రిద్దరూ ప్రేమించుకున్నారు కదూ...' ఎంతకీ ఎవరూ మాట్లాడకపోతే రామయ్యే అన్నాడు నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

అంత సూటిగా అడిగేసరికి అందరికీ ఒకవిధమైన భయం కలిగింది. లక్ష్మి తల కుంగిపోయినట్లయింది సిగ్గుతో. 'అవును' అన్నట్లు గుటకలు మింగాడు సూర్యం.

'ఎవరమ్మాయి ...ఏమిటి ...కులంగోత్రం... పెద్దవాళ్లం ఉన్నామనే గౌరవం లేకుండా...'రామయ్య మాటలు బరువు వేఅయినప్పటికి, ఆ అనే ధోరణి మాత్రం కటువుగా లేదు.

'మీకు చెప్పకుండా నేనేమీచేయను...అందుకే తీసుక వచ్చాను...స్వయంగా చూస్తారని...'సూర్యంనీళ్లు నములుతున్నాడు.

'మేమే వచ్చేవాళ్లంగదా నాయనా...'సీత అన్నది...'వాళ్ల పెద్దవాళ్ళు ఏమనుకుంటారు...కుర్రినాగన్న...అన్నీ చిన్నతనపు చేష్టలే...'

'పరాయిది కాదు ...మన రాధమ్మత్త కూతురు...'సూర్యం మాటలు నమ్మకం కల్గించనట్లుగా సీత, రామయ్య ఒకరిని ఒకరు చూసుకుంటున్నారు.

'ఏమిటిరా నీవనేది సూర్యం...అదెప్పుడో చనిపోతేను...' రామయ్య వణికే కంఠంతో అన్నాడు.

'లేదు నాన్నా బ్రతికే ఉంది...ఈ నాటికీ బ్రతికే ఉంది.' ఒక ఫోటో తండ్రికి అందించాడు సూర్యం.

'అయితే వెంట పెట్టుకురాకపోయావా దాన్ని కూడా...' రామయ్య కంఠం గాద్గదికమైంది.

'మీరు ఇంట్లో అడుగు పెట్టనిస్తారో లేదో అని...ఊర్లో నలుగురూ నాలుగు విధాల ఇష్టం వచ్చినట్లు అనుకుంటారని... ఈ విధంగా అందరం చిన్నపోవాల్సిన అవసరం లేకుండా పోవాలని ...' సూర్యం అన్నాడు.

'పాపం చిట్టి తల్లి ఎన్ని అవస్థలు పడిపోయిందో...నమ్మి మోసపోయింది...అందరూ హేళనచేశారు...పాపిష్టిదని కన్న తల్లిదండ్రులే ఇంటి నుండి గెంటేశారు...ఏమయినా రాధ గొప్పది...ధైర్యంగా నిలబడి బ్రతుకును సార్థకం చేసుకుంది... కూతురుని ఇంతదాన్ని చేసింది...'నీకు ఎట్లా తెలిసింది...'రామయ్య అన్నాడు.

'అంతా దైవలీల. ఒక రోజున ఇంటికోసం తిరుగుతుంటే వీరున్నచోటికి వెళ్లాను...తరువాత వివరాలతో నన్ను ఆమె పోల్చుకోగలిగింది...మొదట్లో వివరాలు నాకు తెలియనీయలేదు


నేనూ అక్కడే ఒక గది తీసుకొని ఉన్నాను...నన్నెంతో ఆప్యాయంగా చూసుకొనేది అత్తయ్య. నాకు కావలసిన సదుపాయాల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకొనేది. ఆప్తులు చూసుకున్నట్లు స్వంత ఇంట్లో ఉన్నట్లుగానే అనిపించేది. లక్ష్మి కూడా నాతో ఎంతో చనువుగా ఉండేది. మేం దగ్గరవడం గమనించింది అత్తయ్య. ఒకనాడు లక్ష్మిని పెళ్లి చేసుకుంటానని అత్తయ్యతో చెప్పాను. మానాన్న అమ్మకు కూడా వ్రాస్తాను...అని అన్నాను. అప్పుడు అత్తయ్య వారించింది. మేము భ్రష్టులంబాబూ...అంటూ వివరం చెప్పింది. ఏమయినా సరే వివాహం చేసుకుంటే లక్ష్మినే చేసుకుంటాను లేకపోతే లేదన్నాను. ఇలాంటి మాటలు నమ్మే నేనూ మోసపోయాను. అలాగే నా లక్ష్మి నా లాగే మోసపోకూడదు. ఏదో ఉద్రేకంలో ఏదో అంటున్నావు బాబూ—...అన్నది. అత్తయ్య అన్న దాంట్లో కూడ నిజం లేకపోలేదు ... ఎవరు చేసిన తప్పుకు వీరు శిక్ష అనుభవించాలి...నాకు అర్థంకాలేదు. ఏ పాపం ఎరుగని లక్ష్మి జీవితానికి ఎలాంటి అన్యాయం జరుగ కూడదు అని నిశ్చయించుకున్నాను. అందుకే వెంటతీసుకు వచ్చాను, మీరు తప్పక అంగీకరిస్తారని..." సూర్యం అన్నాడు. 'ఏమో అనుకున్నాను... గట్టివాడివే... నిర్ణయించుకున్నాక ఇంక మా సమ్మతి ఎందుకు ? చేసుకోపోయారూ రిజిష్టరాఫీసుకు పోయి... 'రామయ్య మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది. 'అయినా ఏమమ్మా లక్ష్మి నీవే మంటావు ? నీకు ఇష్టమేనా ?' లక్ష్మి వైపు చూస్తూ అన్నాడు. 'నాదొక షరతు మామయ్యా... అలాగయితేనే నేను బావను పెళ్ళి చేసుకుంటాను లేకపోతే..., 'సూర్యం వైపు కొంటెగా చూస్తూ అన్నది. 'ఏమిటమ్మా అది...' సీత అన్నది 'తనంత తాను చేసుకుంటా నన్నాడనేగా అంత అలుసు, చులకన...'

కాదు అత్తయ్యా... మామయ్య వ్రాసే ప్రతి ఉత్తరమూ చదివేదాన్ని...మామయ్య చెప్పినట్లు చేస్తే నాకేమీ అభ్యంతరం లేదు...' లక్ష్మి అన్నది. 'మామయ్యను మంచి చేసుకుంటేనే గానీ కుదరదని అప్పుడే ఎంతపెద్ద ఎత్తు వేసింది... చూడమ్మా నన్ను ఉద్యోగం మానేయ మంటున్నది...' సూర్యం అన్నాడు. 'లక్ష్మి ఎంత మంచిదానవమ్మా నీకయినా అర్థం అయింది నా మనసు... నీవు చెబితే వింటాడేమోనమ్మా... నా మాట వినేట్లు లేదు... సరైన ఆలనా పాలనా లేక ఈ తోట ఎలా దిగజారిపోతుందో... పొలంకూడా అలాగే ఉంది. ఇవన్నీ వదులుకొని ఉద్యోగం వెలగబెడు తున్నాడు. చదువుకున్న వాళ్ళంతా పట్టణాలకు వెళ్ళిపోతుంటే గ్రామాలు ఏమయిపోతాయి. చదువుకొనేది ఉద్యోగం కోసమనుకొనేట్లయితే చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు ఎక్కడినుంచి వస్తాయి... చదువుకున్నామనే గర్వంతో శరీర కష్టానికి దూరమయి, సుఖాలను కొనుక్కోవాలని చూస్తున్నారు తల్లి... కృత్రిమ వాతావరణానికి అలవాటుపడిపోతున్నారు. పైతళుకులకు మోసపోయి అసలు జీవితాన్ని అనుభవించలేకపోతున్నారు. భౌతిక సుఖాల కాశించి మానసిక ఆనందం, అనుభూతి పొందలేక పోతున్నారు...పోనీలేమ్మా వాడికి అర్థంకాకపోయినా నీకయినా అర్థం అయింది...' రామయ్య ఒకవిధమైన ఆనందానుభూతితో అన్నాడు.

'అంతంత మాటలనకండీ నాన్నగారూ... అప్పుడే కోడలిని పొగిడేస్తున్నారు... నాకంటే మీ మనసు అర్థంచేసుకున్నవారు ఎవరూ ఉండరనుకుంటాను...నాకు చాలా బాధగా ఉంది. అంతా నాటకం... లక్ష్మిని వివాహంచేసుకోవాలనే ఉద్దేశంతోనే ఇలా చేశాను. మిమ్మల్ని చాలా బాధ పెట్టాను... క్షమించండి... ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. మీరు కలలు కన్నట్లు నా చదువుతో మనభూమిలో బంగారం పండిస్తాను. రైతు రామయ్య కొడుకు సూర్యం అని నలుగురూ చెప్పుకోవాలి...' సూర్యం మాటలకు తండ్రి హృదయం పొందిన ఆనందం వర్ణనాతీతం. రామయ్యకు భవిష్యత్తు బంగారు బాటలా కనిపించింది. కళ్ళ నీరు కదిలింది...అది వట్టినీరుకాదు ఆనంద బాష్పాలు... కొడుకును కౌగలించుకున్నాడు. 'ఇన్నాళ్ళు అందరం బాధపడ్డాం అనవసరంగా ఈ విషయం ముందే చెబితే ఎంత బావుండేదిరా సూర్యం... పూర్తిగా నన్ను అర్థం చేసుకోలేదురా నీవు... నేను ఆధునికులలో ఆధునికుడిని, ప్రాచీనులలో ప్రాచీనుడ్ని. మంచిని మాత్రమే ఆలోచించగల మనస్సు... మనమూ, మనపొరుగు మన ఊరు, మనదేశం... అందరం సుఖంగా ఉండాలనే ఆశ నాది. ఆ సుఖాన్ని మనంతమనం సంపాదించుకోవాలనే తపన నాది... మనదేశ సౌభాగ్యం మనచేతుల్లోనే ఉందన్న దృఢ విశ్వాసం కలవాడ్ని నేను... గ్రామాభ్యుదయమే దేశ అభ్యుదయం అన్న గాంధీ మాటలను అక్షరశ: నమ్మినవాడిని... ఇవాళ నాకు పండుగ. అబ్బ చాలా ఆకలి వేస్తున్నది... పద సీతా... ఇంటికిపోదాం... మీరు త్వరగా వచ్చేయండి...' రామయ్య మనస్సు ఆనంద డోలికల లూగు తున్నది. రామయ్య దంపతులు గృహోన్ముఖు లవుతున్నారు లక్ష్మి, సూర్యం మనసులోనే అనుకున్నారు ఎంత అదృష్టవంతులం అని. పెనుతుఫానును ఎదుర్కోవలసి వస్తుందేమో అని ఊహించుకుని, అందుకు తామెంతో ధైర్యంగా మెలగాలని రిహార్సల్సు వేసుకున్న ఆ ప్రేమికులకు ఆ విధంగా నిరాశకలిగిందని చెప్పాలి. ఇంత త్వరగా తమకు ఆమోదముద్ర లభించినందుకు వారికి కలలో జరిగినట్లుగానే ఉంది.

'చూశారా మామయ్య నన్ను అప్పుడే ఎంత మెచ్చుకొన్నారో... మీరు ఎప్పుడూ చెప్పలేదే మామయ్య ఇంత మంచివాడని. నా అదృష్టం. అత్తయ్యకూడా ఎంత మంచివారు. ఇంతమంచి తలిదండ్రులు ఈ ప్రపంచంలో ఎందరికి ఉంటారంటారు... ఇంతకీ అదృష్టవంతులం మనం...' లక్ష్మి అన్నది పట్టలేని ఆనందంతో సూర్యం ఆమె బుగ్గమీద చిటికేసి... గున్నమామిడి కొమ్మమీద లే చిగురుటాకుల మధ్య ఊసులాడుకుంటున్న గువ్వ జంటను చూపించాడు. 'ఛఁ పొండి... అవి మనల్ని చూస్తున్నాయి...' కొంగుతో మొహం అంతా దాచుకుంది.

కోకిల కమ్మగా పాట ప్రారంభించింది. సిగ్గుపడిపోతున్నట్లు సూరీడు మొహం కందిపోయింది. ఏదో ఆనందం వెల్లివిరియబోతున్నట్లు నింగిలో చుక్కలు దోబూచు లాడుకుంటున్నాయి.



12

దేవగిరి సేనల్ని ఓడించిన తరువాత కాపయ్య తిరిగి ప్రతాపరుద్ర నగరానికి వచ్చాడు. ఆంధ్రరాజ్య సరిహద్దుల్లో బలమైన కాపుదల పెట్టాడు. స్థిరమైన సైనిక స్థావరాలను నెలకొల్పాడు.

వేమారెడ్డి కాపయ్య నాయకుణ్ణి కలుసుకొన్నందువల్ల ఆ సంయుక్త సైన్యాలకు త్వరగా విజయం చేకూరింది.

కాపయ్య యుద్ధరంగంనుండి తిరిగివస్తూ తుంగభద్ర ప్రాంతంలో సోమదేవరాజు సాధించిన విజయాలను గూర్చి వేమారెడ్డి ద్వారా తెలుసుకొన్నాడు. ఆ తరువాత నగరానికి వచ్చినప్పుడు కంపలి సైన్యాల పరాజయం, మలిక్‌నబీ బంధం, ద్వారసముద్రం వారు అన్నమదేవునికి సాయంరావడం–ఇవన్నీ గూఢచారులద్వారా అతనికి తెలిశాయి. అప్పుడతనికి కాకతీయ సామ్రాజ్యంలో చెలరేగిన తిరుగుబాటుయొక్క స్వరూపం సమగ్రంగా కనబడింది. తీరాంధ్ర ఎదురు తిరిగిననాటికంటె ఆనాడు తిరుగుబాటుదార్లు బలంగా వున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో చాలాభాగం విముక్తినందించబడింది. సుల్తాను సేనలు పరాభూతం కావడమేకాక చాలవరకు నాశనం గావించబడినవి. ఇక మిగిలినదెల్లా ఓరుగల్లు కాకతీయ చక్రవర్తుల ప్రతిష్ఠకు, ప్రాభవానికి నెలవైన మహానగరం. ఆ నగరాన్ని ఆక్రమించకపోతే తమ ఉద్యమం సఫలీకృతం కాదు. ఆంధ్రజాతికి జరిగిన అవమానం తీరదు. అందువల్ల త్వరగా ఓరుగల్లు పట్టుకోవాలి–అనుకొన్నాడతడు.

కాని అది సులభసాధ్యమైన పనిగాదు. దెబ్బతిన్న సుల్తాను నిద్రపోడు. మరలా తన సేనల్ని పంపుతాడు. తిరుగుబాటు నణచివేయడానికి ప్రయత్నిస్తాడు. పోగొట్టుకొన్న రాజ్యాన్ని పట్టుకోవడానికి యత్నిస్తాడు. అందువల్ల తాము చాల జాగ్రత్తగా వుండాలి. ఎంతో సన్నద్ధంగా వుండాలి.

ఇంతవరకు జరిగిన యుద్ధాలలో సైనిక నష్టమెంతో జరిగింది. అశ్వాలెన్నో మరణించినవి. ఆయుధాలెన్నో భగ్నమయినవి. అందువల్ల వెంటనే యుద్ధం చేయడానికి వీలుగాదు. సాధ్యమయినంతవరకు యీలోట్ల నన్నిటినీ పూడ్చుకోవాలి. సైన్యాన్ని సన్నద్ధం గావించుకోవాలి. అంతవరకు వేచివుండాలి అనిపించిందతనికి.

ఈ విషయాలనుగూర్చి అతడు తరచు అన్న మంత్రి, తదితర పెద్దలతోను, వేమారెడ్డి మొదలగు నాయకులతోను సమాలోచించాడు. వివరంగా చర్చించాడు. వారుగూడ అతనితో ఏకీభవించారు. తీరాంధ్రవాసులు , అంతర్వేదిప్రజలు, హోయసుల రాజ్యనివాసులు అందరు ఏకమై ప్రతిఘటిస్తేగాని ఓరుగల్లును పట్టుకోవడానికి వీలుగాదన్నారు.. అందువల్ల సోమదేవరాజును, బల్లాళుణ్ణి ఇద్దరిని సమావేశపరచి మాట్లాడి ఒక నిర్ణయానికి రావాలనుకున్నారందరూ.

ఆ సమావేశంనుండి కాపయ్య నాయకుడు వెలుపలికి వస్తూనే భటుడొకడు వచ్చి సోమదేవరాజు ఒకలేఖనుపంపాడని దానినతని చేతికిచ్చాడు. అతడు దానిని చదువుకొని వెలుపలికి వచ్చిన అన్నమంత్రిని తదితరుల్ని లోనికి రమ్మన్నాడు.

"సోమదేవరాజు అతని సోదరుడైన అన్నమదేవుడు శృంగేరిని వెతుకుతున్నారట. మనల నెవరినైనా అచ్చటికి రమ్మన్నాడు. వీలయితే నన్నే రమ్మన్నాడు. మనం సాధించిన ఘన విజయాలకు విద్యారణ్య యతీంద్రుడమితానందం పొందాడట. అతడు మనలో ముఖ్యులైన వారిని చూడాలన్నాడట." అని అతడు వారితో అన్నాడు.

ఆ మీద వారందరూ ఆ విషయాన్ని గూర్చి చర్చించారు. తప్పనిసరిగా కాపయ్య నాయకుడు వెళ్ళిరావాలని అతనితో అన్నమంత్రి, వేమారెడ్డి వెళ్ళాలని నిర్ణయించబడింది. కాపయ్య నాయకుడు వచ్చేవరకు అనపోత నాయకుడు తదితర నాయకులు

రాజ్యాన్ని రక్షిస్తూవుండాలని వారు సింగమనాయకుని, రేచర్ల రుద్ర దేవుని సలహాలను పాటిసూవుండాలని తీర్మానించబడింది.

శృంగేరికి వెళ్ళడమన్న విషయం కాపయ్య నాయకుని కెంతో ఆనందాన్ని కలిగించింది. అతడు విద్యారణ్య యతీంద్రునెన్నడూ చూచి వుండలేదు. అతణ్ణిగూర్చి ఎంతో వినివున్నాడు. ఆ యతీంద్రుడు తపస్సంపన్నుడేగాక అద్వితీయ మేధావంతుడని, అనన్య ప్రతిభావంతుడని, మహాపండితుడని, అపర శంకరుడని అతడది వరకే వినివున్నాడు. అందువల్ల ఆ యతి పుంగవుణ్ణి దర్శించడం కంటె వేరొక భాగ్యమేమున్నది ?

యతీంద్రుని చూడడమొక్కటే గాదు భాగ్యం. తనను ఆకర్షించి, తన మనస్సుమీద చెరగని ముద్రవేసి, అ దులో శాశ్వత స్థానాన్నాక్రమించుకొన్న అంబదేవుణ్ణి గూడ అచ్చటనే చూడవచ్చు.

అన్నమదేవుడెంత గట్టివాడు ? పరాక్రమవంతుడు, ఆ సుకుమారతలో అంత కాఠిన్యత ఎలావుందో ? నవనవలాడే ఆ ముగ్ధ మోహన విగ్రహంలో ఆ బలమెచ్చట దాగివుందో అతనికర్థం కాలేదు. తనతో మాట్లాడుతున్నప్పు డతడొక సామాన్యయువకుడు మాత్రమేనని తాననుకొన్నాడు. కాని జరిగిన సంఘటనలు అతడు మహా వీరుడని, యోధానయోధుడని, గొప్ప పరాక్రమవంతుడని వ్యూహరచనలో, రణమాచరించడంలో ఎంతో గట్టివాడని ఋజువు చేసినవి. ఆలాటి సహచరుణ్ణి మరొకసారి చూడడంకంటె మహద్భాగ్య మింకొకటేమున్నది ?

మరునాటి వేకువనే కాపయ్యనాయకుడు అన్నమంత్రితో, వేమారెడ్డితో కలిసి శృంగేరికి బయలుదేరాడు. వారితో రెండు వందల మంది ఆశ్వికులుగూడ ప్రయాణమయ్యారు.

కాపయ్యనాయకుడు, తదితరులు ఎంతో ఆనందంతో, ఎంతో ఉత్సాహంతో ముందుకు వెళ్ళసాగారు.

అన్నమంత్రి కాకతీయ సామ్రాజ్య స్థాపననుగూర్చి, కాకతీయ వంశాన్నిగూర్చి, కాకతీయ చక్రవర్తులనుగూర్చి, చెప్పనారంభించాడు. గణపతి దేవుడు, మనుమసిద్ధి రాజును బంధించడం అతణ్ణి విడిపించడానికని మహాభారత రచయితలలో ఒకడైన తిక్కనామాత్యుడు ఓరుగల్లుకు రావడం, అప్పుడతణ్ణి గణపతిదేవుడు సన్మానించడం, అతని అభ్యర్థనమీద మనుమ సిద్ధిరాజు విముక్తి బొందించబడడం, రుద్రమ్మ స్త్రీయైన విషయం చాల కాలంవరకు ఎవరికీ తెలియకపోవడం, ఆమెకు జాయపసేనాని కుమార్తె నిచ్చి పెళ్ళి చేయడం, ఆమె స్త్రీయని ప్రకటించడ , తరువాత ఆమె వివాహం, ఆమె చక్రవర్తిని కావడం, ఆమె సామ్రాజ్ఞికావడం ఆమె భర్తకే యిష్టం లేక పోవడం, ఆ మీద అతడు, ఆమె స్వంత బిడ్డలు దేవగిరి రాజులతో కలిసి ఆమె మీద కుట్ర బన్నడం, హఠాత్తుగా వచ్చి ఓరుగల్లును ముట్టడించడం, ఆ పోరాటంలో వారు ఘోర పరాజయం పొందడం, ఆ తరువాత ఇరవై ఐదేండ్లు ఆ మహా మహారాలు నిర్విఘ్నంగా, నిరాటంకంగా ఆంధ్రావనిని పరిపాలించడం, వీటనన్నిటినీ అతడు వివరించాడు.

అదొక గొప్ప చరిత్ర. ఆ చరిత్రను వింటూ ఆనందిస్తూ వెళ్ళసాగాడు కాపయ్య నాయకుడు. అతడు గూడ ఆ చరిత్ర నిదివరకే విని వున్నాడు. కాని ఇంత వివరంగా విని వుండలేదు. అన్నమంత్రి రుద్రమదేవి కాలం వాడు గనుక అతని కానాటి విషయాలన్నీ వివరంగా తెలుసు. అందువల్ల అతడు ఆ చరిత్రను చెబుతుంటే వింటూన్న వారికందరికీ ఎంతో ఆనందం కలిగింది.

కాపయ్య నాయకుడు, అతని బృందం రాత్రింబగల్లు పొలాలను, మిట్ట పల్లాలను, కొండ కోనలను, చిన్న చిన్న అరణ్యాలను, సెలయేళ్ళను, నదులను దాటి వెళ్ళసాగారు. త్వరగా శృంగేరిని చేరుకోవాలనే ఆకాంక్షతో వారందరూ అంత త్వరగా ముందుకు వెళ్ళారు.

వేమారెడ్డికి, అన్నమంత్రికి, తదితరులకు మాధవ విద్యారణ్య యతీంద్రుణ్ణి దర్శించాలనే కుతూహలం ఎక్కువగా వుంది. కాపయ్యకు గూడ ఆ తపస్విని చూడాలని వుంది. కాని అంతకంటే హెచ్చుగా అన్నమదేవుణ్ణి కలుసుకోవాలనుంది. అతణ్ణి చూచి అతనితో మాట్లాడుదామని వుంది.

శృంగేరి సమీపించింది. విశ్రాంతకవనం, ఆ ప్రక్కనున్న పర్వతశ్రేణులు గోచరింపసాగాయి. ఆ పొలిమేరలకు వెళ్ళినప్పుడు తుంగభద్రానదిని దర్శించినప్పుడు, అచ్చట ప్రకృతి శోభను తిలకించినప్పుడు, కాపయ్య నాయకుని హృదయం పులకించింది. ఇతరుల హృదయాలు పరవశమందాయి.

కాపయ్య నాయకుని బృందం శృంగేరికి వెడుతూనే, ఆశ్రమాన్ని సమీపిస్తూనే అచ్చట ఆనెగొంది సోదరులిద్దరు వారి కెదురుగా వచ్చారు. వారిని కుశల ప్రశ్నలు వేశారు. హస్తాలు పట్టుకొని లోనికి తీసుకొని వెళ్ళారు. అన్నమదేవుడు. కాపయ్య హస్తం పట్టుకొన్నప్పుడతని నరాలలో ఏదో విద్యుత్తు ప్రవహించినట్లయింది. అతని గుండె ఉద్వేగంతో కొట్టుకొన్నది.

వారందరూ లోనికి వెళ్ళినప్పుడు విద్యారణ్య యతీంద్రుడు ఒంటరిగా కూర్చొని వున్నాడు. అతడు దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఆహా శంకరాచార్యునికి అన్నమంత్రి నమస్కరించాడు. అన్నమదేవుడతణ్ణి యతీంద్రునికి పరిచయం గావించాడు. ఆ తరువాత ఆ మౌనికి సాష్టాంగ పడిన కాపయ్య నాయకుణ్ణి, వేమారెడ్డిని గూర్చి చెప్పాడు. యతీంద్రుడు ఆ యువకుల్ని ఆశీర్వదించి వారిని కూర్చోమన్నాడు.

"మిమ్మల్ని గూర్చి నేను విని వున్నాను." అన్నాడు విద్యారణ్యుడు అన్నమంత్రిని చూచి, "ఈ యువకుల గొప్పతనాన్ని గూర్చి గూడ ఆలకించి వున్నాను." అని నవ్వాడు కాపయ్య నాయకుణ్ణి, వేమారెడ్డిని గాంచి. వారు ముప్పురూ కృతజ్ఞతా సూచకంగా నవ్వారు.

"అందరూ క్షేమంగా వున్నారా" అని ప్రశ్నించాడు యతీంద్రుడు. అతని మాటలెంతో అప్యాయంగా వున్నాయి. అవి వారినెంతో ఆకర్షించాయి.

"క్షేమంగానే వున్నాము." అన్నాడు అన్నమంత్రి.

"యోగానందా ?" పిలిచాడు యతీంద్రుడు. యోగానందుడు వచ్చి నమస్కరించాడు.

"వీరిని తీసుకొనివెళ్ళి పానీయ మిప్పించు."

" అలాగే " అంటూ యోగానందుడు వారి వైపు చూచాడు.

ఎందుకులే అన్నట్టుగా చూచారు వారు.

"చాల శ్రమపడి వున్నారు. వెళ్ళి పానీయం తీసుకొండి. ఆ లోగా సాయణుడుగూడ వస్తాడు. ఆ తరువాత మనం మాట్లాడుకోవచ్చు." అన్నాడు యతీంద్రుడు. అతని మాట ప్రకారం అందరు లేచి వెళ్లారు. తుంగభద్రా నదీ లోయలలో ముఖాలు కడుక్కొన్నారు పాద ప్రక్షాళన గావించుకొన్నారు. కొంత సేద దీర్చుకొన్నారు.

మరొకసారి కాపయ్యను చూడటానికి, అతనితో మాట్లాడటానికి అవకాశం లభించినందుకు అన్నమదేవుని కెంతో ఆనందం కలిగింది. కాపయ్యకుగూడ అలాటి భావమే ఏర్పడింది.

తుంగభద్రానది వద్దకు వెళ్లినప్పుడు, అచ్చటనుండి తిరిగి వచ్చినప్పుడు, పానీయాన్ని త్రాగినప్పుడు కాపయ్య, అన్నమదేవులు ఒక్కటిగానే వున్నారు. ఎన్నడో విడిపోయి అప్పుడే కలుసుకొన్న మిత్రులలాగా ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకొన నారంభించారు.

ఇంతలో సాయణాచార్యుడు వచ్చాడని, యతీంద్రుడు రమ్మంటున్నాడని యోగానందుడు వచ్చి పిలిచాడు. అందరూ లేచి యోగీంద్రుని వద్దకు వెళ్లారు.

అచ్చట అనంతర కార్యక్రమాన్ని గూర్చి వారు చర్చించారు.

ఢిల్లీ సుల్తాను ఓటమిని సహించడని, కంపలిని పట్టుకోవడానికి, సోమదేవరాజును అణచివేయడానికి ప్రయత్నిస్తాడని అందుకు అందరూ సంసిద్ధంగా వుండవలసి వుంటుందని యోగీంద్రుడన్నాడు. సైన్యాన్ని గూడ కొంత హెచ్చు చేసుకొమ్మన్నాడు. ఈ మారు సుల్తాను దృష్టి ఆనె గొంది మీదనే వుంటుందని, అందువల్ల వ్యూహరచన తదనుగుణంగా చేసుకోవలసి వుంటుందని చెప్పాడు. ఈ మారు తప్పనిసరిగా గెలవవలసి వుంటుందని, ఇది చివరి పోరాటం కాకపోయినప్పటికీ, ఇది చాల ప్రధానమైన పోరాటంగా వుండగల దన్నాడు. ఈ యుద్ధంలో ఆంధ్ర సైన్యాలు ఓడిపోతే హైందవమే తుడిచిపెట్టుకొని పోతుందన్నాడు. అటుగాక సుల్తాను ఓడిపోతే హిందూసైన్యాలకు ఎచ్చటలేని ప్రోత్సాహము, మహమ్మదీయులకు ఎనలేని నిరుత్సాహం కలుగుతుందని, అందువల్ల మరొక పోరాటానికి సిద్ధంగావడానికి ఆంధ్రుల కవకాశముంటుందని వారు అన్నారు.

యోగీంద్రుడు చెప్పిన దానితో అన్నమంత్రి పూర్తిగా ఏకీభవించాడు. ఆ తరువాత వారు సుల్తాను మనస్తత్వాన్ని గూర్చి, ఆర్యావర్తంలో వస్తున్న పరిణామాలను గూర్చి, దక్షిణా పథంలో వున్న ఇతర రాజ్యాలను గూర్చి మాట్లాడు కొన్నారు.

చర్చలన్నీ ముగిసిన వెంటనే వారందరూ యతీంద్రుని సెలవు తీసుకొన్నారు. అన్నమంత్రి, కాపయ్య నాయకుడు, వేమారెడ్డి వెళ్లిపోతుంటే అన్నమదేవుని మనస్సు చాల బాధపడింది. అతడు తిరిగి తిరిగి వారి వైపు చూస్తూ తన సోదరుని అనుగమించాడు.

13

ఢిల్లీ సేనల రాక

కంపిలి మీదికి సేనలు వస్తున్నాయి. ఈ మారు చాలా పెద్ద ఎత్తున వస్తున్నాయి. అంతేగాక లక్షలకొలది సేనలు వస్తున్నాయి. అయినప్పటికి సోమదేవరాజు, కాపయ్య, బల్లాలుడు వాటి నెదుర్కొనడానికి తమ సంసిద్ధతను తెలిపారు. కాని వారా సేనలయెదుట ఆగగలరా?

ఆలోచింపసాగాడు మాధవ విద్యారణ్య యతీంద్రుడు. ఒకవేళ మహమ్మదీయ సేనల ముందు వీరి బలగాలు ఓడిపోయినట్లయితే మరల ఏమి చేయాలి. బల్లాలుడంత ధైర్యవంతుడు కాకపోయినప్పటికీ సోమదేవరాజు, కాపయ్య కడవరకు పోరాడగల సాహసవంతులు. ఎన్నిలక్షల సైన్యమైనా వారు వెనుదీయరు. కాని వారి సేనలు మహమ్మదీయ సేనల యెదుట ఆగగలవా?

యతీంద్రుని మనస్సు బాధపడింది.

ఈ మారు దేవగిరిలోనున్న వజీర్ మలిక్ గాని, ఓరుగల్లులోనున్న ముస్లింసేనాని గాని సేనాధిపత్యం వహించడంలేదు.

మహమ్మదీయులు గావించబడిన ఇద్దరు హిందువులు సేనానాయకులుగా వస్తున్నారు. వారెవరోమరి. ఓరుగల్లులోనో లేక కంపిలిలోనో పట్టుబడినవారైవుంటారు. కాని వారెవరో ఇద మిద్ధమని తెలియడంలేదు.

హిందువులందరూ మహమ్మదీయులవుతున్నారు. కొందరు నిర్బంధంవల్ల అవుతుంటే మరికొందరు పదవులకొరకవుతున్నారు. హిందువులలో స్వార్థం బలసిపోతున్నది. అందువల్లనే హిందూ రాజ్యాలన్నీ పతనమైపోయినవి. ప్రతి రాజ్యములోను ఎవరోకొందరు హిందువులు కుట్రగావించి ఢిల్లీ సుల్తానుకు సాయం జేయడంవల్లనే ఈ రాజ్యాలన్ని పతనమైనవి. సోమదేవరాజు కాపయ్యలాటి స్వార్థ రహితులే లేకపోతే యీపాటికి హైందవమే నాశనమై వుండేది.

మహమ్మదీయ ప్రభువులకు రాజ్యకాంక్ష మాత్రమే వుండి వున్నట్లయితే చాలినంతగా ఎదిరించ నక్కరలేదు. వారు రాజ్యాలాక్రమించుకొన్నంత మాత్రాన వారిని తప్పనిసరిగా యెదిరించాలి అనుకొన నక్కరలేదు. కాని వారు హైందవాన్నే నాశనం చేయడానికి పూనుకొన్నారు. హిదువులందరినీ మహమ్మదీయులుగా మార్చివేస్తున్నారు. ముస్లిములు కావడాని కిష్టపడని వారిని చంపివేస్తున్నారు. లేక ఎన్నో ఇబ్బందులు పాలుగావిస్తున్నారు. హిందూ దేవాలయాలను పడగొట్టి వాటినిమసీదులుగా మారుస్తున్నారు. పూజారుల తలలు తీస్తున్నారు. హిందూగ్రామాలను దహించివేస్తున్నారు.

ఈ విధంగా హిందూనాగరికతను హిందూసంస్కృతిని నాశనం గావించి మహమ్మదీయమతాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నారు. అందువల్ల వారినెదిరించవలసి వుంటుంది. తప్పనిసరిగా వారినెదుర్కొనవలసి వుంటుంది–అనుకొన్నాడు యతీంద్రుడు.

మతం మార్చడానికి మనస్సును మార్చాలి. అంతేగాని చంపుతామని బెదిరించి, పదవులిస్తామని ఊరించి మార్చడమా? తమ మతంలో సారంవుంటే ప్రచారం చేసి ప్రజల్ని మార్చవచ్చు. దాని నెవరూ కాదనరు.కాని కత్తి జూపి, నిర్బంధించి, మనస్సుకు వ్యతిరేకంగా మతమివ్వడమా? ఎంతఅన్యాయము?.

యతీంద్రుని మనస్సు ఆందోళనపడింది.

ఈ దుర్మార్గాన్ని అరికట్టాలి.

ఈ అన్యాయాన్ని ఎదిరించాలి.

ఈ అక్రమాన్ని ఎదుర్కోవాలి.

యతీంద్రుని ముఖం గంభీరమయింది. అతనిమనస్సు గట్టిబడింది. అతడాలోచనలో పడ్డాడు. కొంతసేపటి కతని ముఖం కళకళలాడ జొచ్చింది. అతని పెదవులు చిన్నగా విచ్చుకొన్నవి. ఆమహానుభావుడు ఏదో నిర్ణయానికి వచ్చినట్లుంది. అందువల్లనే అతడలా వున్నాడు.

చీకటి పడుతున్నది. అంధకార మలముకొంటున్నది. ఆసమయంలో యతీంద్రుడు ఆశ్రమ వాసులలో ఒకరిని పిలిచాడు. అతనితో ఏదో రహస్యంగా చెప్పాడు. తనశరీర మంతా ఆచ్ఛాదనం గావించుకొన్నాడు.అచ్చటనుండి ఒంటరిగా వెళ్ళిపోయాడు. అతడెచ్చటికి వెళ్ళాడో ఎవరికీ తెలియదు.

ఢిల్లీనుండివచ్చినసేనలు దేవగిరిలోఆగాయి. వజీర్ మల్లిక్, సైన్యాలకెదురేగి స్వాగతం చెప్పాడు. ఆ సైన్యాలు విడవడానికి కావలసిన సౌకర్యాలనేర్పాటు గావించాడు.

దేవగిరికి వస్తూనే ఖాసిం, అబ్దుల్లాలు వజీర్ మల్లిక్‌తో రహస్య సంభాషణలు జరిపారు. కంపిలిలో, ద్వారసముద్రంలో, ఆనెగొందిలో, తీరాంధ్రలో ఉన్న పరిస్థితినిగూర్చితెలుసుకొన్నారు. ఆ తరువాత పరిస్థితి వారనుకొన్నంత ఆశాభావకం,గాలేదని, ఎంతో ప్రయత్నిస్తేనేగాని, ఎంతో నష్టపడితేనేగాని కంపలిని పట్టుకోవడం కష్టమనే నిర్ణయానికి వచ్చారు.

కంపలిలో తాము బంధింపబడిననాటి పరిస్థితికీ, ఇప్పటి పరిస్థితికీ చాలా భేదమున్నట్లున్నది. ఆ నాడు ఓరుగల్లు పడిపోయింది. కాకతీయ సామ్రాజ్యమంతా ముస్లిముల హస్తగతమయింది. ద్వారసముద్రం, వారికి లోబడిపోయింది. కంపిలి ఒక్కటే తలయెత్తుకొని నిలబడింది. కాని చివరకదిగూడ పడిపోయింది. అందువల్ల దక్షిణాపథంలో దాదాపు మొత్తం ఢిల్లీ సుల్తానుల కైవశమైపోయింది. ఆ నాడు సుల్తానునెదిరించేవారే లేరు. కాని యీ నాడు ఆ ప్రాంతమంతా మేలుకొన్నది. అంతేగాదు. దెబ్బతిన్న బెబ్బులిలాగా పైబడుతున్నది. అరవీటి సోమరాజు, కాపయ్య నాయకుడు మొదలైనవారీనాడు ఆ ప్రాంతానికి నాయకత్వం వహిస్తున్నారు.

తమ రాక ముందుగానే శత్రువులకు తెలిసినట్లుంది. కడకు ద్వారసముద్రం బళ్ళాలుడుగూడ వారితో కలిసిపోయాడు. సంయుక్తంగా వారందరూ సుల్తానునెదిరిస్తున్నారు. కాని వారెలా పోరాడనున్నారో తెలియదు. వారి సైన్యాల కదలికలుగూడ అంతగా తెలియరావడంలేదు. కనుక తాము వ్యూహరచన ఎలా చేసుకోవాలో అర్థంకావడంలేదు.

“వజీర్, నీవు సలహా ఏమైనా యిస్తావా?” ప్రశ్నించాడు ఖాసిం.

“సుల్తానుగారితో మీరీవిషయమై చర్చించలేదా?” వజీర్ మల్లిక్ అడిగాడు.

“చర్చించాము. కాని నీ సలహాగూడ వుండాలిగదా?” అన్నాడు అబ్దుల్లా.

“వారందరూ కలిసే పోరాడుతారని నా భావం. అందువల్ల దానినిబట్టి మీరాలోచించుకొని పథకం సిద్ధంగావించుకోవాలి.” వజీర్ మలిక్ ప్రత్యుత్తరమిచ్చాడు.

“వారి సైన్యాలన్నీ ఏకంగా పోరాడతాయా?లేక వేర్వేరుగా పోరాడుతాయా?” ఖాసిం ప్రశ్నించాడు. “అది చెప్పడానికే వీలుగాదు. ఆ విషయమే తెలియడంలేదు. ఏమైనప్పటికీ ఎదురుగానే గాక వెనుకనుండిగూడ దాడిచేస్తారని మనం అనుకొని దానికి తగ్గట్టుగా వ్యూహరచన చేసుకోవాలి.” అన్నాడు వజీర్ మల్లిక్.

“వీరిలో ఎవరు గట్టివారు?”

“అందరూ గట్టివారేనండీ. సోమదేవునికంటె అతని సోదరుడు అన్నమదేవుడు గట్టివాడు. అతనికంటె కాపయ్య మరీ గట్టివాడు. అతనితో పోరాడడం చాల కష్టం. అతడెత్తులమీద ఎత్తులువేసి శత్రువును పడగొడతాడు.”

“సరే, రేపుదయమే బయలు దేరుతాము.” అన్నాడు ఖాసిం.

అందరూ లేచారు.

ఖాసిం తన గదికి వెళ్ళి పడుకున్నాడు, కాని నిద్ర రాలేదు. అతనికి గత చరిత్ర అంతా గమనం వచ్చింది.

ప్రతాపరుద్రుడు బంధించబడి, ఓరుగల్లు ముస్లిముల స్వాధీనమయినప్పుడు తన సోదరులు కంపిలికి పరుగెత్తి పోయారు. అచ్చట తామిద్దరు కోశాధికారులయ్యారు. తక్కిన యిద్దరు సైనికాధికారులయ్యారు. ఆ తరువాత కంపిలి యుద్ధం వచ్చింది. ఆ యుద్ధములో కంపిలి సైన్యమంతా ధ్వంసమయింది. తాను,తన సోదరుడు

[తరువాయి 57వ పుటలో]

విదేశీ యాత్రికులు—హోటలు పరిశ్రమ

—ఇటికాల మాణయ్య

భారత దేశము చరిత్రాత్మక కట్టడములకు తీర్థస్థలములకు చాలా ప్రసిద్ధి. మన దేశములో చరిత్రాత్మకమైన కట్టడములు, చల్లని కొండసానువులు ఎన్నియో గలవు. ప్రతి సంవత్సరము సుమారు 4 లక్షల మంది విదేశీ యాత్రికులు మన దేశమునకు పర్యటన నిమిత్తమై వచ్చుచున్నారు. వీరివలన సుమారు 40 కోట్ల విదేశీమారక ద్రవ్యం లభించుచున్నది.

స్వాతంత్ర్యము లభించిన తదుపరి భారత ప్రభుత్వము విదేశీ యాత్రికుల సౌకర్యార్థమై అనేక స్కీములు చేపట్టెను. అందులో హోటలు పరిశ్రమ అభివృద్ధి ఒకటి. 1968 సం. లో హోటలు పరిశ్రమపై ప్రత్యేక కమిటీ వేయబడెను. ఈ కమిటీ మనదేశపు హోటలు మేనేజిమెంటు బాగుగా లేదని విమర్శించెను. హోటలు మేనేజిమెంటు వారికి కూడా కొన్ని ఇక్కట్లు వుండుట వలన ఇలాంటి అసౌకర్యములు కలుగుచున్నవి. ఉదాహరణకు టెలిఫోను సర్వీసు చెడిపోవుట, విద్యుచ్ఛక్తి నీటి సరఫరా ఆగిపోవుట మొదలగునవి. ఈ విషయములో హోటలు మేనేజిమెంటు వారు ఏమియు చేయలేకపోవుచున్నారు.

దినదినాభివృద్ధి చెందుతున్న విదేశయాత్రికుల సౌకర్యమునకై భారత ప్రభుత్వము అనేక హోటళ్ళను నిర్మించుచున్నది. ప్రైవేటు రంగములో గల హోటళ్ళకు క్రొత్తగదులు నిర్మించుటకు, తగిన మరమ్మత్తులు చేయుటకొరకు అప్పులు మంజూరు చేయుచున్నది. ఇంతేకాక పన్నువిధింపులలో కూడా తగిన సౌకర్యము కల్గించుచున్నది. కేంద్ర ప్రభుత్వము (10) కోట్ల పెట్టుబడితో హోటలు అభివృద్ధి ఋణముల ఫండు ఏర్పాటు చేసినది. దేశము మొత్తములో ప్రస్తుతము (221) హోటళ్ళకు సహాయము అందచేయడానికై ప్రయత్నము జరుగుచున్నది. 1973 సం వరకు ప్రస్తుతము గల హోటళ్ళలో 3300 క్రొత్త రూములు నిర్మించుట. ఐదవ ప్రణాళిక అంతమునకు 30,000 గదులు నిర్మించుటకు నిర్దేశించబడెను.

టూరిస్టుడిపార్టుమెంటు వారు హోటళ్ళను "స్టార్‌సిస్టమ్" ప్రకారముగా విభజించినారు. హోటళ్ళు పర్యాటకులకు అందచేయు సౌకర్యమును బట్టి "స్టార్‌సిస్టమ్" ఇవ్వబడుచున్నది. ఒక్క స్టార్ హోటలు నుండి ఐదుస్టారుల హోటళ్ళు నెలకొల్పుటకు టూరిస్టు డిపార్టుమెంటు వారు సహాయపడుచున్నారు. ఐదుస్టార్స్ హోటళ్ళలో స్విమ్మింగ్ పూల్, గోల్ఫ్ ఆడు ప్రదేశము ఉండవలెను. అన్ని గదులు ఎయిర్ కండిషన్డ అయివుండి ప్రతిగదిలో రేడియో, టెలిఫోన్ సౌకర్యము ఉండవలెను. స్నానగదులలో రాత్రింబవళ్ళు చల్లనీటి, వేడినీటి సౌకర్యముండవలెను. హోటలు ప్రాంగణములో పెద్దతోట, కార్లు ఆగుటకు తగిన స్థలము వుండుట అవసరము. బాల్‌రూములు, సమావేశపుగదులు, శుభ్రమైన వంటశాలలో శిక్షణ పొందిన నౌకర్లు, అనుభవజ్ఞమైన మేనేజిమెంటు వుండుట ఎంతేని అవసరము.

విదేశీ యాత్రికులు మనదేశములో కొన్ని ఇక్కట్లకు గురి అగుచున్నారు. కస్టమ్సు విధానములో కొంత సడలింపు జరుపవలెను: సామాను మోయు కూలీలు విదేశీ పర్యాటకులను నానా యాతనకు గురి చేయుచున్నారు. కావలసిన దానికంటె ఎక్కువ డబ్బు రాబట్టుచున్నారు. ఇక టేక్సీడ్రైవర్లు. వీరు కొత్తగావచ్చిన విదేశీ పర్యటకులను చికాకుపెట్టి, ఎక్కువ డబ్బులాగి, ఏదోఒక హోటలుకు చేర్చెదరు. వీలుంటే విదేశీ మారక ద్రవ్యములో టాక్సిచార్జీలు తీసుకొను ప్రయత్నము చేయుచున్నారు. క్రొత్తగా వచ్చిన విదేశీ పర్యాటకులకు బిచ్చగాళ్ళ బెడద ఎక్కువ. వీరు నానా రభస చేసి ధర్మము పేరిట డబ్బులాగెదరు. పాపము! విదేశీ పర్యటకులకు ఇదంతా ఒక అయోమయముగా తోచును.

విదేశీ పర్యాటకులనుండి సుమారు (40) కోట్ల రూపాయల విదేశమారక ద్రవ్యము లభించుచున్నది. ఇందులో హోటలు పరిశ్రమ నుండి (16) కోట్ల రూపాయలు లభించుచున్నది. విదేశీ పర్యాటకులు తమ వెంట తెచ్చు విదేశీ మారక ద్రవ్యముతో మనదేశములోని కొంతమంది స్వార్థపరులు పెద్ద బ్లాకుమార్కెటు వ్యాపారము చేయుచున్నారు. ఐక్యరాజ్యసమితి పరిశీలన రిపోర్టు ప్రకారము, విదేశపర్యాటకుల నుండి వచ్చు విదేశీమారక ద్రవ్యములో 1/3 వ భాగము బ్లాకుమార్కెటులోనే చేరిపోచున్నదని తెలియుచున్నది. దీనిని అరికట్టుటకుగాను విదేశీ పర్యాటకులు తమ హోటలు బిల్లులు విదేశీ మారక ద్రవ్యములోనే చెల్లించవలెనని, టూరిజమ్ డిపార్టుమెంటువారు ఆదేశించినారు. ఈ విధానమువలన విదేశీ మారక ద్రవ్యములోని బ్లాకుమార్కెటు అవినీతి రూపుమాసిపోవును. దీనివలన హోటలు మెనెజిమెంటువారికి, ఇట్లు తాము సంపాదించిన విదేశ మారక ద్రవ్యములో 10% తమ హోటలు అభివృద్ధికొరకు ఖర్చుచేసుకొనవచ్చును.

విదేశీ పర్యాటకులను పై చూపబడిన బెడదలనుండి, నానా యాతనలనుండి తప్పించుటకుగాను పెద్దహోటళ్ళ యాజమాన్యము వారు స్వంతముగా టేక్సీలను నిర్వహించి, తమ తరపున గైడ్లను ప్రతి ఏర్‌పోర్టు సముద్రరేవులవద్ద నియమించి విదేశీ పర్యాటకులకు మార్గదర్శకత్వము వహించవలెను. హోటలు వసతి లేని

సముద్రతీరములలో, బీచి ప్రదేశములలో చిన్నచిన్న కాటేజిలు (Cottage) కట్టించి విదేశీ పర్యాటకులను ఆకర్షించవచ్చును.

హోటలు పరిశ్రమను అభివృద్ధిపరచుటలో విదేశ సంస్థల సాంకేతిక సహకారము పొందుటకు కూడా భారత ప్రభుత్వము అనుమతి ఇచ్చుచున్నది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హోటలు సంస్థలగు "శెరాటన్" (Sheraton) మరియు "ఇంటర్నేషనల్" (International) ప్రస్తుతము సాంకేతిక సహకారము అందచేయుచున్నవి. ఈ సంస్థల సాంకేతిక సహకారము వలన హోటల్ యాజమాన్యములో కొత్త పోకడలు, రీతులు, విదేశీ భోజన పదార్థముల తయారుచేయు పద్ధతులు తెలుపబడుచున్నవి. ఈ విదేశీ హోటలు సంస్థలు, మనదేశపు హోటలు పరిశ్రమలో 20% కంటె ఎక్కువ పెట్టుబడులు పెట్టుటకు వీలులేదు.

భారత ప్రభుత్వము, ముఖ్యముగా టూరిజమ్ డిపార్టుమెంటు వారు విదేశ పర్యాటకుల నిమిత్తము ఎక్కువ సౌకర్యములు కలిగించి, హెచ్చు విదేశమారక ద్రవ్యము సంపాదించిపెట్టవలెను. మనదేశములో ఈ క్రింద చూపబడిన ప్రసిద్ధిపొందిన హోటళ్ళు కలవు

		గదుల వసతి
1	ఓబరాయ్ ఇంటర్ కాంటినెంటల్, న్యూఢిల్లీ	350
2	తాజ్‌మహల్ బొంబాయి	360
3.	తాజ్ ఇంటర్ కాంటినెంటల్	300
4.	అక్బర్, న్యూఢిల్లీ	163
5.	ఓబరాయి సొల్టి (Oberoi Soaltee) ఖాట్మండు, నేపాల్	110
6.	ఓబరాయి షెరటాన్, బొంబాయి.	
7.	క్లార్క్స్ అవధ్, లక్నో (Clarks Avadh)	
8.	క్లార్క్స్ అమర్, జయపూర్	
9.	అశోకా హోటల్, న్యూఢిల్లీ (పబ్లిక్ సెక్టర్)	
10.	పరియాస్ అండ్ నటరాజ్, బొంబాయి.	
11.	సన్ అండ్ సాండ్. (Sun-n-Sand) బొంబాయి (సముద్ర బీచిగల హోటలు)	
12.	ఓబరాయి ప్యాలెస్, శ్రీనగర్	
13	మౌంటు వ్యూ, చండిఘర్	
14.	గోపాలపురం సముద్ర తీరపు హోటలు, ఒరిస్సా	
15.	లేక్ ప్యాలెస్ ఉదయపూర్	
16.	రామ్‌బాగ్, జయపూర్	
17.	అశోకా, బెంగుళూరు.	

భారత దేశములోని సంస్థానాధీశులు తమ ఆధీనములో నున్న పెద్దపెద్ద రాజభవనములను హోటళ్ళుగా మార్చుచున్నారు. ఉదాహరణకు హైదరాబాదులోని ఫలక్‌నుమా భవనము, లేక్ ప్యాలెస్ ఉదయపూర్, జయపూర్‌లోని రామ్‌బాగ్ భవనము మొదలగునవి.

ఓరుగల్లు పునరాక్రమణ

[55వ పుట తరువాయి]

బుక్కరాయడు ముస్లిములకు బట్టుబడ్డారు. తక్కిన సోదరులిద్దరు ఏ మయ్యారోగూడ తెలియ రావడం లేదు.

ఆ నాడు తాము హిందువులు, హిందూమతం కోసం, హైందవ ధర్మంకోసం పోరాడిన వ్యక్తులు. నేడు తాము మహమ్మదీయులు. హిందూ మతాన్ని, హిందూ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని, హిందూ నాగరికతను ధ్వంసం చేయడానికి వచ్చిన సేనాధిపతులు. కాలమెంతగా మారిపోయింది! ఖాసిం మనస్సు కలవరపడింది.

తాను హిందువా? మహమ్మదీయుడా? తనకే అర్థం కాలేదు ఖాసిముకు. తాను హరి హరుడా, లేక ఖాసిమా? అతనికేమి తోచలేదు. ఒకవైపున స్వాతంత్ర్యం కోసం, స్వాతంత్ర్య పరిరక్షణకోసం తన సోదర హిందువులు పోరాడుతుంటే, తాను వారి నణచివేయడానికి, వారిని నాశనం గావించడానికి, ముస్లిం పతాకాన్ని దక్షిణా పథంలో సుస్థిరం గావడానికి వచ్చిన అధమాధముడు.

ప్రాణరక్షణకోసం తాను తన మతాన్ని విడిచి మహమ్మదీయుడయ్యాడు. పదవికోసం యీ నాడు తనవారినే నాశనం గావింప నున్నాడు. అతని మనస్సు నలిగిపోయింది. అతని కళ్ళు చెమరించాయి. కాని అతడేమి చేయగలడు? తాను గాక మరొక మహమ్మదీయుడు సేనాధిపతిగా వచ్చి వుండినా దక్షిణా పథం ముస్లిముల పాదాక్రాంత మయ్యేదే కదా. అంతకంటే తాను రాజప్రతినిధి గావడం హిందువులకు మేలే గదా? అప్పుడు రాజ్యం పోయినా హైందవమైనా నిలుస్తుంది కదా. అనుకొన్నాడు ఖాసిం.

చాలసేపు ఆలోచించిన తరువాత సోమదేవరాజుకు, తక్కిన వారికి ముందుగా రాయబారం పంపుదామను కొన్నాడు. వారు తన మాటవిని వెంటనే లొంగిపోతే వారిని సామంతరాజులుగా గుర్తించడానికి నిర్ణయించు కొన్నాడు. ఒకవేళ వారలా లొంగకపోతే యుద్ధం తప్పదనుకొన్నాడు. అదే దేవుడు రాసిపెట్టినట్లవుతుందనుకొని మనస్సును శాంతింప జేసుకొన్నాడు. అలాగే కళ్ళు మూసుకొని పడుకొన్నాడు. [సశేషం]

గ్రంథసమీక్ష

నాటక రత్నావళి

కర్త: శ్రీ కాటూరి హనుమంతరావు

మూల్యము 4 రూ. ప్రతులకు కె. వి. **శేషుబాయి ఓ.యు.బి.ఎఫ్.7** యూనివర్సిటీ కాంపస్, హైదరాబాదు **7, అని వ్రాయవలయును.**

ఈ నాటక రత్నావళిలో ఊరు భంగం, దూతఘటోత్కచం, రత్నావళి, శ్రీరామచరితము—కల్యాణము అను నాలుగు నాటకములున్నవి. ఇందు మొదటి మూడును ఆ పేరులుగల సుప్రసిద్ధ సంస్కృత రూపకముల కాంధ్రీకరణములు. నాల్గవది గ్రంథకర్తగారి సొంత రచన.

ఊరుభంగ దూత ఘటోత్కచములు కాళిదాసునకు పూర్వుడైన భాసమహాకవి రచనలు. "రత్నావళీ నిపుణః కవిః" అని చెప్పుకొన్న శ్రీహర్షుని రచన. భాసమహాకవి తన నాటకములు పెక్కింట మూలకథలలోలేని నూత్న సన్నివేశములు కల్పించుటే కాక పాత్రపోషణమున కూడ ప్రత్యేకత ప్రదర్శించియున్నాడు. ప్రతిమానాటకమందలి కైకను, దూత ఘటోత్కచోరు భంగముల లోని ధృతరాష్ట్ర దుర్యోధనులను అతఁడు చిత్రించిన విధానమిందుకు నిదర్శనము. ఊరుభంగమున దుర్యోధనుని యుదాత్తతను బ్రకటించుటకై యతఁడు యత్నించి కృతార్థుడయ్యెను. అందుచే పఠితలకు దానిని జదువునపుడు విషాదాంత నాయకులయెడవలె నాతని యెడ నింపక సానుభూతి ఆవహిల్లును. అట్లే దూత ఘటోత్కచమున భారతమునవలె ధృతరాష్ట్రుడు కేవల సుతవశంవదుడుగాకాక ధర్మాధర్మ విచక్షణ సమర్థుడై ధర్మమును గట్టిగా నొక్కిచెప్పగల స్వభావమును వ్యక్తీకరించును. అసలు ఘటోత్కచుని దౌత్య వృత్తాంతమే భాసుని కల్పనముగా కనిపించును. రత్నావళి సుప్రసిద్ధమును సరస సన్నివేశ సమలంకృతమునైన చక్కని నాటిక నాటక లక్షణములను చెప్పునప్పుడు లాక్షణికులు దానినుండి పెక్కు లక్ష్యముల నొసంగియున్నారు.

రచయిత రత్నావళిలో కొన్ని యెడల స్వల్పములైన మార్పు చేర్పులు కావించియున్నారు. మూలములో అందలి కథ హఠాదారబ్ధముగా కనిపించును. అందుచే పూర్వ వృత్తాంతము పాఠకులకు సువ్యక్తమౌటకై వారు ప్రస్తావనలో సూత్రధారునిచేత దీర్ఘోపన్యాసము చేయించినారు. (47) తృతీయాంకమున కుపితయై వెళ్ళిపోయిన వాసవదత్త పునరాగమనమును వారు తొలగించియున్నారు. అట్లే చతుర్థాంకమందలి అగ్ని ప్రమాద సన్నివేశములోని పద్యములు కొన్ని సంక్షిప్తతకై తొలగింపబడినవి. ద్వితీయాంకమున కాంచనమాల 'పాము, పాము' అని అఱచి విదూషకుని భయపెట్టిన ఘట్టమమూలకమైనది. మూలమునకంటె అనువాదములో విదూషకుని ఉదాత్తతరునిగా చేయుటకువారు కావించిన ప్రయత్నము శ్లాఘనీయము. అనువాదమొనరించునప్పుడు వారు శ్రీ శారదారంజన్ రే గారి పాఠభేదముల ననుసరించినట్లు చెప్పియున్నారు. ఊరుభంగమందలి భరత వాక్యమును వారు మార్చి వ్రాసియున్నారు.

ఊరుభంగములో తప్ప మిగిలిన నాటకములలో రచించిన పద్యములలో వారు యతిప్రాసలను విడిచిపెట్టి గణములను మాత్రమే అనుసరించి యున్నారు. ఊరు భంగములోకూడ కొన్ని పద్యములలో అట్టి స్వతంత్రత కనిపించును. యతిప్రాసలను పాటించుటవలన వ్యర్థ పదప్రయోగమున కావశ్యకత యేర్పడుననియు, రచయిత అనవసర క్లేశమునకు గురికావలసి వచ్చుననియు వారి అభిప్రాయము. గణములట్లు కాక పద్యమునకు వన్నె కలిగించునని వారి భావము. గణయతి ప్రాసలను సలక్షణముగా పాటించి అనవద్యహృద్యములైన పద్యములు రచించిన మహాకవులు పలువురు లేకపోలేదు. కాని అట్టి రచన అందఱికిని సాధ్యమైనదికాదు. కొందఱి యెడల ఆ నియమములు వ్యర్థ పదముల ప్రయోగమునకు తావిచ్చి పద్య సౌందర్యమునకు భంగము కలిగించుననుటలో అతిశయోక్తికాని అసత్యోక్తికాని లేదు. రచయిత సంస్కృతాంధ్రములందు మంచి పండితులగుటచే అనువాదమును మూలానుసారిగను సరసముగను సంతరించి యున్నారు. కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకముగా వారు ప్రకటించిన స్వాతంత్ర్యము ప్రశంసాపాత్రముగా నున్నది. పాదాంతాక్షరముల విషయమున వారు సంస్కృతచ్ఛందోలక్షణము ననుసరించుటేకాక సంస్కృత వృత్తములనుకూడ విరివిగా వాడియున్నారు. శ్లేషలు గలచోట్ల అర్థద్వయమును వ్యక్తము చేయుటలో వారు చూపిన నేర్పు మెచ్చదగి యున్నది. పద్యములలో గ్రాంథిక వ్యావహారిక భాషా మిశ్రణము పూర్వ రచయితలలోకూడ ఉన్నమాట సత్యమే కాని అది అంత హృద్యముగా ఉండదని నా అభిప్రాయము.

శ్రీరామ చరితము—కల్యాణము అనునది గ్రంథకర్తగారి సొంత నాటకము. వాల్మీకి రామాయణమునందలి బాలకాండ కథ దీనికి మూలము. పాఠకానురక్తికై వారు కొన్ని దృశ్యములను కల్పించియున్నారు. నాటకమంతయు దృశ్యములుగా విభజింప బడినది. రెండవ దృశ్యము నందలి బ్రాహ్మణుల సంభాషణము వలన దశరథుడొనరించిన యజ్ఞముఅపూర్వవైభవము వ్యక్తమగు చున్నది. యజ్ఞసందర్భమున బ్రాహ్మణుల మాంసాహారముకూడ కావించినట్లు సూచించియున్నారు. యజ్ఞమిహపర సాధనమైన మహా కార్యమనిచెప్పి ఆ సందర్భమున జరిగిన విద్యావాద గోష్ఠులను వారు చక్కగా ప్రకటించియున్నారు. పాయస విభజనమును గూర్చి లోకమునగల శంకకు వారీ దృశ్యమున పరిష్కారము కావించియున్నారు. ఈ దృశ్యము గ్రంథకర్తగారి కల్పన, మూడవ దృశ్యము చిన్నదైనను సప్రయోజనమైనట్టిది. నారదుడు రాక్షసుల దుండగములను తత్పరిహారమునకై జరుగుచున్న ప్రయత్నములను ఇందు సూచించియున్నాడు. ఇందలి హనుమంతుని మధురగాన ప్రసక్తి హృద్యముగా నున్నది. నాల్గవ దృశ్యమునందలి రామలక్ష్మణుల వేట వృత్తాంతము కూడ కల్పితమే. ఐదవ దృశ్యమున నిద్రితులైన రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మేల్కొల్పుట రమణీయమై శ్రీరాముని అవతార మూర్తిత్వమును స్ఫురింపజేయుచున్నది. తాటక భర్తృప్రేమను వర్ణించు ఘట్టమమూలకము. ఆమె దివ్యస్త్రీగా మాఱుట అద్భుతముగా నున్నది. ఏడవ దృశ్యము సరస గంభీరమై గ్రంథకర్తగారి సంభాషణ రచనా కౌశలమును సూచించుచున్నది. తొమ్మిదవ దృశ్యమందు దశరథుడు "విశ్వామిత్రమహర్షిని తలచినపుడల్లా భార్గవరాముడు జ్ఞప్తికి వస్తాడు" అని పరశురాముని పాత్ర ప్రవేశమును సూచించుట సంస్కృత నాటక సంప్రదాయానుసారియై రమణీయముగా నున్నది. ఇందలి కల్పనలు, పద్యములు, సంభాషణములు గ్రంథకర్తగారి ప్రతిభను వేయి విధముల వ్యక్తీకరించుచున్నవి. ఈ రచన వారికి సంస్కృత నాటకములతోగల గాఢమైన పరిచయమును చక్కగా ప్రకటించుచున్నది.

ఈ నాటకములన్నింట రచన, పద్యములలోనైనను, గద్యములనైనను, ధారాళమై, భావగంభీరమై చదివినకొలంది చదువ వలెనను నుత్కంఠను రేకెత్తించుచున్నది. తీక్షణము మున్నగు ప్రయోగములను సవరించుట అంత క్లేశకరమైన పనికాదు.

— దివాకర్ల

ప్రకృతి ప్రబంధము

(తెలుగు కావ్యాలలో ప్రకృతి వర్ణన)

రచయిత : చేకూరి చెన్నకృష్ణయ్య

వెల: పదిరూపాయలు

పేజీలు : 296. డెమ్మీసైజు

ప్రతులకు : లక్ష్మీకేశవ నిలయం. 12 బారాగలీ కాలనీ

హైదరాబాదు-2 రచయిత పేర

తెనుగు సాహిత్యంలో ప్రబంధాలకు ఒక విశిష్టమైన స్థానం వుంది. ప్రబంధ పద్ధతి ఆ కాలంలో వందలాది పండిత కవులను ప్రభావితంచేసి, వారి కల్పనాశక్తికి పరాకాష్ఠగారూపొందింది. సాహిత్య కాలవిభాగంలో ఒక ప్రధానమైనయుగంగా ప్రబంధయుగం పేర్కొనబడింది. నాటికీ నేటికీ పోల్చిచూచుకుంటే సర్కస్ ఫీట్ల వంటి అంతటి మహాకల్పనలుచేయగలశక్తి, పాండిత్యము తగ్గిందని చెప్పలేముకాని వాటి అవసరం మాత్రం తగ్గిందని సర్వేసర్వత్రా అంగీకరించబడిన విషయం. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు ఒరవడిపెట్టిన కీ. శే. కట్టమంచి రామలింగారెడ్డిగారు భావబలం తక్కువైనచోట అలంకారాల ప్రాబల్యం ఎక్కువవుతుందని మొట్ట మొదటి సారిగా ప్రతిపాదించి, ప్రబంధాలలోని వర్ణనాధిక్యత మీద ఓం ప్రథమంగా దండెత్తారు. నేటికీ కూడా అదే అభిప్రాయం ఆధునిక సాహిత్యవేత్తలలో చెల్లుబాటు అవుతున్నది. నిజమైన కవిత్వానికి ఎన్నో అవరోధాలను తనలో యిముడ్చుకుని కూడా కొంత కాలం పాటు ఏకచ్ఛత్రాధిపత్యం వహించి రాజ్యంచేసిన యీ ప్రబంధయుగం, దాని ప్రారంభకులతో సరితూగలేని అనేకమంది స్వల్పపండితులచేతుల్లోపడి తెగిందాకా బిగదీయబడి క్షీణప్రబంధ యుగంగా పరివర్తనచెంది అభ్యుదయకారి ఆధునిక కవితోహలకు, విశ్వాసాలకు దారితీసింది. నిజానికి ఆధునికులు తిరుగుబాటుచేసినది యీ క్షీణప్రబంధయుగలక్షణాలమీదనే. వసుచరిత్రఅనే ఒక మంచి ప్రబంధంవస్తే, దానికితోకలుగా పిల్లవసు చరిత్రలు వందల సంఖ్యలో పుట్టాయి. కవిత్వంలో స్వంతగొంతు, నూతనత్వం, వ్యక్తిత్వం అనేవి నామరూపాలు లేకుండా పోయిన దశమీద ఆధునికులు తిరుగుబాటు చేశారు. దీనికి ఆధునికులకు అబ్బిన ఆంగ్ల సాహిత్యలక్షణ విజ్ఞానం చాలావరకు దోహదం చేసింది. ఆది ప్రబంధ యుగానికి సంబంధించినంతవరకు, నాటి సామాజిక, చారిత్రిక కారణాలవల్ల ఏర్పడిన ఆ ఉద్యమం యొక్క ప్రాధాన్యం మనం గుర్తించక తప్పదు. సాహిత్య చరిత్ర దానిని తుడిచి వేయలేదు.

కవిత్వం అనగానే వర్ణన తప్పదు. అది ఎంత మోతా దులో వుండాలనేది, ఆయా కాలాలలోని పాఠకుల అభిరుచుల మీద ఆధారపడి వుంటుంది. వర్ణన అనగా ప్రకృతికే ప్రాధాన్యం తప్పదు. తెనుగు కావ్యాలలో పూర్వకవులు చేసిన ప్రకృతి వర్ణనలు విష యంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రకటించిన పోటీకి వచ్చిన విమర్శ గ్రంథాలలో ఉత్తమమైనదిగా ఎన్నికై బహుమతి పొందిన గ్రంథం యిది. రచయిత వృత్తి రీత్యా పోలీసు అధికారిగా వుండి రిటైరైనవారు. పోలీసు శాఖలోకూడా ఇటువంటి సాహిత్య వేత్తలున్నారనేది ఆశ్చర్యపరిచే విషయం. "ఏ పుట్టలో ఏ పాము న్నదో" అనే తెలుగు సామెతకు యీ రచయిత చక్కని ఉదా హరణం అని చెప్పవచ్చు. ప్రబంధాలలోని వర్ణనలకు సంబంధించిన విమర్శ గ్రంథానికి ప్రకృతి ప్రబంధము అని పేరుపెట్టడం చాలా అందంగావుంది. ప్రబంధం అంటే కేవలం పద్య, గేయాత్మకమైన కావ్యాలే కాదనీ ఆ మాట వచన గ్రంథాలకూ, విమర్శ గ్రంథాలకు కూడా వర్తిస్తుందని వాఙ్మయాధ్యక్షులు శ్రీ వడ్లమూడి గోపాల కృష్ణయ్యగారు యీ గ్రంథానికి రాసిన తమ "వాక్చత్రం" లో చక్కగా సమర్థించారు.

వన జలకేళీ రవి శశి
తనయోదయ మంత్ర గతి రణ క్షితిప రణాం
బునిధి మధు రిపు పురోద్యా
న నగ విరహదూత్య వర్ణనాష్టాదశముల్...... అని నన్నెచోడుడు ప్రబంధములో వుండవలసిన అష్టాదశవర్ణనలను పేర్కొన్నాడు.

కథలో ఏదో విధంగా, అతుకులబొంతగా కల్పించుకుని అయినా పూర్వులు యీ వర్ణనలుచేసి తమ ప్రతిభను ప్రదర్శించుకోడానికి తంటాలుపడ్డారు. వర్ణనలు ఎంతకథాభంజకంగాఉన్నా, అవిపాత్రల తత్కాలపరిస్థితులకూ, మానసికస్థితికీ జోడింపబడి నట్లయితే కొంతలోకొంత మనోరంజకంగా వుంటుంది. తన వంశపురాజైన ఫలానావాడు యీ విధంగా అయినాడనే దిగులుతో రవి అస్తమించి నాడు-అన్నట్లు. ఈ రచయిత చాలాచోట్ల పాత్రలలో తాదాత్మ్యం పొందిన వర్ణనభాగాలను ఎత్తిచూపి, వాటిని వివరించడంలో కృత కృత్యుడయ్యాడు. ఈ పరిశీలన గ్రంథం మొత్తంమీద పూర్వప్రబం ధాలలోని ప్రకృతివర్ణనల క్రోడీకరణ అని చెప్పవచ్చు. ఫలానా వర్ణన ఆయా కవులు ఏఏ రకాలుగా చేశారని చూసుకోడానికి చక్కని రిఫరెన్సు గ్రంథంగా ఉపకరిస్తుంది. ప్రభాత-సూర్యోదయం, మధ్యాహ్నసమయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, సముద్ర, కాసార, నదీనద అరణ్య, పర్వత, ఆశ్రమ, ఋతు, వసంతర్తు, గ్రీష్మర్తు, వర్షర్తు, శరదృతు, హేమంత, శిశిర్తువులనే విభాగాల క్రింద ఆయా వర్ణనలు క్రోడీకరింపబడినవి. మరొక ముఖ్యవిషయ మేమంటే, రచయిత నన్నెచోడ మహాకవి మొదలుకొని, ఆధునికు లైన రాయప్రోలు, గురజాడ, విశ్వనాథ, దువ్వూరి, వేంకటపార్వ తీశ్వరకవులు, దాశరథి, నారాయణరెడ్డి ప్రభృతుల రచనల వరకు యీ పరిశీలన విస్తరింపజేయడం. "తాడివనములు తూర్పుకొండను గొడుగులెత్తెను"వంటి లవణరాజుకలలోని వాస్తవికతా ప్రాధాన్యంకల గురజాడవర్ణనలనూ, విశ్వనాథవారి 'తెనుగుఋతువుల'లోని తెనుగు జాతీయ జీవనప్రాధాన్యంగల వర్ణనలనూ ఆయా సందర్భములలో చక్కగా వివరించారు. ప్రబంధాలలో వర్ణనలను గురించి ఏవిధ మైన అభిప్రాయాలు కలవారైనా యీ పరిశీలనా గ్రంథాన్ని తప్పక చూడవలసిందే. రచయిత పాండిత్యము, ఆయన చేసిన కృషీ, అన్ని టినీ మించి సామాన్యపాఠకులకు యిబ్బంది కలిగించని సరళమైన శైలీ యీ విమర్శాగ్రంథానికి ఆభరణాలుగా వున్నాయి.

— చైతన్య

జీడికల్లు క్షేత్రము

[45 వ పుట తరువాయి]

జ్యోతులు వెలుగజొచ్చాయి. ఆ రెండు అఖండ జ్యోతులు కూడ ఇప్పటికీ ఆరిపోకుండా వెలిగిపోతున్నవి

జీడివంటి పాపములు కూడ పరిహారమైనవి, పరిహారమవు తవి కావున ఆ బండ నల్లబడి, ఆ గుండములు జీడిగుండములై ఆ గుండములు కలిగిన వీరాచల క్షేత్రము వాడుకతో 'జీడికల్లు' గా మారినది.

వరంగల్ జిల్లా ప్రాగ్దిశాంతమున కల 'భద్రాచలము' మ ట్లో, పశ్చిమ దిశాంతమున గల ఈ క్షేత్రము రెండవ 'భద్రాద్రి' యా యన్నట్లు విలసిల్లుచున్నది. గోదావరిచే అక్కడి దిక్కు. గుండములవలన ఇక్కడిదిక్కు. ప్రవాహోదకముచే అక్కడ పావన మైన ఆకాశగంగచే ఇక్కడ, అంతేగాక శ్రీరామ స్వహస్తమున పుట్టిన పాతాళగంగచేత ఈ ప్రదేశము పరమపావనమై భక్తులను కూడ పావనము చేయుచున్నది.

బాలచంద్రుడు పుట్టిన జ్ఞాపకార్థము కార్తీక పౌర్ణమినాడు స్వామివారి భక్తోత్సవములలో ఈ క్షేత్రము కనులపండువ కావించు ననుట అతిశయోక్తి కానేరదు ఇట్టి పుణ్యక్షేత్రము, చరిత్ర ప్రసిద్ధమైన ప్రదేశము మన ఆంధ్రప్రదేశమున వుండుట నిజముగా మనము గర్వించదగిన విషయము

జిల్లాల్లో

కరగట్టు కాలువలోకి నీటి విడుదల

ఖమ్మం జిల్లా, బూర్గంపాడు పంచాయతీ సమితి లోగల రాళ్ళవాగు ప్రాజెక్టుకు చెందిన కరగట్టు కాలువలోకి జనవరి 31 న జిల్లా కలెక్టరు శ్రీ గులామ్ జిలానీ నీటిని విడుదల చేశారు. ఈ సమితికి చెందిన కరగట్టు, సరకల్లు గ్రామాలలోని 350 ఎకరాలకు యీ కాలువ సేద్యపు నీటి సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఈ భూములు ప్రధానంగా గిరిజనులకు చెందినవి. కరువు నివారణ కార్యక్రమం క్రింద మంజూరైన రూ 60 వేలతో యీ కాలువ నిర్మించబడింది. పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ జె. సీతారామయ్య, శాసన మండలి సభ్యుడు శ్రీ టి. వెంకటప్పయ్య, తదితర బ్లాకు అధికారులు, అనధికారులు యీ కార్యక్రమానికి హాజరయ్యారు.

అధిక దిగుబడి ప్రత్తి పెంపకంపై సదస్సు

ఖమ్మం జిల్లా, నుడిమళ్ళ పంచాయతీ సమితికి చెందిన సత్యనారాయణపురం గ్రామంలోని అభ్యుదయ కర్షకుడు శ్రీ మోటూరు రాధాకృష్ణ తమ రెండెకరాల పొలంలోనూ అధిక దిగుబడి రకం ప్రత్తిని పండించారు.

విత్తనాలకు, ఎరువులకు, క్రిమి సంహారక మందులకు యీయన మొత్తం రూ 1200 లు ఖర్చు చేశారు. ఎకరాకు 16 నుంచి 17 క్వింటాళ్ళ ప్రత్తి దిగుబడి కాగలదని అంచనా. అంటే వీరికి ఎకరాకు నికరంగా రూ 3500 నుంచి రూ 4,600 వరకు లాభం వస్తుంది.


ఫిబ్రవరి 8వ తేదీన సత్యనారాయణపురం గ్రామంలో ప్రత్తి మీద ఒక సదస్సు ఏర్పాటు చేయబడింది. నూడిమళ్ళ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ పూనం రామచంద్రయ్య అధ్యక్షత వహించారు. వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు శ్రీ పి. వెంకటేశ్వర రావు యీ సదస్సుకు ప్రారంభోత్సవం చేస్తూ అధిక దిగుబడి ప్రత్తి రకాలను పండించడంలోగల లాభాలను గురించి వివరించారు.

నల్గొండ జిల్లాలో కరువు సహాయక కార్యక్రమం

నల్గొండ జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. రంగారెడ్డి అధ్యక్షతన ఫిబ్రవరి 6 వ తేదీన జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది.

ఈ సందర్భంలో జిల్లాకలెక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య ప్రసంగిస్తూ కరువు సహాయక కార్యక్రమం క్రింద రిగ్గులతో 600 నూతులు త్రవ్వబడినట్లు చెప్పారు. ప్రస్తుతం నల్గొండజిల్లాలో 3 రిగ్గులు పనిచేస్తున్నాయనీ, యీ సంవత్సరాంతానికి నల్గొండ జిల్లాలో ప్రతిగ్రామానికి రిగ్గునుయ్యి సౌకర్యం కల్పించబడుతుందని తెలియజేశారు.

ఈ జిల్లాలో 18 రక్షిత మంచినీటి పథకాలను పూర్తి చేసేందుకుగాను రూ. 4,22,000ల ఋణాన్ని సేకరించాలని సర్వ సభ్య సమావేశంలో తీర్మానించారు.



భద్రాచల రామాలయంలో ఇటీవల నిర్మించిన అయోధ్యాద్వారం వద్ద సోపానపం


మహిళల, బాలల గ్రంథాలయానికి ప్రారంభోత్సవం

జిల్లా గ్రంథాలయసంస్థ నెలకొల్పిన మహిళల, బాలల గ్రంధాలయానికి నల్గొండలోని బాల భవన్‌లో జిల్లాకలెక్టరు శ్రీ ఎల్. సుబ్బయ్య ఫిబ్రవరి 12న ప్రారంభోత్సవం చేశారు.

గ్రామీణ ప్రాంతాలలో గ్రంధాలయాల్ని ఏర్పాటుచేయవలసిన అవసరాన్ని గూర్చి కలెక్టరు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 బ్రాంచి లైబ్రరీలు, 93 అనుబంధ లైబ్రరీలు పనిచేస్తున్నాయనీ జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలోనూ, పట్టణం ప్రాంతాల్లోనూ మరిన్ని గ్రంధాలయాల్ని నెలకొల్పడానికి ఎంతో అవకాశంవుందనీ ఆయన చెప్పారు.

గ్రామీణ ప్రాంతాలలో మహిళామండలులు, యువజన సంఘాలూ ప్రారంభించే గ్రంథాలయాలకు ప్రభుత్వం ధనసహాయం చేస్తుందని, ఇంకా అనేక గ్రంథాలయాల్ని నెలకొల్పే అవకాశం యీ జిల్లాలో వున్నదనీ గ్రంథాలయశాఖ డైరెక్టరు శ్రీ కె.వి.వి. సుబ్బరాజు పేర్కొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ కె. వి. రెడ్డి సభికులకు స్వాగతం పలికారు. సంస్థ కార్యదర్శి శ్రీ కె. నాగేశ్వరరావు వందన సమర్పణ చేశారు.



భద్రాచల రామాలయంలోని వైకుంఠద్వారం

మంథెనలో మహిళామండలివారి వస్తుప్రదర్శన

కరీంనగర్ జిల్లా కలెక్టరు శ్రీ వి. కె. శ్రీనివాసన్ ఫిబ్రవరి 11 వ తేదీన మంథెనలో మహాలక్ష్మి మహిళామండలివారు ఏర్పాటు చేసిన కుట్లు, అల్లికలు, బొమ్మల ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రదర్శనలో రకరకాల ఫలహారాలను, పదార్థాలను కూడా తయారుచేసి అమ్మకానికిపెట్టారు. మంథెన పంచాయతీ అధ్యక్షులు శ్రీ పి. కిషన్‌రావు యీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సంచికలోని రచయితలు

శ్రీ పణతుల నరసింహయ్య, తెలుగు పండిట్, బి.జెడ్. హైస్కూలు, చిత్తూరు

శ్రీమతి కామర్సు సీతామహాలక్ష్మి, 1-8-461, చిక్కడపల్లి హైదరాబాదు

శ్రీ పి. రామకృష్ణారావు, కృష్ణాజిల్లా పౌరసంబంధ శాఖాధికారి

శ్రీ జి. వెంకట రామారావు, హెడ్‌మాస్టరు, జడ్. పి. హైస్కూలు ఇబ్రహీంపట్నం

శ్రీ కె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, సచివాలయం, హైదరాబాదు

శ్రీ యస్. వెంకటరంగారెడ్డి, బోటనీ జూనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిర్పూరుకాగజ్‌నగర్

డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు, తెలుగుశాఖాధ్యక్షుడు, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు

శ్రీ బి. సుదర్శనం, బి.ఎ.పి.ఆర్.ఓ. నర్సంపేట, వరంగల్ జిల్లా

డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి, రిసర్చి ఆఫీసర్, తెలుగు అకాడమి, హైదరాబాదు

శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యులు, ఎస్.ఆర్.టి/416, యాకుత్‌పురా కాలనీ, హైదరాబాదు

డా॥ ముదిగొండ శివప్రసాద్, 2/637, పక్కలగుట్ట, వరంగల్లు

శ్రీ టి. ప్రకాశరావు, పౌరసంబంధ అధికారి, గృహకల్ప, హైదరాబాదు

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 19, ఆదర్శనగర్ కాలనీ, హైదరాబాదు

శ్రీ ఎస్.ఆర్. కోటేశ్వరశర్మ, స్టేటిస్టికల్ సెక్షన్, ఎల్.ఐ.సి. డివిజనల్ ఆఫీసు, హైదరాబాదు

శ్రీ కె.వి. హనుమంతరావు, C/o ఆర్.వి.రెడ్డి, డిస్ట్రిక్ట్ మేనేజర్ టెలిఫోన్స్ కార్యాలయం హైదరాబాదు

శ్రీ కొసనం మహేశ్వరరావు, 6-3-354/16, హైదరాబాదు-34

శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం.ఎల్.సి. చిత్తూరు

శ్రీ ఇటిక్యాల మాణయ్య, పంచాయతీ సమితిబ్లాక్ జహీరాబాదు.

శ్రీ ఎ. పండరీనాథ్, టీచర్, ఇబ్రహీంపట్నం. హైదరాబాదు జిల్లా

Key contribution to key industries:



BHEL's Centrifugal Compressors

Custom-built for Fertilizer, Petroleum, Refrigeration, Chemical, Steel and other plants


BHEL build several advantages into their large capacity Centrifugal Compressors:

HIGH EFFICIENCY • MINIMUM SPACE NEEDS • DEPENDABILITY • LOW INSTALLATION AND MAINTENANCE COSTS!

Look at the variety:

- LOW, MEDIUM AND HIGH PRESSURE MULTI-STAGE COMPRESSORS WITH OR WITHOUT INTER-COOLERS
- ISOTHERMAL COMPRESSORS WITH BUILT-IN INTER-COOLERS
- LOW PRESSURE SINGLE STAGE COMPRESSORS USED AS INDUSTRIAL FANS OR BOOSTERS
- HIGH PRESSURE SINGLE AND MULTI-STAGE COMPRESSORS FOR MEDIUM AND HIGH PRESSURE PROCESSES

...all with ancillaries



With three Plants at Hyderabad, Tiruchirapalli and Hardwar, BHEL manufactures a wide range of equipment for generation, transmission and utilisation of electric power.

BHARAT HEAVY ELECTRICALS LTD.

(A Government of India Undertaking)

Ramachandrapuram, Hyderabad 32

Regd. Office: 5 Parliament Street, New Delhi 1

FDS/BHEL.1840 D

Statement of Ownership And Other Particulars About

"ANDHRA PRADESH"

FORM-IV

(*See Rule* 8)


Place of Publication	: Hyderabad.
Periodicity of Publication	: Monthly.
Printer's Name	: Director, Government Printing.
Nationality	: Indian.
Address	: Chanchalguda, Hyderabad-500036.
Publisher's Name	P. Vaman Rao.
Nationality	: Indian.
Address	: Director, Department of Information, Public Relations and Tourism, Hyderabad, A.P.
Chief Editor's Name	: P. Vaman Rao.
Nationality	:. Indian.
Address	: Director, Department of Information, Public Relations and Tourism, Hyderabad, A.P.
Name and address of individuals who own the Newspaper and partners or share-holders holding more than one per cent of the total capital.	Nil.


I, P. Vaman Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1-3-1973.
Hyderabad,

(Sd.) P. VAMAN RAO,
Signature of the Publisher.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISIM ANDHRA PRADESH, HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD




information